బుధవారం
06 ఫిబ్రవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 318

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | CIRCULATED IN TELANGANA & A.P STATES | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



రాశీఖన్నా కవయిత్రి 10

బకాయిలు 9 లోగా చెల్లించక పోతే
విద్యుత్ సరఫరా నిలిపివేత
- ఆంధ్రా, తెలంగాణాలకు ఎన్టీపీసీ హెచ్చరిక 4

విచారణపై దీదీకి
భయమెందుకు?
- మమతపై విరుచుకుపడ్డ ఆదిత్యనాథ్ 8



ప్రియాంక గాంధీ
పొలిటికల్ ఎంట్రీకి సిద్ధం
- నేమ్‌ప్లేట్ బోర్డు ఏర్పాటు
- కొత్తశోభను సంతరించుకున్న పార్టీ కార్యాలయం 8



వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్
ఆ ఘనత టీడీపీదే
- సూక్ష్మసేద్యంలో దేశంలోని తొలి 10 జిల్లాల్లో ఆరు ఏపీలోనే 7



మోదీనే మళ్ళీ ప్రధాని



- కేంద్రం కారణంగానే తెలంగాణ అభివృద్ధి
- వారంలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతిచ్చాం
- పోలవరానికి 100 శాతం నిధులిచ్చాం
- అభివృద్ధిలో రాజకీయాలు చేయం
- అవినీతి లేని పాలన మాది
- అభివృద్ధిని ప్రశ్నించలేక.. ప్రతిపక్షాల దుష్ప్రచారం
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

విజయక్రాంతి, హైదరాబాద్: ప్రధానిగా మళ్లీ నరేంద్ర మోదీనే పదవిని అధిష్టించబోతున్నారని మంత్రి నితిన్ గడ్కరీ జోస్యం చెప్పారు. మోదీని తిరిగి ప్రధాన మంత్రిని చేయడం కోసం కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి లో దేశ ముఖ చిత్రమే మారిపోయిందని నితిన్ గడ్కరీ తెలిపారు. ఇందులోభాగంగానే 55 ఏళ్లలో జరగని అభివృద్ధి.. ఇప్పుడు తెలంగాణలో జరిగిందని ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి హైదరాబాద్ లో సోమవారం జరిగిన సికింద్రాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్ లోక్ సభ నియోజకవర్గాల క్లస్టర్ సమావేశంలో శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జ్ లను ఉద్దేశించి గడ్కరీ మాట్లాడారు. ఈ సందర్భంగా తమ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయమని చెప్పారు. అందుకే 55 ఏళ్లలో జరగని విధంగా తెలంగాణ అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా కేంద్రం చేసిన అభివృద్ధి కనబడుతుందన్నారు. డీపీఆర్ లేకున్నా.. నీటి సమస్య పరిష్కారం కోసం కాళేశ్వరం ప్యాజెక్టుకు కేవలం వారం రోజుల్లో అనుమతులిచ్చామని తెలిపారు. ఈ విషయాన్ని హరీష్ రావును అడగండన్నారు.

కేవలం ఎన్నికల్లో గెలవడమొక్కటే కాదని చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, మళ్ళీ గెలిపించాలని కోరాలని సూచించారు. తెలంగాణ ప్రజలు బీజేపీని కచ్చితంగా ఆదరిస్తారని మెజారిటి సీట్లలో గెలుస్తామని అన్నారు. వచ్చే మంత్రివర్గంలో తెలంగాణ కు స్తానముంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ప్రాజెక్టును 100 శాతం నిధులను కేంద్రమే ఇచ్చిందని వెల్లడించారు. హిమాలయాలకు దూరంగా ఉన్న రాష్ట్రాల్లో.. నీటి సమస్య ఎక్కువ కాబట్టే మోదీ వచ్చాక ప్రధాని సించాయ్ యోజనలో.. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర లో ప్రాజెక్టులు అనుమతి ఇచ్చామన్నారు. అనుమతిచ్చిన 99 ప్రాజెక్టలలో 66 ప్రాజెక్టులు.. ఈ జూన్ లో ప్రారంభం.

ఆంధ్ర, తెలంగాణ.. 45 టీఎంసీ ల నీళ్ల విషయంలో.. నల్లా దగ్గర.. మహిళల లాగా సెక్రటరీ, మంత్రులు జగడం పెట్టుకోవడం చూసామన్నారు.మహారాష్ట్ర, చత్తీస్గఢ్, తెలంగాణ ల మధ్య కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం.. సీఎం కేసీఆర్..నా దగ్గర వచ్చారని తెలిపారు కేవలం 8 రోజుల్లో.. తెలంగాణ నీళ్ల కోసం.. మంజూరులు ఇచ్చామని, అభివృద్ధి కోసం రాజకీయాలు చెయ్యమన్నారు. తెలంగాణ కు సంబంధించి తన దగ్గరికి వచ్చిన రోడ్, ప్రాజెక్ట్ ఒక్కటి కూడా ఆగలేదన్నారు. వేల కోట్ల రూపాయల ప్రాజెక్ట్ ల లో ఒక్క రూపాయి అవినీతి లేదన్నారు. దేశం సూపర్ పవర్ దేశం కావడమే మా లక్ష్యమన్నారు. సర్వ ధర్మ..సమాభావన మీద.. పని చేస్తున్నామని తెలిపారు.రాజు, ప్రభుత్వం, పరిపాలన సెక్యూలర్ గా ఉండొచ్చు కానీ వ్యక్తి ఎప్పుడూ సెక్యూలర్ కాలేడన్నారు. ప్రాంత, భాష, జాతి, ధర్మం బేధము లేకుండా పరిపాలన సాగిస్తున్నామని చెప్పారు. అందుకే ఆర్థిక వివక్ష లేకుండా ఆర్థికంగా వెనకబడిన వర్గాల కు పది శాతం.. రిజర్వేషన్ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.తప్పుడు పనులు చేస్తేనే కాదు.. మంచి అభివృద్ధి పనులు చేసి కూడా అంతకన్నా ఎక్కువ .. శత్రువులు పెరుగుతారని అర్థం అయిందన్నారు. మేము చేసిన అభివృద్ధిని ప్రశ్నించలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

మోదీ ముస్లిమ్స్ ని పాకిస్థాన్ పంపిస్తారని ప్రచారం చేశారన్నారు. దళిత ఆదివాసీల కు బీజేపీ మీద ద్వేషం పెంచే ప్రయత్నం చేశారని విమర్శించారు. మోదీకి వ్యతిరేకంగా చంద్రబాబు, కాంగ్రెస్ దోస్తిని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఒకరికొకరు నమస్కారం చేసుకోలేని, మొహం కూడా చేసుకోలేని వారు.. కూటమి కడుతున్నారని ఎద్దేవా చేశారు. మొన్న తెలంగాణలో రాష్ట్ర ఎన్నికలు..ఇప్పుడు ఢిల్లీ లో ఎవరుండాలి అన్న అంశంపై ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. దేశంలో బలమైన, పటిష్టమైన ప్రభుత్వం కావాలా, కిచిడీ ప్రభుత్వం కావాలా అంటే బలమైన ప్రభుత్వం కావాలని ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ఆత్మవిశ్వాసం తో వెళ్ళండి తెలంగాణా లో ప్రజలు బీజేపీ ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ప్రజలను కన్ఫ్యూజ్ చేసే రాజకీయాలు జరుగుతాయి..జాగ్రతగా ఉండాలని సూచించారు.

ప్రతిపక్షాలు.. మోడీ కి వ్యతిరేకంగా (తరువాయి 4లో)



దక్షిణ మధ్య రైల్వే జీఎంగా గజానన్ మాల్య

విజయక్రాంతి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే నూతన జనరల్ మేనేజర్‌గా గజానన్ మాల్య పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఎంఇ)కి చెందిన శ్రీ గజానన్ మాల్య 1979 బ్యాచ్‌కి చెందిన స్పెషల్ క్లాస్ రైల్వే అప్రెంటిస్‌గా రైల్వేలో ఆయన తన సర్వీసు ప్రారంభించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా నియమించబడే వరకు ఆయన బీహార్‌లోని జమాల్పూర్ ఇండియన్ రైల్వే ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ అండ్ ఎక్ట్రికల్ ఇంజనీరింగ్ (ఐఆర్ఎస్ఎంఇ) సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు. గజానన్ మాల్య ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటర్జీలో ఎఎంఐఇ (ఇండియా) డిగ్రీను సాధించారు. దీనితో పాటు లండన్ నుండి మెకానికల్ ఇంజనీరింగ్‌లో సైతం ఎఎంఐఇ డిగ్రీని పొందారు. ముంబాయి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఐఆర్ఎస్ఎంఇ) ద్వారా ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా పొందారు. భారతీయరైల్వేలో వివిధ విభాగాల్లో విశిష్ట సేవందించి గజానన్ మాల్య విశేషమైన అనుభవం గడించారు. (తరువాయి 4లో)

అటవీ శాఖలో ప్రక్షాళన షురూ

- భారీ స్థాయిలో బదిలీలకు సీఎం ఆదేశం
- 11 మంది పై సస్పెన్షన్ వేటు
- 200 మంది బదిలీ
- సమర్థులకు ప్రాధాన్యం



విజయక్రాంతి, హైదరాబాద్ : రాష్ట్రంలో అడవులను స్మగ్లర్ల బారినుంచి రక్షించటానికి వీలుగా అధికార యంత్రాంగాన్ని ప్రక్షాళన చెయ్యటానికి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు ఆదేశాలకు అనుగుణంగా అటవీశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా సమర్థులైన అధికారులకు అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు బదలీ చేసి కీలక బాధ్యతలు అప్పగించారు. స్మగ్లర్లకు సహకరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 11 మంది అధికారులపై సస్పెన్షన్ వేటుపడగా సుమారు 200 మంది సిబ్బందిని బదలీ చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. పలువురికి మెమోలు జారీచేశారు. అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో కఠినంగా వ్యవహరించే నిబద్ధత, అంకితభావం కలిగిన అధికారులను నియమించాలనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అటవీశాఖ భారీ బదిలీలకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. అడవుల సంరక్షణ విషయంలో, అటవీ భూముల్లో చెట్ల పెంపకంపై చిత్తశుద్ధి చూపించే అధికారులను ముఖ్యమైన ప్రాంతాల్లో నియమించారు. జంగిల్ బచావో జంగిల్ బడావో నినాదంతో అడవుల సంరక్షణకు, అటవీ భూముల్లో అడవి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఇటీవలే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. అడవిని రక్షించే బాధ్యతను అంకితభావం కలిగిన అధికారులకు అప్పగించాలని స్పష్టంగా చెప్పారు. ఎక్కువ మంది అధికారులు హైదరాబాద్ లో ఉండడం కాకుండా, క్షేత్రస్థాయిలో పనిచేయాలని కూడా సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అటవీశాఖ సంస్కరణలు ప్రారంభించింది. ముఖ్యమైన ప్రాంతాల్లో మంచి అధికారులను నియమించడం, స్మగ్లర్లకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి మెమోలు ఇవ్వడం లాంటి చర్యలు చేపట్టింది.

200 మంది బదిలీ

అడవులను సంరక్షించడంలో మంచి పేరున్న అధికారులను ముఖ్యమైన ప్రాంతాల్లో నియమించింది. దీంతో చీఫ్ కన్సర్వేటర్ నుంచి బీట్ ఆఫీసర్ వరకు దాదాపు 200 మంది బదిలీ అయ్యారు. ఈ బదిలీల ఫైలుపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సంతకం చేశారు. జిల్లా అటవీ అధికారులుగా పనిచేస్తున్న చీఫ్ కన్సర్వేటర్లు, కన్సర్వేటర్లు, డిఎఫ్ఓ స్థాయి కలిగిన 21 మందికి ముఖ్యమైన జిల్లాల బాధ్యతలు అప్పగించారు. చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎకె సిన్హాకు అచ్చంపేట బాధ్యతలు, కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ హోదా కలిగిన శర్వానంద్, వినోద్ కుమార్ లకు మెదక్, కవ్వాల్ బాధ్యతలు అప్పగించారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, మంచిర్యాల, పాల్వంచ, కిన్నెర సాని, వరంగల్, ఖానాపూర్, నిజామాబాద్, అమ్రాబాద్, బాన్సువాడ, ఇల్లందు, కాగజ్ నగర్, ఇచ్చోడకు కొత్త డి.ఎఫ్.ఓ.లను నియమించారు. 19 మంది రేంజ్ ఆఫీసర్లను మార్చారు. మహబూబాబాద్, గూడూరు, గంగారం, బయ్యారం, ఆజంనగర్, పెద్దపల్లి, నర్సంపేట, మంచిర్యాల, డోర్నకల్, (తరువాయి 4లో)

దీక్ష విరమించిన దీదీ

- విపక్షాలకు మమత మూలస్తంభంలాంటివారు: చంద్రబాబు
- పోలీస్ కమీషనర్ విచారణకు సహకరించాలన్న సుప్రీం
- కమిషనర్ రాజీవ్‌కుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరిన కేంద్రం



కోల్‌కతా, ఢిల్లీ: శారదా చిట్‌ఫండ్ స్కాంలో కోల్‌కతా పోలీస్ కమీషనర్‌ను ప్రశ్నించేందుకు సీబీఐ చేసిన ప్రయత్నాలను తిప్పికొడుతూ 'రాజ్యాంగ పరిరక్షణ' పేరుతో గత ఆదివారం నుంచి మమతా బెనర్జీ కొనసాగిస్తున్న దీక్షను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం సాయంత్రం విరమింపజేశారు. అంతకు ముందు మమతాబెనర్జీతో కలిసి ధర్నాలో పాల్గొన్న చంద్రబాబు మమతపై ప్రశంసలు కురిపించారు. దీక్షకు సంఘీభావం తెలిపారు. విపక్షాలకు మమత మూలస్తంభంలాంటి వారని, ఆమె నాయకత్వంలో పశ్చిమబెంగాల్ లోక్సభకు జరిగే ఎన్నికల్లో మొత్తం 42 స్థానాలు టీఎంసీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. సమష్టిగానే విపక్షాలు పోరాటాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తాయని చెబుతూ మమతను దీక్ష విరమించాలని ఆయన కోరారు. దీంతో మమత దీక్షను విరమిస్తున్నట్టు ప్రకటించారు.

మరోవైపు ఈ విషయంలో కేంద్రం తన పట్టు వీడటం లేదు. నగర పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్ర ప్రభుత్వానికి మంగళవారం రాసిన లేఖలో రాజీవ్ కుమార్ కొందరు పోలీసు అధికారులతోపాటు ముఖ్యమంత్రి మమత బెనర్జీతో కలిసి ధర్నాలో పాల్గొన్నట్లు తమకు సమాచారం అందిందని, ఇది ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకమని తెలిపింది.

కుంభకోణాల్లో శారదా స్కాం తీరు వేరయా...

- రూ. 60 నుంచి 70 వేల కోట్ల మేరకు డిపాజిట్ల సేకరణ
- 17 లక్షల మంది కష్టజీవుల కన్నీళ్లు
- స్కాంలో అరెస్టయిన ఇద్దరు తృణమూల్ ఎంపీలు, మాజీ డీజీపీ, బెంగాల్ మంత్రి
- సెబీ వార్నింగ్ ఇచ్చినా పట్టించుకోకుండా డిపాజిట్ల సేకరణ
- కోట్ల రూపాయలు చెల్లించి మమత పెయింటింగ్‌లు కొన్న చిట్‌ఫండ్ కంపెనీ

కోల్‌కతా: సీబీఐ వర్సస్ పోలీసుల వివాదంగా మారి, దేశవ్యాప్తంగా తీవ్ర దుమారాన్నే రేపుతున్న మమత దీక్ష వెనుక మతలబేంటి? అనే విషయం తెలియాలంటే అసలు శారదా కుంభకోణమంటే ఏమిటో తెలుసుకోవాలి... పోలీసు కమిషనర్‌ను ప్రశ్నించేందుకు వచ్చిన సీబీఐనే మమత అడ్డుకొని అరెస్టులు చేయించారంటే దీని వెనుక ఉన్న మర్మమేంటి? సీబీఐ X పోలీస్, మోదీ X దీదీ గొడవలో తమ కష్టార్జితాన్ని పోగొట్టుకున్న 17 లక్షల మంది కష్టజీవుల కన్నీళ్లున్నాయి...

2000లో చిట్‌ఫండ్ కంపెనీలు ప్రారంభించిన శారదా గ్రూపు అనతి కాలంలోనే బెంగాల్ సహా నాలుగు రాష్ట్రాల్లో 17 లక్షల మంది నుంచి రూ.4,000 కోట్ల వరకు.. (తరువాయి 4లో)

శారదా కుంభకోణం కథా కమామిషూ..

- 2000లో చిన్న చిట్‌ఫండ్ కంపెనీని దక్షిణ కోల్‌కతాలో ప్రారంభించిన నక్సల్ నేత సుదీప్తో సేన్
- 2006లో రామకృష్ణ పరమహంస సతీమణి శారదాదేవి పేరిట రిజిస్ట్రేషన్
- 2007లో లక్ష మంది సభ్యులతో రిజిస్టర్ అయిన కంపెనీ పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, అస్సాం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన పలువులు రాజకీయ, సినీ, క్రీడాకారుల చేరిక
- 2008లో పదిహేడు లక్షల మంది సభ్యులతో 20వేల కోట్లు దాటిన డిపాజిట్లు
- 2009లో శారదా చిట్‌ఫండ్, పోంజీ స్కీముల్లో భారీ అవకతవకలను పసిగట్టిన సెబీ
- 2010 శారదా గ్రూప్‌లోని అన్ని కంపెనీల బ్యాలెన్స్ షీట్లను సిద్ధం చేయాలని కోరిన సెబీ
- 2011 వేల కోట్ల రూపాలను సింగపూర్, యూఏఈ, దక్షిణాఫ్రికాలకు పంపిన శారదా నిర్వాహకులు
- 2011 సుదీప్‌తో సేన్ ఆధ్వర్యంలోని శారదా కంపెనీపై బెంగాల్ సర్కార్‌ను హెచ్చరించిన సెబీ
- 2012 తక్షణమే డిపాజిట్ల సేకరణను ఆపాలనీ, కంపెనీల చట్టాలను పాటించాలని ఆదేశించిన సెబీ
- 2013 కోల్‌కతాలో 600 మంది డిపాజిట్‌దార్ల ధర్నా, 400 మంది నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ దాఖలు..
- 2013 ఏప్రిల్ శారదా కంపెనీ చైర్మన్ సుదీప్‌తోను కశ్మీర్‌లో అరెస్ట్ చేసిన కోల్‌కతా పోలీసులు
- 2013 ఏప్రిల్ 22..జస్టిస్ శ్యామల్ కుమార్ ఆధ్వర్యంలో జ్యుడీషియల్ విచారణ కమిటీ వేసిన మమతా బెనర్జీ సర్కార్
- 2013 డిసెంబర్ కేంద్ర మంత్రి చిదంబరం భార్య నళినీ చిదంబరంపై చార్జ్‌షీట్ ఫైల్ చేసిన సీబీఐ
- 2014 శారదా చిట్‌ఫండ్ స్కాం, డిపాజిట్ల సేకరణ అంశాలను సీబీఐకి బదలాయించిన సుప్రీం కోర్టు
- 2014 చైర్మన్ సుదీప్‌తో, డైరక్టర్ దేబాంజీ ముఖర్జీ మరికొంతమంది కీలక నిందితులను సీబీఐకి అప్పగించిన బెంగాల్ పోలీసులు



శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికంబి నామ సంవత్సరం	సూర్యోదయం : ఉ. 06:47	కరణం	: భాలవ 18:34 కౌలవ రాత్రి మొత్తం
ఉత్తరాయణం	సూర్యాస్తమయం : సా. 06:13	రాహుకాలం	: మ. 12:30, 01:55
శిశిర ఋతువు	పక్షము : శుక్లపక్షం	యమగండం	: ఉ. 08:15, 09:40
మాఘ మాసం	తిథి : విదియ రాత్రి మొత్తం	వర్జ్యం	: ఉ. 05:15 07:03
	నక్షత్రం : ధనిష్ఠ 09:08	అమృతకాలం	: ఉ. 04:03, 05:51
	యోగం : పరిఘ 09:55		



సూక్తి సుధ



ఎవరైతే ఇతరులతో సేవ చేయించుకుంటారో వారు మరో జన్మలో వారికి సేవ చేయాల్సి ఉంటుంది.

– ప్రజాపిత బ్రహ్మబాబా

శ్రీ చక్ర సంచారిణి

త్రిగుణాత్మక స్వరూపిణి



శరీరానికి మనసుతో భక్తి అనుబంధాన్ని కల్పించి కటాక్షించి జ్ఞానమనే రాజమార్గంలో నన్ను నడిపిస్తూన్న శ్రీ భువనేశ్వరీ నాకు మార్గనిర్దేశనం చేయుగాక! పంచభూతేష్వియై, బాహ్యంగా నా ఊపిరియై అంతర్ముఖంగా ఊహయై, పంచకోశస్వామినిగా నా ఆనంద సామ్రాజ్యాన్ని పరిపాలించుగాక! సర్వం సమర్పయేత్ రాజరాజేశ్వరీ అన్నట్టు నా ఊపిరిలోని ఉద్వేగాన్ని, ఆలోచనా బలాన్ని దైవ బలంతో కలిపి పుటం పెట్టాలంటే నీ ఆశీర్వాదబలం కావాలి. మరి ఆలస్యం చేయక "క్లీం" కార స్వరూపమై నీ సత్తాను ప్రకటితమయ్యేలా చెయ్యి. నిస్వార్థమైన కపటంలేని నడకను, నడవడితో జోడించి భక్తి మార్గంలో అనుభూతించే అర్హతను కటాక్షించు. పంచకోశాలపై నియంత్రణ కలిగేలా నా ప్రాణశ్వాసను శాసించు. ఎలా శాసించినా నీ అనుగ్రహం పొందే ఆలోచనలను మాత్రమే స్ఫురింపచేయుగాక! ప్రతి ఆలోచనా ఆచరణగా స్థిరపడుగాక! నా ప్రతి అడుగులోని ప్రతి మలుపును ఒక రాజపీఠంగా నీ శుభాశీస్సులతో అర్హతనిచ్చే అనుగ్రహంగా పసుపు కుంకుమలను పంచిపెడుతున్నాను. నీ అనుగ్రహ ధనసంపత్తి, అధికార పరిధి, ఒక పద్మమైనా, ఒక శంఖమైనా సరే నీ దయకు పాత్రురాలిగానే నన్ను దీవించాలి. నీ స్మరణతో నీకు చేరువగా నాచేత వేయించే ప్రతి అడుగు ప్రజాశ్రేయస్సు గురించి నా అనుకునే విధంగా, నీ సేవయే నా అభివృద్ధికి పాచికలు వేయాలని ప్రార్థిస్తున్నాను.

నీ ఆశీర్వాద బలంతో రెట్టించిన ఉత్సాహంతో ఎదుటివారి దురాలోచనలను గెలువగలిగిన పరిశీలనా శక్తితో నన్ను ఉద్విగ్నపరచుగాక! ఆ శ్రీ చక్ర సంచారిణికి నా మనోవీధిలో అనుక్షణం ఆవహించిన నారీ దీనజనోద్ధరణలోని 'సమస్య'లను పరిష్కరించే శక్తిని ప్రసాదించుగాక! తక్షణమే సమస్త నారీ లోకాల్లోని అజ్ఞానాంధకారం తొలగింపబడుగాక! సంకల్ప బలంతో, బలవత్తరమైన మనోబలంతో సమస్యలను ఎదుర్కొనే వీరత్వాన్ని మాకిచ్చి ధీర వనితగా నన్ను మలచుగాక! మాకు యుద్ధ వ్యూహాలను ఎదిరించి పోరాడే ఆలోచనా విధానమిచ్చి నీకృపాకటాక్షాలే మాకు రక్షణ కవచాలగుగాక!నేను నిమిత్తమాత్రురాలిని, నీ ఆజ్ఞకు సేవకురాలినై నీ అనుగ్రహం పొందడానికి, నీ సంతృప్తికై, నా సంతోషానికై చేసే ఈ అలంకరణను, "నీ స్వరూపమంటే ఇదే" అనే లాగ మనోరంజకంగా నీవే స్వయంగా అలంకరించు కుందువుగాక.



–సి. విజయలక్ష్మీ రాజం

ఏ రాజ్యపీఠానికి తీసిపోని నా మనోపీఠంపై నీవు పంచ కోశాధికారిణివై అధిష్టించు. నీ కృపాకటాక్షాలను వర్షించే సామ్రాజ్య ప్రదాయినివై అలంకృతవు కావడానికి ఆనంద రాజ్యలక్ష్మిగా కొలువుతీరుదువుగాక. ఈ పద్ధతిలోని వివరాలను, అర్థాలను, స్వరూపాల అనంతమైన శక్తిని, ఈ పవిత్రమైన చతురంగలేశ్వరిగా దర్శింపచేసే భావోద్వేగానికి భక్తితో సంకల్పం చేస్తున్నాను. నా సంకల్పానికి బలమిస్తూ ముందుగా సిద్ధి, బుద్ధి, సహిత విఘ్నేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఈ వ్రతకార్యక్రమం లక్ష్మీ వైభవానికి అద్దం పట్టేలా నిర్విఘ్నంగా కొనసాగాలని ప్రార్థిస్తున్నాను. ఈ ప్రార్థనా బాధ్యతను గణపతియే స్వీకరించి శ్రీకారం చుట్టించాలి. ఈ కార్యక్రమము మనోవేగంగా, లోపరహితంగా, సంపూర్ణ ఆకృతి పొందేలాగా నాకు మానసిక శక్తినిస్తూ, బాహ్యంగా, అదృశ్యంగా ఎదురయ్యే అడ్డంకులను నిర్మూలించాలని వేడుకొంటున్నాను. అన్నదమ్ములిద్దరూ వరలక్ష్మీ అమ్మవారిని అలంకరించే విధానంలో నాకు తోడు, నీడగా ఉండాలి. అందుకు తనవంతు సహాయాన్ని వల్లి, దేవసేన సహిత కుమారస్వామి శీఘ్రంగా ఇవ్వాలని కోరుకుంటున్నాను.



వృద్ధులకు భార్యా వియోగం మృత్యువుతో సమానం



చాణక్యం

శ్లో।। వృద్ధకాలే మృతా భార్యా బంధుహస్తే గతం ధనమ్।
భోజనం చ పరాధీనం తిస్రః పుంసాం విడమ్బనాః।।

వృద్ధాప్యంలో భార్య మరణించుటయు, ధనం బంధుబాంధవుల, మిత్రుల చేతుల్లో చిక్కుకొనడం, ఇతరుల అధీనంలో ఉన్న భోజనం – ఈ మూడును మనుషులకు మృత్యువుతో సమానంగా ధుఃఖాన్ని కలిగించేవే అని చాణక్యుడు తమ నీతిశాస్త్రంలో మనకు విశదపరుస్తున్నారు. సాధారణంగా జరామరణాలు సహజంగా సిద్ధిస్తాయి. కాని కొంతమంది అల్పాయుష్కులుగా మరణిస్తుంటారు. కొంతమంది దీర్ఘాయుష్కులుగా మిగిలి ఉంటారు. ఈ దీర్ఘాయుష్కుల్లో భార్య మరణించటం అనేది జరుగుతూ ఉంటుంది. ఆ పరిస్థితుల్లో ఆ భర్తపడే బాధ వర్ణనాతీతమని చాణక్యుల వారు పేర్కొంటున్నారు. ఎందుకంటే భర్తకు ఏమి కావాలన్నా సమకూర్చేది భార్యే. ఇక ఆ వయస్సు వచ్చిన తర్వాత పుత్రులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు ఎంతమంది ఉన్నా వారిని పైపైనే పలకరించి పట్టించుకుంటారే తప్ప వివరంగా భార్య అతని బాధల్లో పాలు పంచుకున్నట్టుగా ఎవరూ పంచుకోలేరు. అలాంటి పరిస్థితుల్లో భర్త మనోవేదనతో పరితపించిపోతుంటాడు. క్షణక్షణానికి భార్యను తల్చుకుంటూ గడిపేస్తుంటాడు. దానికి తోడు ఆ వయసులో ఏవైనా ఆస్తులు, ధనం, నగలు వంటివి ఉంటే వాటిని తనకున్న సంతానానికి సరిసమానంగా పంచేసి కృష్ణా, రామా అనుకుంటూ గడిపేద్దామనుకుంటాడు. కానీ ఆ విధంగా చేయడం వల్ల ఇంకా ఒంటరితనంతో ఇంకా కుంగిపోతుంటాడు. ఎందుకంటే తన చేయి దాటిపోయిన నగా, నట్రా, సొమ్ము గురించి ఒంటరితనంతో ఆలోచిస్తూంటాడు. ఎందుకంటే పెద్దాయన గురించి వారు ఏమీ ఆలోచించే పరిస్థితుల్లో ఉండరు. ప్రతిదానికి వారి మీదే ఆధారపడాల్సి వస్తుంది. వారు ఏదైనా సమస్యలతో సతమతమవుతూంటే ఆ పరిస్థితిలో వారిని అడగలేడు. అడిగినా వారు విసుక్కుంటారే తప్ప ఈ పెద్దాయన గురించి ఏమీ పట్టించుకోరు. ఈలాంటి పరిస్థితుల్లో దగ్గర బంధువులు, మిత్రులు కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉంటారు. ఇటువంటి సమయంలో పెద్దాయన నిస్సహాయ పరిస్థితుల్లో ఉంటాడు. ఈయన బాధ వర్ణనాతీతం. ఎవరో కొద్దిమంది పుత్రులు, కూతుళ్ల మాత్రం ఈయనతో ఉన్నవారి అనుబంధం కొద్దీ పట్టించుకుని ఆయన కోరిక తీరుస్తారు తప్ప, సాధారణంగా సగటు మానవుడు మాత్రం వారి సంసారం గురించే ఆలోచిస్తుంటారు తప్ప ఏమీ పట్టించుకోలేని స్థితిలో ఉంటారు. అది వారి తప్పుకాదు ఇప్పటికాల పరిస్థితులు ఇలాగే ఉంటున్నాయి. ఎందుకంటే నిరంతరం భర్త, భార్య, పిల్లలు సంపాదిస్తున్నా సంసారం గడిచే స్థితిలో ఉండటం లేదు. అటువంటి స్థితిలో ఈయన్ని ఎలా పట్టించుకుంటారు అనే ప్రశ్న కూడా వస్తుంది. కాబట్టి ఈ పరిస్థితులన్నీ మృత్యువుకు దగ్గరగా ఉన్న పెద్దవాళ్లకు అమిత దుఃఖాన్ని కలిగిస్తాయని చాణక్యుల వారు తెలియపరుస్తున్నారు.



సూర్య వృత్తాంతం

పురాణ కథలు

దేవతాకోటిలో ప్రముఖులుగా పరిగణింపబడేవారిలో ఒకడయిన విశ్వకర్మ కుమార్తె సంజ్ఞ. విశ్వకర్మ తన కుమార్తెకు అనురూపవంతుడయిన భర్తగా సూర్యుణ్ణి అర్థించాడు. సూర్యభగవానుడు విశ్వకర్మ అభ్యర్థనను అంగీకరించి సంజ్ఞాదేవిని భార్యగా స్వీకరించాడు. సంజ్ఞాదేవి సూర్యదేవుని ధర్మపత్నియై విధ్యుక్తంగా సంసారం సాగించింది. సూర్యభగవానుని వల్ల సంజ్ఞాదేవి సర్వసుఖాలనూ అనుభవిస్తూ కొంతకాలం సంతోషప్రదమయిన సంసారిక జీవితాన్ని నిర్వహించింది.

(ఆ సుఖమయ సాంసారిక జీవితాన్ని నిర్వహిస్తూన్నపుడే సంజ్ఞాదేవి గర్భవతియై ఒక శుభముహూర్తమున కుమారుని కన్నది. ఆ బిడ్డకే వైవస్వతుడని నామకరణ మొనర్చారు. వివస్వంతుని కుమారుడగుట వైవస్వతనామమాతనికి ప్రాప్తించినది)

యమధర్మరాజు, యమునల జన్మ వృత్తాంతం

సూర్యభగవానుడు సహస్రకిరణద్యుతితో సంజ్ఞాదేవి యెదుట నిలిచాడు. ఆ చండతీక్షణ స్ఫూర్తిని సహించలేక ఆమె కనులు మూసుకొన్నది. సూర్యుడు కుపితుడై : 'నన్ను చూసి నీవు నేత్రసంయమనం చేశావు కనుక నీ గర్భం నుండి సంయముడు ఆవిర్భవిస్తాడు' అన్నాడు. సంయముడే సర్వ ప్రపంచధర్మాక వ్యవస్థను పరిపాలించే యముడు. ప్రజానీకాన్ని శాసించే యమధర్మరాజితడే. సూర్యుని నోటి నుండి వెలువడే ఆ వాక్యాలు వినేసరికి ఆమె హృదయం గజగజలాడిపోయింది. ఆమె కన్నులు చలించాయి. ఆ చంచల నయనాలను ఆలోకించిన సూర్యుడు తిరిగి క్రోధావిష్టుడై ఇలా అన్నాడు. 'నువ్వు మళ్లీ కన్నులను విచలింపచేస్తూ నన్ను చూశావు కనుక నిరంతరం చలించే తరంగాలతో ఉండే నదీరూపంలో నీకు ఒక కుమార్తె కలుగుతుంది!' ఈ మాటలు విని సూర్యుని ధర్మపత్ని కొద్దిగా చకిత అయినా నిబ్బరించుకు నిలబడింది. మహామహుడైన సూర్యుని వాక్యానుసారం సంజ్ఞ నదీరూపంలో ఒక కుమార్తెను ప్రసవించింది. అదియే యమునా నది. భారతవర్షంలో పవిత్రమైన నదులలో ప్రముఖంగా పరిగణించే యమున ఇదే. దీనినే ఉత్తరదేశీయులు జమున అని వ్యవహరిస్తారు.

సంజ్ఞకు మారుగా 'ఛాయా' సృష్టి..

రాను రాను సంజ్ఞాదేవి సూర్యుని ప్రతాపాన్ని సహించలేకపోయింది. కొంతకాలం విశ్రాంతిగా బతకాలనిపించింది. ఆలోచించి ఆలోచించి పుట్టింటికి పోవటానికే నిశ్చయించుకుంది.

అదే సమయంలో తన శరీరం నుండి ఛాయను సృష్టించి తనకు మారుగా తన ఛాయను సూర్యపత్నిగా వ్యవహరించమని, పిల్లలను ఆదరంతో సాకమని చెప్పి వెళ్ళిపోయింది. తండ్రి ఆదరంతో స్వాగతమిచ్చాడు. కొంతకాలం సంజ్ఞ పుట్టింట గడిపింది. ఒకనాడు తండ్రి సంజ్ఞను పిలిచి ఆడవాళ్ళు పుట్టింట చిరకాలం ఉండటం మంచిది కాదమ్మా! మంచిరోజు చూచి, నీవు అత్తవారింటికి వెళ్ళాలి అని నెమ్మదిగా చెప్పాడు. తండ్రి మాటలను ఆలకించి సంజ్ఞ ప్రయాణోన్ముఖురాలయింది. కాని మధ్యలో ఒక్కసారిగా సూర్యుని చండకిరణతీక్షణత్వం సంజ్ఞను భయపెట్టినది. తక్షణం ఆమె ఉత్తరకురు భూములవైపు ప్రయాణం సాగించింది. అక్కడ ఒక ఆశ్రమ సమీపాన్న అశ్వరూపం ధరించి తపస్సు చేయసాగింది. అక్కడ ఛాయ సూర్యభగవానుని కృపా విశేషంచేత ప్రతాపవంతులైన ఇరువురు కుమారులను, సౌందర్యవతియైన ఒక కుమార్తెను కన్నది. ఛాయ సంతానం పెరిగి పెద్దవారయ్యేకొద్దీ ఛాయకు, సంజ్ఞ పిల్లల మీద ఒక విధమైన అలసభావం ఏర్పడింది. ఆమె చులకన భావాన్ని వైవస్వతుడు అంతగా పట్టించుకునేవాడు కాదు. కాని యమునికి ఆమె ప్రవర్తనపై అసహ్యం, చిరాకు ఎక్కువ కాసాగినవి. ఒకనాడు ఛాయను యముడు తీవ్రంగా ఎదిరిస్తున్న సమయంలో ఛాయ కోపాన్ని పట్టలేక ఇలా అంది.'త్రిలోకైక సాక్షియైన సూర్యభగవానుని ధర్మపత్నిని నేను. అటువంటి నన్ను ఎదిరించి తిరస్కరించే నీ సాహసానికి శిక్ష అవసరం. ఈ క్షణంలోనే నీ రెండుకాళ్ళు తెగిపడిపోవుగాక!'. ఈ విధంగా ఛాయ శపించేసరికి యముడు భయపడిపోతూ తండ్రిని సమీపించి జరిగిన వృత్తాంతమంతా వివరించాడు. వివరిస్తూ ఎంత కఠోర హృదయురాలయినా కన్నతల్లి తన బిడ్డ మీద వాత్సల్యాన్ని పూర్తిగా పారద్రోలి ఇంతటి ఘోరంగా శపించగలదా? అని ప్రశ్నించే సరికి సూర్యునికి ఒక్కమారుగా శరీరమంతా కంపించినంత పనయ్యింది. హుటాహుటి బయలుదేరి ఛాయను పిలిచి 'సంజ్ఞ ఎక్కడ?' అని గర్జించాడు. ఛాయ గజగజవణికిపోతూ నేను సంజ్ఞనని చెప్పింది. సూర్యుని కోపం ఇనుమడించింది. మళ్ళీ ప్రశ్నించాడు. ఈసారి కూడా అదే జవాబిచ్చింది ఛాయ. మూడోసారి సూర్యుడు మరింత తీవ్రంగా అడిగేసరికి ఛాయ జరిగిన కథనంతా సవిస్తరంగా సూర్యభగవానునికి వివరించి చెపుతూ కాళ్లమీదపడి ఏడ్వసాగింది. మరుక్షణంలో సూర్యుడు విశ్వకర్మ గృహానికి చేరాడు. ఇంటికి వచ్చిన అల్లుని ఆదరించి మర్యాదలు జరుపబోయాడు మామగారు. కాని సూర్యుడు అన్నిటినీ కన్నులతోనే నిరాకరించి ఏదో అస్తవ్యస్తంగా ప్రసంగిస్తూ సంజ్ఞ కోసం కలయచూచాడు. కాని ఆమె జాడ గోచరించలేదు. విశ్వకర్మను ప్రశ్నించాడు. విశ్మకర్మ సమాధానంలో సూర్యునికి సంజ్ఞ ఉండే ప్రదేశం తెలియలేదు. ఒక్కసారిగా దివ్యదృష్టితో చూచాడు. ఉత్తరకురు భూముల్లో అవ్వరూపాన్ని ధరించి తీవ్రంగా తపస్సు చేస్తున్నట్టు కనుగొనగలిగాడు. తక్షణం ఉత్తరకురు భూములవైపు ప్రయాణం సాగించాడు. అశ్వరూపంలో ఉన్న సంజ్ఞను సమీపించి ఆమె మనస్సులో ఉన్న కోరికను ఇలా పసిగట్టగలిగాడు. నాపతియైన సూర్యభగవానుని తీవ్ర తపనశక్తి తగ్గించి సౌమ్య స్వభావాన్ని ఆయనకు కలుగునట్లు చెయ్యి.ఆ భావాన్ని గ్రహించిన సూర్యుడు విశ్వకర్మను ఆహ్వానించి ఆమెకు ఆహ్లాదం కలిగే విధంగా ప్రయత్నించమన్నాడు.

సూర్యుని తేజస్సు అంశలుగా మార్చిన విశ్వకర్మ

జపాకుసుమ సంకాశం కాశ్యపేయం మహాద్యుతిమ్।
తమోరిం సర్వపాపఘ్నం ప్రణతోస్మి దివాకరమ్।।

తక్షణం విశ్వకర్మ సంవత్సరాన్ని ఆరు ఋతువుల చక్రంగా ప్రవేశపెట్టి సంజ్ఞా సూర్యులకు ఆనందాన్ని కలిగించడంతో వారు సంతృప్త హృదయులయ్యారు. అదే సమయంలో దేవతలు, దేవర్షులు సూర్యుణ్ణి అనేక విధాల స్తోత్రం చేశారు. విశ్వకర్మ సూర్యుని తేజస్సులో పదిహేను అంశలు తీసేసి ఒక్క అంశను ఉంచాడు. సూర్యునిలోని ఋగ్వేదమయమైన తేజస్సుతో భూమినీ, యజర్వేద తేజస్సుతో ద్యులోకమును, సామవేద ప్రకాశంతో స్వర్గ లోకమున ప్రతిష్ఠించాడు. సూర్యుని నుండి ఆకర్షించిన ఆ తేజస్సు నుండి శంకరుని త్రిశూలం, శ్రీమన్నారాయణుని చక్రం, వసువుల భయంకర శంఖువు, అగ్ని తాపశక్తి. కుబేరుని విమానం, దేవగంధర్వ యక్ష విద్యాధరాదుల అస్త్రశస్త్రాలను నిర్మించెను. నాటి నుండి సూర్యుడు షోడశాంశలలో ఒక అంశతో మాత్రమే ప్రకాశించుచున్నాడు.

అంతట సూర్యుడు ఉత్తరకురుభూములకు పోయి అశ్వరూపంలో ఉన్న సంజ్ఞను సమీపించాడు. పరస్పరనాసికా స్పర్శతో సంజ్ఞ నాసత్య, దస్ర అను పేర్లు గల ఇరువురు కుమారులను కన్నది. మరల రేవంతుడు అను పేరు గల పరాక్రమవంతుడు సంజ్ఞ గర్భమున జన్మించాడు. అతడు నిశితకరవాలం చేత ధరించి కవచధారియై ధనుర్బాణయుతుడై సుసజ్జితాశ్వం మీద ఎటకోపోయాడు. అనంతరం సూర్యుడు స్వస్వరూపంతో ప్రత్యక్షం కాగా సంజ్ఞ సంతోష తరంగిత స్వాంతయై నిజ రూపం ధరించింది. అంతట సూర్యుడు సంజ్ఞతో స్వస్థానం చేరాడు.



సంజ్ఞ అశ్వరూపంలో ఉండి ప్రసవించిన కుమారులిరువురు అశ్వనీ కుమారనామాంతరులై దేవవైద్యులయ్యారు. రేవంతకుడు గుహ్యకులకు ప్రభువైనాడు. ఛాయ సంతానంలో జ్యేష్ఠుడైనవాడు సావర్ణి. ఇతడు రూపు రేఖా విలాసములలో వైవస్వతుని సర్వవిధముల పోలియుండుటచే 'సావర్ణి' అను పేరు వచ్చింది. ఇతడే ఎనిమిదవ మనువు.

ఈ మన్వంతరముననే బలిచక్రవర్తి ఇంద్రపదవిని వహిస్తాడు. రెండవ కుమారుడైన శని సూర్యుని అనుగ్రహం వల్లన గ్రహమండలిలో మధ్యస్థానమున నియమితుడైనాడు. కుమార్తె అయిన తపతి సంవరుణుడను చక్రవర్తిని పెండ్లియాడి అతని వలన 'కురు' అను పేరుగల కుమారుని కన్నది. ఇతడే కురువంశమునకు మూలపురుషుడు.(మార్కండేయ పురాణంలో కూడా ఇదే గాథ స్వల్ప మార్పులతో కనిపిస్తుంది. సూర్యవంశపు రాజులగాథలు మున్ముందు పురాణాలలో వస్తున్నాయి. కనుక – ఈ గాథకు ఇక్కడ ప్రాధాన్యమిచ్చితిమి. మార్కండేయ పురాణంలో ఈ సూర్యవృత్తాంతం తిరిగి చెప్పడం గమనించగలరు).సూర్యుని రథానికి ఒకే గుర్రం ఉందని, దానిపేరే 'సప్త' అని మరికొందరు చెబుతున్నా సూర్యుని రథానికి ఏడు గుర్రాలు, సూర్యకిరణాలకు ఏడు రంగులు ఉన్నాయని, అందుకే సప్తమి తిథి సూర్యునికి ప్రీతికరమైందని అనేకులు విశ్వసిస్తారు. మాఘశుద్ధ సప్తమినాడు సూర్యభగవానుడు మొట్టమొదటిసారిగా భూమి మీద సాక్షాత్కరించడం వల్ల ఆ సప్తమి ఎంతో పవిత్రమైందని చెబుతారు.

–బ్రహ్మశ్రీ పంచయజ్ఞం అగ్నిహోత్రావధానులు

పరమాత్మను దర్శిస్తే ఇంక దర్శించటానికి మరొకటి ఉండదు

దేనిని దర్శించిన తర్వాత మరొక దానిని దర్శించే పని లేదో అదే బ్రహ్మం. పరమాత్మను దర్శిస్తే ఇక దర్శించడానికి ఏమీ లేదు, ఏమీ మిగలదు. ఇక దేనినీ దర్శించాలనిపించదు. ధృతరాష్ట్రుడు పుట్టు గుడ్డి. అతడికి ప్రపంచాన్ని తన బిడ్డలను చూడాలని, ముఖ్యంగా దుర్యోధనునిపై వల్లమాలిన ప్రేమ. అయినా సరే శ్రీ కృష్ణుని చేత దివ్య నేత్రాలు ప్రసాదించబడి, ఆయన దివ్యరూపాన్ని దర్శించిన పిదప శ్రీ కృష్ణుడు శాశ్వతదృష్టిని ప్రసాదిస్తానని చెప్పినా, నీ రూపాన్ని దర్శించిన తర్వాత ఏదీ చూడను నాకు దృష్టి అక్కరలేదు. తిరిగి అంధత్వాన్ని ప్రసాదించమని కోరుకున్నాడు. యుద్ధానికి ముందు వ్యాసమహర్షి వచ్చి యుద్ధరంగాన్ని దివ్యదృష్టితో వీక్షించటానికి ప్రసాధిస్తాను అనగా, ఆ దివ్యదృష్టి సంజయునకు ప్రసాదించండి, అతడి ద్వారా వింటాను' అని తెలివిగా సమాధానం చెప్పాడు. అంటే భగవంతుని దర్శించిన తర్వాత ఇక దర్శించదగిందేమీలేదు అని. బాహ్యదృష్టిని పోగొట్టుకొని అంతర్దృష్టిని అలవరచుకొని ఆత్మ దర్శనం చేసుకోవాలని వేదవేదాంగ వేత్తలు, మహాత్ములు, మహర్షులు తపస్సు చేస్తుంటారు. అలాంటిది ఆత్మ దర్శనం చేసుకున్న తర్వాత ఏ మూర్ఖుడైనా బాహ్యదృష్టిని కలిగి ఉంటాడా? ఆత్మకు దూరంగా జరుగుతాడా? బ్రహ్మానందాన్ని చేజేతులా పోగొట్టుకుంటాడా? పోగొట్టుకోడు. దృష్టి బహిర్ముఖం కానీయడు. నిజంగా ఈ జగత్తంతా (తనలోనే) ఆత్మలోనే కల్పించబడింది. ఈ ప్రాణికోట్లన్నీ కూడా ఆత్మయైన తనలోనే ఉన్నాయి. సమస్త ప్రాణులను ఆత్మయందే దర్శిస్తాడు ఆత్మ జ్ఞాని. ఆత్మ కన్న అన్యంగా మరొక సత్య వస్తువు లేదు. కనుకనే ఆత్మను దర్శిస్తే అన్నింటిని దర్శించినట్లే. – శ్రీ రామ్, హైదరాబాద్

విద్యార్థులకు ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాలు పంపిణీ

విజయక్రాంతి, అంబర్‌పేట్: ప్రధాని నరేంద్రమోడీ రచించిన ఎగ్జామ్స్ వారియర్స్ పుస్తకాలను మంగళవారం బాగ్‌అంబర్‌పేట్ డివిజన్‌లోని స్వామి దయానంద్ స్కూల్, హైమవతి స్కూల్, ప్రేమ్‌నగర్ చైతన్య స్కూల్‌ల్లో మాజీ ఎమ్మెల్యే జి. కిషన్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, బీజేవైఎం గ్రేటర్ నాయకుడు రవీందర్‌గౌడ్, బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు బి.నర్సింగ్‌రావుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

లక్కారం ప్రాజెక్టుకు 2 టీఎంసీల నీటి విడుదల..!

విజయక్రాంతి, మంథని: మంథని నియోజకవర్గం పరిధిలోని కమాన్‌పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్ నుంచి లక్కారం ప్రాజెక్టుకు 2 టీఎంసీ నీటిని మంగళవారం పంపుహౌస్ సూపర్ వైజర్ అఫ్రోజ్ ఖాన్ మంగళవారం సదురు మంథని ఎత్తిపోతల పథకం మోటారు స్విచ్ ఆన్ చేసి విడుదల చేశారు. ఈ ఎత్తిపోతల పథకం నుంచి పంపింగ్ ద్వారా నీరు లక్కారంలోని శుక్రవారంపేట రిజర్వాయర్‌లోకి చేరుతుంది. అక్కడ నుంచి ముత్తారం మండలంలోని పలు చెరువులు, కుంటలను ఈ నీటితో నింపనున్నారు. రానున్న వేసవి దృష్ట్యా మూగ జీవాల, పశుపక్షాల దహార్తి తీర్చడం కోసం, అడుగంటిపోతున్న భూ గర్భ జలాలు పెంచి, బోరు, బావుల క్రింద రబీ పంటలను సాగు చేసుకున్న రైతులను ఆదుకోవడం కోసం మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచనల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటితో గుండారం రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపిన అనంతరం మంథని ఎత్తిపోతల పథకం ద్వారా నీటి పంపింగ్ దిశగా చర్యలు చేపట్టారు.

శేరిలింగంపల్లిని అభివృద్ధి చేస్తాం..



విజయ క్రాంతి, శేరిలింగంపల్లి: గ్రేటర్ హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉందని, ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం శేరిలింగంపల్లి నియోజకరవ్గంలోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లల్లో రూ. 2 కోట్లతో ఏర్పాటుచేయనున్న పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్లు, కొమిరిశెట్టిసాయిబాబా, రాగం నాగేందర్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో రాబోయే వేసవి నాటికి తాగునీరు అందించి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చేందుకు కృషిచేస్తున్నామని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా టీఆర్‌ఎస్‌కు అత్యధిక సీట్లను గెలిపించి పార్టమెంట్‌లో తెలంగాణ సత్తాచాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదుబండలో మురుగునీటి కాలువల సమస్య చాలా కాలంగా ఉందని ప్రజలు, కార్పొరేటర్ల విజ్ఞప్తుల మేరకు నిధులు ప్రత్యేంగా మంజూరు చేయడం జరిగిందని అన్నారు.

పార్కు స్థలాల కబ్జాలపై చర్యలు తీసుకోవాలి



- మేడ్చల్ ఎమ్మెల్యేకు బోడుప్పల్ వాసుల వినతి

విజయక్రాంతి, బోడుప్పల్: బోడుప్పల్ మున్సిఫల్ పరిధిలోని వివిధ కాలనీల్లో కబ్జాలకు గురౌతున్న కోట్ల విలువైన పార్కు స్థలాలను కాపాడి వాటిని ప్రజా వినియోగంలోకి తీసుకు రావాలని కోరుతూ ఘట్కేసర్ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి నేతృత్వంలో బోడుప్పల్ వాసులు మంగళవారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డిలకు వినతి పత్రం అందచేశారు. వివరాల్లోకి వెళితే బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 76/1 నుంచి 76/16 వరకూ గల లేఅవుట్‌లో ప్రజా అవసరాల కోసం వదిలిన పార్కు స్థలం సుమారు 2800 గజాలు, మరియు చెంగిచెర్ల నందిని నగర్‌లో 888 గజాల స్థలాన్ని చెంగిచెర్ల కు చెందిన ఓ నాయకుడు తన అధికార బలంతో బై నెంబర్ల సహాయంతో కబ్జా చేశాడని దానికి సంబంధించిన సాక్ష్యాలు కూడా ఉన్నాయని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వివరించారు. అదే విధంగా పార్కు స్థలాల కబ్జాపై ప్రశ్నించిన కాలనీ వాసులను కులం పేరుతో పాటు తన ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా తీవ్ర భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని కాలనీ వాసులు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి, కలెక్టర్లు స్పందిస్తూ పార్కు స్థలాల కబ్జాల విషయంపై స్థానిక అధికారుల నుంచి పూర్తి వివరాలను తెప్పించుకుని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు ఏర్పులు వెంకటేష్, క్రాంతి, కాలనీ వాసులు సోమేష్, నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణా సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకం



విజయక్రాంతి, మెహిదిపట్నం: బంగారు తెలంగాణా సాధనలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమనీ డీప్యూటి మేయర్ బాబా ఫసియుద్దిన్ తెలిపారు. మంగళవారం టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం. హుస్సేనీ(ముజీబ్) పబ్లిక్ గార్డెన్ ఉద్యోగి సయ్యద్ సాబీర్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డ్ వచ్చినందుకు సన్మానించారు. తెలంగాణా ఉద్యమంలో ఉద్యోగుల పాత్రను జ్ఞాపకం చేసుకున్నారు. డీప్యూటి మేయర్‌ను టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో సన్మానించారు.. ఈ కార్యక్రమంలో టీజీఓ, టీఎన్‌జీఓ కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు, హైద్రాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు యాదగిరిరెడ్డి, వెంకటేశ్, రాజ్‌కుమార్, ఆముక్తమాల్యద, బాలరాజ్, దేవేందర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

విజయక్రాంతి, అంబర్‌పేట్: విశాఖపట్నంలోజరిగిన 3వ అంతర్జాతీయ కరాటే పోటీలలో జీవీఆర్ కరాటే విద్యార్థులు చెరుకు హిమకేష్‌గౌడ్, అమృతరెడ్డి, గాయత్రి ప్రియ, మహితలు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం వారిని హోంమంత్రి మహమూద్ ఆలీ అభినందించారు. ఈ సందర్భంగా మహ్మమూద్ ఆలీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ పోటీలలో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు పథకాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అని విద్యార్థి దశ నుంచే విద్యతోపాటు క్రీడల్లో కూడా మంచి నైపుణ్యం ఉండాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పార్టీ మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి, జీ.వీ.ఆర్. కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధి హామీ పథకం

నిధులను వినియోగించండి

- సీఎం ఆదేశాలు
- హరితహారంకు తొలి ప్రాధాన్యత
- సమీక్షా సమావేశంలో నిర్ణయాలు



విజయక్రాంతి, హైదరాబాద్: మహాత్మాగాంధి జాతీయ ఉపాధి హామీ పథకం(నరేగా) నిధులను సంపూర్ణంగా వినియోగించుకుని గ్రామాల్లో తెలంగాణకు హరితహారం, వైకుంఠధామాలు (స్మశానవాటికలు) నిర్మించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. నరేగా నిధులతో పాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకుని గ్రామాల్లో అభివృద్ధి చర్యలు చేపట్టాలని సీఎం చెప్పారు. నరేగా పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తుందో, అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్లో నిధులు కేటాయిస్తుందని, ఈ నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని ముఖ్యమంత్రి చెప్పారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నరేగా పనులు జరగాలని, హరితహారం పనులకు మొదటి ప్రాధాన్యం, స్మశాన వాటికల నిర్మాణానికి రెండో ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. నరేగా నిధులు గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి ఉపయోగించాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలకు ఖచ్చితంగా బీటీ రోడ్డు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలనిముఖ్యమంత్రి సూచించారు.

గ్రామీణాభివృద్ధిపై సమీక్ష..

పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఎంపీలు బి.వినోద్ కుమార్, బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, డి.ఎస్.రెడ్యానాయక్, బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే మాలోతు కవిత, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, అడిషనల్ పీసీసీఎఫ్ డోబ్రియాల్, సీఎంవో ప్రత్యేక కార్యదర్శులు స్మితా సభర్వాల్, భూపాల్‌రెడ్డి, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఖచ్చితంగా ఆరునెలల్లో వైకుంఠధామాలు నిర్మించాలి. ప్రభుత్వ భూమి లేకుంటే గ్రామ పంచాయతీలు తమ నిధులతో స్థలాలు సమకూర్చాలి. దాతల నుంచి స్వీకరించాలి. వైకుంఠధామం నరేగా నిధులతో నిర్మించాలి. 3వేల లోపు జనాభా కలిగిన 11,412 గ్రామాల్లో ఒకటి చొప్పున, 3వేలకుపైగా జనాభా కలిగిన 1300 గ్రామాల్లో రెండు చొప్పున మొత్తం 14,012 గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

"గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం గ్రామ పంచాయతీల బాధ్యత. శిథిలాలు తొలగించాలి. పాడుపడిన, వాడని బావులను పూడ్చేయాలి. మురికి చెట్లను తొలగించాలి. కూలిన ఇండ్ల శిథిలాలు తొలగించాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు ఖచ్చితంగా బీటీ రోడ్డు ఉండాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. కొత్తగా 859 గ్రామాలకు రహదారులను నిర్మించాలి. వీటికోసం వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి, పనులు ప్రారంభించాలి" అని అని చెప్పారు. నరేగాతో పాటు వివిధ రకాలుగా సమకూరిన నిధులతో గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. నిధులు దుర్వినియోగం కావద్దని, ప్రతీ పైసా సద్వినియోగం కావాలని అన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు 20 బృందాలుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలనిముఖ్యమంత్రి చెప్పారు.

కుటుంబాలను వదిలి పనిచేశాం

- దస్త్రాల పక్షాళనలో పండగలు చేసుకోలే
- కావాలనే శాఖపై అవినీతి ఆరోపణలు
- బంగారు తెలంగాణ సాధనకు కృషి
- రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



విజయక్రాంతి, సంగారెడ్డి: దస్త్రాల ప్రక్షాళన సమయంలో కుటుంబాలను వదిలి, పండగలు చేసుకోకుండా నిర్విరామంగా పనిచేశా. అయినా కొంత మంది కావాలనే అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది నిజాయితీ నిరూపించుకోవాడానికి రాష్ట్రంలోని రెవెన్యూ కార్యాలయాల వద్ద ఇది అవినీతి రహిత కార్యాలయం ఎవరైనా లంచం అడిగితే తహశీల్దార్‌ను సంప్రదించాలి సూచికలు ఏర్పాటు చేసే కార్యాక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. పాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలు, మండలాలు, పంచాయతీలను ఏర్పాటు చేసింది. కానీ వాటికి అనుగుణంగా సిబ్బందిని నియమించలేదన్నారు. సరైన భవనాలు లేక దస్త్రాలకు భద్రత కల్పించలేక నానా అవస్థలు పడుతున్నామని, ఇప్పటికైనా ఖాళీలను భర్తీ చేయాలని గ్రామాల్లో పక్కా భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకోవాలని కోరారు.

సీఎం కేసీఆర్ కలలు నిజం చేస్తాం..

ముఖ్యమంత్రి కేసీఆర్ కలలు కన్న బంగారు తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని రవీందర్‌రెడ్డి అన్నారు. 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించేది ఒక రెవెన్యూ ఉద్యోగులేనని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ దస్త్రాల ప్రక్షాళనను 90శాతం విజయవంతం చేశామని వెల్లడించారు. 10శాతం కోర్టు కేసులు, భూ తగాదాలు, సరైన ధృవపత్రాలు లేని కారణంగా చేయలేకపోయామన్నారు. దస్త్రాల ప్రక్షాళన సమయంలో కుటుంబాలను వదిలి, పండగలు చేసుకోకుండా నిర్విరామంగా పని చేసినా కొంత మంది కావాలనే అవినీతి ఆరోపణలు చేస్తున్నారని పునరుద్ఘటించారు.

సౌకర్యాలు కల్పిస్తే... మరింత ఉత్సహంగా విధులు

కొత్త జిల్లాలు, మండలాలు, పంచాయతీలను ఏర్పాటు చేసినా కొత్తగా సిబ్బందిని నియమించి సరైన సౌకర్యాలు కల్పిస్తే మరింత ఉత్సాహంగా పని చేస్తామని అన్నారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను రెవెన్యూ శాఖే అమలు చేస్తుందని, అత్యంత క్రియాశీలకంగా, ప్రజలతో కలిసిపోయి పని చేసేది ఒక రెవెన్యూ శాఖే అని స్పష్టం చేశారు. ఈ శాఖలో పని చేస్తున్నందుకు అదృష్టంగా భావించాలని ఆయన రెవెన్యూ ఉద్యోగులను ఉద్దేశించి అన్నారు. అంతే కాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక రోజులో సమగ్ర సర్వే చేసిన ఘనత మనదే అని రాష్ట్ర మాజీ అధ్యక్షులు మఠం శివశంకర్ తెలిపారు. భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమం కూడా విజయవంతం అయిందన్నారు. తహశీల్దార్లకు ప్రభుత్వం వాహనాలు సమకూర్చి, వాటిని ప్రజలు గుర్తించేలా ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా ప్రారంభమైన సైబరాబాద్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ 2019



విజయక్రాంతి, హైదరాబాద్: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సైబరాబాద్ యాన్యువల్ స్పోరట్స్ అండ్ గేమ్స్ మీట్ 2019 కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ (ఫైనాన్స్) శ్రీ కె. రామకృష్ణారావు, ఐఏఎస్., బెలూన్లు ఎగరేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. పోలీసులు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయి అన్నారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ వారి ఆరోగ్యం, మానసికోల్లాసం కోసం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ను ఏర్పాటు చేసిన సైబరాబాద్ సీపీని ఆయన అభినందించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో వివిధ జోన్ల పోలీసు క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ(ఫైనాన్స్) కె.రామ కృష్ణ రావు, మాదాపూర్ డీసీపీ వెంకటేశ్వరరావు, శంషాబాద్ డీసీపీ ప్రకాష్‌రెడ్డి, డీసీపీ ట్రాఫిక్ ఎస్ ఎస్ఎమ్ విజయ్ కుమార్, బాలనగర్ డీసీపీ పద్మజా, డీసీపీ క్రైమ్స్ జానకీ షర్మిలా తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘానికి నివేదికను సిద్ధం చేయండి

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో పర్యటించనున్న 15 వ ఆర్థిక సంఘానికి సమర్పించడానికి వివిధ శాఖల అధికారులు తగు నివేదికలు రూపొందించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు కోరారు. మంగళవారం సచివాలయంలో 15వ ఆర్థిక సంఘానికి సమర్పించవలసిన నివేదికపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, డీజీపీ యం. మహేందర్‌రెడ్డి, జీఏడీ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, వాణిజ్య శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్, రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, కార్యదర్శులు బి.వెంకటేశం, నవీన్ మిత్తల్, బెనహర్ మహేశ్ దత్ ఎక్కా, పీసీసీఎఫ్, పి.కె.ఝా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి మాట్లాడుతూ.. ఎన్.కె. సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం ఈ నెల 18 నుంచి 20 వరకు పర్యటిస్తుందని ఆయన తెలిపారు. పర్యటనలో 18న గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు చెందిన ప్రతినిధులు, వాణిజ్యం, పరిశ్రమలకు చెందిన ప్రతినిధులుతో కలవడంతో పాటు 19న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం అవుతారని ఆయన తెలిపారు.

కడప నియోజకవర్గ వాసుల ఆత్మీయ కలయిక 10న



- హాజరు కావాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పిలుపు

విజయక్రాంతి, కూకట్ పల్లి: ఈనెల 10న కూకట్ పల్లి లోని మెట్రో మార్వెల్ గార్డెన్ లో తలపెట్టిన వైఎస్సార్ సీపీ కడప పార్లమెంట్ వాసుల ఆత్మీయ సమావేశానికి అందరూ హాజరు అయ్యి విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పుత్తా ప్రతాప్ రెడ్డి కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నాడు ఆవిష్కరించారు. కడప నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరు కానున్న ఈ సమావేశానికి కడప పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.కావున హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కడప పార్లమెంట్ పరిధిలోని వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు, ఆత్మీయులు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,వైఎస్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

విజయక్రాంతి, మెహిదిపట్నం: ఖైరాతాబాద్ జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై జిహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ముషారఫ్‌ఫారుఖీ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలనీ,ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలనీ, జోనల్ పరిధిలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్‌లు సెక్షన్ ఆఫిసర్లు,ఏసీపిలు,ఎమ్‌హెచ్‌ఓలు,డిడి,ఇఇ,ఎంటమాలజిస్టులు జిహెచ్‌ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి అమలుపై 'కేంద్రం' ధీమా

- సీ. ఎస్‌ను కలిసిన కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి

విజయక్రాంతి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందనే నమ్మకం ఉందని కేంద్ర వ్యవసాయశాఖ అధికారి అన్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. ఎస్. కె. జోషి తెలిపారు. మంగళవారం సచివాలయంలో కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుదామిశ్రా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమీషనర్ రాహుల్ బొజ్జా, సీసీఎల్‌ఏ డైరెక్టర్ కరుణ, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.యస్ మాట్లాడుతూ.. కేంద్ర అదనపు కార్యదర్శి పెట్టనున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ పథకం వివరాలను వివరించారని, తెలంగాణ రాష్ట్రం మొదటగా ఈ పథకాన్ని అమలు చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారని ప్రధాన కార్యదర్శి తెలిపారు.

8న కాకినాడకు ప్రత్యేక రైలు

విజయక్రాంతి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 8న హైదరాబాద్ నుంచి కాకినాడ టౌన్‌కు ప్రత్యేక రైలును నడుపనున్నారు. ఈ రైలు హైదరాబాద్ నుంచి సాయంత్రం 6.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైలు కాజీపేట్, వరంగల్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. ప్రత్యేక రైలులో ఏసీ టూ టైర్, ఏసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్ కోచ్‌లుంటాయి.

అటవీ శాఖలో ప్రక్షాళన షురూ

(మొదటిపేజీ తరువాయి)

కరీంనగర్, కొత్తగూడెం, కెరమెరి, బెల్లంపల్లి, తిర్యాని, గాంధారి, బాన్సువాడ, పిట్లం, నాగిరెడ్డిపేట, దూలపల్లికి కొత్త రేంజ్ అధికారులను నియమించారు. ఫారెస్టర్లు, బీట్ ఆఫీసర్లు కలిపి 160 మందిని బదిలీ చేశారు.

11 మందిపై సస్పెన్షన్ వేటు, పలువురికి మెమోలు

అడవులను రక్షించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, స్మగ్లర్లకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో అటవీశాఖ అధికారులు స్మగ్లర్లకు సహకరిస్తున్నారనే అభియోగాలతో ఇటీవల కాలంలో 11 మందిని అటవీశాఖ సస్పెండ్ చేసింది.

సస్పెండైన వారిలో ఫారెస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ స్థాయి నుంచి గార్డుల వరకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి మెమోలు జారీ చేశారు.

మోదీనే మళ్ళీ ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కటి అయ్యాయి.. దేశం మీద ప్రేమతో కాదన్నారు. అభివృద్ధి నినాదం మీద ఎన్నికలు జరగకుండా... చేసే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. కార్యకర్తలు గూడ్స్ రైలుకు ఇంజిన్ లాంటి వారని అన్నారు. మరోసారి మోడీ ప్రధాని కాబోతున్నారు.. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

పార్టీ ప్రధాన కార్యదర్శి పీ మురళీధరరావు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు సమానంగా మన ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. సుస్థిర ప్రభుత్వాలు నడవాలని ప్రజలు కోరుకుంటున్నారని, అందుకే మళ్ళీ బీజేపీ గెలుస్తుందని, మోడీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షుడు కే లక్ష్మణ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలకు తేడా ఉంటుందన్నారు. జాతీయ అంశాల ప్రభావం ఉంటుందని చెప్పారు. మోదీ ప్రధాని కావాలని కోరుకుంటున్న ప్రజలు బీజేపీని గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

చింతా సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన క్లస్టర్ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు కే లక్ష్మణ్, ఎంపీ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ ఎన్ రాంచందర్ రావు, జీ కిషన్ రెడ్డి, మంత్రి శ్రీనివాస్, సాదాన్ సింగ్ ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్, చింతల రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాక్షికంగా రైళ్లు రద్దు

విజయక్రాంతి, హైదరాబాద్: బెంగుళూరు కంటోన్మెంట్ – బైయ్యప్పనహల్లి మధ్య జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా రెండు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఫిబ్రవరి 9న కాచిగూడ – కెఎస్ఆర్ బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ ధర్మవరం – కెఎస్ఆర్ బెంగుళూరు స్టేషన్ల మధ్య రద్దు చేశారు. ఫిబ్రవరి 10న కెఎస్ఆర్ బెంగుళూరు –కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను కెఎస్ఆర్ బెంగుళూరు – ధర్మవరం స్టేషన్ల మధ్య రద్దు చేశారు.

సింగరేణి సీఎండీతో రైల్వే అధికారుల భేటీ

విజయక్రాంతి, హైదరాబాద్: బొగ్గు ఉత్పత్తిని పెంచాలని భావిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) సీఎండీ ఎన్.శ్రీధర్ దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.మధుసూదనరావుతో సమావేశమయ్యారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో రాబోయే రెండు నెలల్లో బొగ్గు ఉత్పత్తిని పెంచబోతున్నామని, దాని రవాణాకు సహకరించాలని శ్రీధర్ కోరారు. గత సంవత్సరం సెప్టెంబర్ మాసంలో ఎస్‌సీసీఎల్ సరాసరిగా 30 రేక్స్ (ఒక రేక్ అంటే 4000 టన్నుల సామర్థ్యం కలిగిన 59 వాగన్లు) బొగ్గును రవాణా చేసింది. జనవరి మాసంలో దానిని 40 రేక్స్‌కు పెంచింది.

రాబోయే ఫిబ్రవరి, మార్చి మాసాల్లో దీన్ని 45 రేక్స్‌కు పెంచాలని ఎస్‌సీసీఎల్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీధర్ రవాణాకు తగిన సహకారం ఇవ్వాలని కోరారు. రామగుండం ప్రాంతంలో గోదావరిఖని, గోలేటి మైన్స్ నుంచి రవాణా చేసేందుకు రైల్వే లైన్ సామర్థ్యం బాగుందని మధుసూదనరావు తెలిపారు.

ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల ప్రక్రియ చేయండి

- సీఎంకు పాతూరి లేఖ

విజయక్రాంతి, హైదరాబాద్: ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల ప్రక్రియ వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావుకు విజ్ఞప్తి చేశారు. వేర్వేరు చోట్ల ఉపాధ్యాయులుగా పని చేస్తున్న భార్య,భర్తల బదిలీలు, పరస్పర అంగీకార మ్యూచువల్ బదిలీలకు ప్రాధాన్యత నివ్వాలని పాతూరి ముఖ్యమంత్రికి రాసిన లేఖలో కోరారు. అంతర్ జిల్లాల బదిలీలపై 2012లోనే మార్గదర్శకాలు విడుదలయినప్పటికీ అవి అమలు కావడం లేదని పాతూరి పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలపై సీఎం కేసీఆర్ ఇదివరకే సానుకూలంగా స్పందించిన సంగతిని ఆయన గుర్తు చేశారు. అంతర్ జిల్లాల బదిలీల హామీ అమలుకు అడ్డంకులు ఏవీ లేనందున ప్రక్రియ ప్రారంభానికి ఆదేశాలు జారీ చేయాలని పాతూరి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు.

కుంభకోణాల్లో శారదా స్కాం తీరు వేరయా...

(మొదటిపేజీ తరువాయి)

రోజ్‌వ్యాలీ సంస్థ రూ.15వేల కోట్ల వరకు వసూలు చేశాయి. వీటిని ఈ సంస్థలు వివిధ వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టాయి. ఈ రెండు సంస్థలు 2013 నాటికి చేతులెత్తేశాయి. సుమారు 200 ప్రైవేట్ కంపెనీలు కలసి ఉమ్మడిగా పెట్టుబడి పథకాలను శారద గ్రూప్ నడపడం చేపట్టింది. తక్కువ పెట్టుబడులతో అత్యధిక లాభాలు పొందండి అంటూ సాధారణ ప్రజలను నమ్మించి దశాబ్ది కాలం పాటు కొన్ని లక్షల మంది నుంచి శారదా గ్రూపు, రోజ్‌వ్యాలీ సంస్థలు వేల కోట్ల రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేశాయి.

శారదా గ్రూప్ చైర్మన్ సుదీప్‌తో సేన్ గతంలో నక్సలైట్ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1990 తర్వాత తన పేరు మార్చుకొని, ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ముఖం కూడా మార్చుకున్నాడు. తొలుత లెఫ్ట్ ఫ్రంట్ నేతలతో సన్నిహితంగా ఉన్న ఆయన మమతా అధికారంలోకి రాగానే ఆమెకు సన్నిహితమయ్యారు. డెబీజాని ముఖర్జీ ఈ గ్రూప్ కార్యనిర్వాహక డైరెక్టర్‌లలో ఒకరు. గ్రూప్‌నకు సంబంధించిన చెక్‌లపై ఆమెనే సంతకం చేసేవారు. ఆమె ఎయిర్ హోస్టెస్‌గా శిక్షణ పొందారు. 2010లో శారద గ్రూప్‌లో రిసెప్షనిస్ట్‌గా చేరి అనతి కాలంలోనే గ్రూప్ కార్యనిర్వాహక డైరెక్టర్ స్థాయికి అంచెలంచెలుగా ఎదిగారు.

గ్లోబల్ ఆటోమొబైల్స్ పేరుతో నకిలీ కంపెనీ..

తమ డిపాజిట్ల పథకాలకు మరింత ఆకర్షణీయంగా మారుస్తూ శారద గ్రూప్ 2011లో గ్లోబల్ ఆటోమొబైల్స్ పేరుతో ఒక నకిలీ మోటార్ సైకిల్ కంపెనీని స్థాపించారు. 24 పరాగణాల జిల్లాలో ఉన్న వెస్ట్ బెంగాల్ అవధూత ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్, బంకురా ల్యాండ్ మార్క్ సిమెంట్ వంటి నకిలీ కంపెనీలను కూడా డిపాజిట్ దారులకు, ఏజెంట్‌లకు చూపించడం కోసం నిర్వహిస్తూ వచ్చారు. తన చేతిలో అంతులేని నిధులు చేరడంతో, బెంగాలీ ఫిలిం పరిశ్రమ వంటి ఆకర్షణీయమైన రంగాలలో పెట్టుబడులు పెట్టారు.

తృణమూల్ ఎంపీనే బ్రాండ్ అంబాసిడర్

టిఎంసి ఎంపీగా ఉన్న శతాబ్ది రాయ్‌ని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. శారద గ్రూప్ మీడియా వేదికపై బాలీవుడ్ నటుడు మిథున్ చక్రబోర్తిని బ్రాండ్ అంబాసిడర్‌గా తీసుకొచ్చారు. మరో టిఎంసి ఎంపీ కునాల్ ఘోష్‌ను మీడియా గ్రూప్‌నకు సీఈఓగా నియమించారు. శారద గ్రూప్ సాగిస్తున్న చిట్ ఫండ్ కార్యకలాపాల గురించి సెబీ 2011లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించడంతో గ్రూప్ తన పద్ధతులను మరోసారి మార్చివేసింది. వివిధ లిస్టెడ్ కంపెనీల షేర్లను భారీ సంఖ్యలో అమ్మడం ప్రారంభించింది. ఆయా కంపెనీల మూలలను కనుగొనడం దర్యాప్తు సంస్థలకు సాధ్యం కాలేదు. ఈ లోగా, శారద గ్రూప్ తన నిధులను పెద్ద మొత్తంలో దుబాయ్, దక్షిణ ఆఫ్రికా, సింగపూర్‌లకు పంపడం ప్రారంభించింది. 2012 నాటికి ఈ గ్రూప్ సాగిస్తున్న ఆర్థిక కార్యకలాపాలు చిట్ ఫండ్‌ల పరిధిలోకి రావని అంటూ సామూహిక పెట్టుబడుల పథకాలుగా సెబీ వర్గీకరించింది. వాటి నిర్వహణకోసం తమ నుంచి అనుమతి పొందేవరకు వాటిని వెంటనే నిలిపి వేయమని ఆదేశించింది. అయినా లెక్కచేయకుండా ఆ కంపెనీ ఏప్రిల్, 2013లో కూలిపోయేవరకు తన కార్యకలాపాలు సాగిస్తూనే వచ్చింది.

ఇద్దరు టీఎంసీ ఎంపీలు, మాజీ డీజీపీ

ఈ కుంభకోణంలో సంబంధం ఉన్నదనే ఆరోపణలపై పలువురు ప్రముఖులను అరెస్ట్ చేశారు. వారిలో ఇద్దరు టీఎంసీ ఎంపీలు కునాల్ ఘోష్, శ్రీన్జోయ్ బోస్, పశ్చిమ బెంగాల్ మాజీ డీజీపీ రజత్ మజుందార్, ప్రముఖ ఫుట్ బాల్ క్లబ్ అధికారి దేబబ్రత సర్కార్, మమతా మంత్రివర్గంలోని క్రీడా మంత్రి మదన్ మిత్ర వంటి వారున్నారు. ఒక అంచనా ప్రకారం ఈ విధంగా ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేస్తున్న 2013 నాటికి దేశంలోని మల్టీలెవెల్ మార్కెటింగ్, ఫైనాన్స్ పథకాలు నడుపుతున్న కంపెనీలలో 80 శాతం వాటికి పశ్చిమ బెంగాల్ కేంద్రంగా ఉంది. కట్టిన డబ్బు లు తిరిగి రాక కొందరు మదుపరులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో సుదిప్తో సేన్ తన సహచరుడు దేవ్జానీ ముఖర్జీతో కలిసి 2013లో బెంగాల్ వదిలి పారిపోయాడు. శారద కంపెనీపై మొదటి కేసు బిధానగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైంది. ప్రస్తుత కోల్‌కత్తా కమిషనర్ రాజీవ్ కుమార్ వెంటనే రంగంలోకి దిగి సుదిప్తో సేన్, దేవ్జానీని కశ్మీర్లో అరెస్టు చేశారు.మొత్తం కుంభకోణంపై దర్యాప్తునకు బెంగాల్ ప్రభు త్వం2013లో రాజీవ్ కుమార్ నేతృత్వంలో సిట్‌ను కూడా ఏర్పా టు చేసింది. నలుగురితో న్యాయ విచారణకు కూడా ఆదేశించిం ది. 2014లో సుప్రీంకోర్టు ఆదేశం మేరకు కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టింది. ఇటీవల సీబీఐకి చిట్ ఫండ్ సంస్థల యజమానుల ఇళ్లలో మమత వేసిన పెయింటింగ్‌లు లభించడం విశేషం. చిట్‌ఫండ్ యజమానులు భారీ మొత్తంతో ఆ పెయింటింగ్‌లను కొ నుగోలు చేసినట్టు తేలడంతో ఈ కేసు మరో మలుపు తిరిగింది. కునాల్ ఘోష్ ఆధ్వర్యంలో స్థానిక టివి ఛానల్స్, వార్త పత్రికలను తీసుకోవడం, స్థాపించడం చేశారు. అందుకు సుమారు రూ. 1000 కోట్ల వ్యయం చేశారు. 2014 నాటికి 1,500 మంది జర్నలిస్ట్‌లను కూడా నియమించారు. ఇలా ప్రజల సొమ్ముతో 7 వార్తాపత్రికలు ఐదు భాషలలో నడిపేవారు. పలువురు టిఎంసి ఎంపీలతో సహా శారద గ్రూప్ నుంచి చాలామంది రాజకీయ నాయకులు నిధులు పొందారు. కునాల్ ఘోష్‌కు నెలకు రూ. 16 లక్షల జీతం ఇచ్చేవారు. గ్రూప్ మీడియా కార్యకలాపాలలో మరో ఎంపీ శ్రీన్జోయ్ బోస్ నేరుగా పాల్గొంటూ ఉండేవారు. ఉద్యోగుల యూనియన్‌కు రవాణా మంత్రి మదన్ మిత్ర అధ్యక్షులుగా ఉండేవారు.

ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పెయింటింగ్‌ల కొనుగోలు కోసం గ్రూప్ చైర్మన్ సుదీప్‌తో సేన్ రూ. 1.86 కోట్లు ఖర్చు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. జౌళి శాఖ మంత్రి సహ భాగస్వామిగా ఉన్న భారీ నష్టాలలో ఉన్న ల్యాండ్ మార్క్ సిమెంట్ కంపెనీని ఈ గ్రూప్ కొనుగోలు చేసింది. గతంలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రికి నమ్మకస్తుడైన సహాయకుడిగా ఉన్న గణేష్ డెయ్‌తో కూడా ఈ గ్రూప్‌నకు ఆర్థిక కార్యకలాపాలు ఉన్నాయి. దానితో తర్వాత ఆయనను సిపిఎం నుంచి బహిష్కరించారు. బెంగాల్ వెలుపల ఉన్న రాజకీయ నాయకులూ కూడా శారద గ్రూప్ వల్లన ప్రయోజనం పొందారు. అస్సాంలో మాజీ కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మంత్రి మాతంగ్ సింహ్ భార్య మనోరంజన్ సింహ్‌కు రూ. 25 కోట్లు చెల్లించినట్లు సేన్ చెప్పారు. ఆమె తండ్రి కె యెన్ గుప్తకు ఒక టెలివిజన్ ఛానల్‌లో అత్యధిక ధరకు షేర్లు కొనడానికి రూ. 3 కోట్లు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి.

వేసవికి 142 ప్రత్యేక రైళ్లు

విజయక్రాంతి, హైదరాబాద్: వేసవి రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రాంతాలకు 142 రైళ్లు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం తెలిపింది. ఈ రైళ్లను కాకినాడ టౌన్ నుంచి రాయిచూర్, కాకినాడ టౌన్ – కర్నూల్ సిటీ, నర్సాపూర్ – హైదరాబాద్, హైదరాబాద్ – విజయవాడల మధ్య నడుపుతారు. కాకినాడ టౌన్ – రాయిచూర్ ప్రత్యేక రైళ్లను వారానికి మూడు రోజులు (బుధ, శుక్ర, ఆదివారాలు) మార్చి 1వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు నడుపనున్నారు. ఈ రైళ్లు కాకినాడ టౌన్ నుండి మధ్యాహ్నం 2.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు రాయిచూర్ చేరుకుంటాయి. రాయిచూర్ – కాకినాడ టౌన్ ప్రత్యేక రైళ్లు వారానికి మూడు రోజులు (గురు, శని, సోమవారాలు) మార్చి 2వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు నడుపనున్నారు.

ఈ రైళ్లు రాయిచూర్ నుంచి మధ్యాహ్నం 2.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు కాకినాడ టౌన్‌కు ఉదయం 8.30 గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు విజయవాడ, గుంటూరు, నర్సరావుపేట తదితర స్టేషన్లలో ఆగుతాయి. కాకినాడ టౌన్ – కర్నూల్ సిటీ ప్రత్యేక రైళ్లను వారానికి రెండు రోజుల చొప్పున మార్చి 5వ తేదీ నుంచి మే 30వ తేదీ వరకు నడుపుతారు. ఈ రైళ్లు కాకినాడ టౌన్ నుంచి సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10 గంటలకు కర్నూల్ సిటీకి చేరుకుంటాయి. కర్నూల్ సిటీ – కాకినాడ టౌన్ ప్రత్యేక రైళ్లను వారానికి రెండు రోజులు మార్చి 6వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు నడుపుతారు. ఈ రైళ్లు సాయంత్రం 4 గంటలకు కర్నూల్ సిటీ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటాయి. మార్గమధ్యలో ఈ రైళ్లు విజవాయడ, ఏలూరు, తాడేపల్లిగూడెం తదితర స్టేషన్‌లలో ఆగుతాయి. నర్సాపూర్ – హైదరాబాద్ ప్రత్యేక రైళ్లు మార్చి 3వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు (ప్రతి ఆదివారం) నడుపుతారు. ఈ రైళ్లు నర్సాపూర్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.45 గంటలకు హైదరాబాద్ చేరుకుంటాయి. మార్గమధ్యలో ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ తదితర స్టేషన్లలో ఆగుతాయి.

హైదరాబాద్ – విజయవాడ ప్రత్యేక రైళ్లు మార్చి 4వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు (ప్రతి సోమవారం) నడుపుతారు. ఈ రైళ్లు హైదరాబాద్ నుంచి రాత్రి 10.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.35 గంటలకు విజయవాడ చేరుకుంటాయి. మార్గమధ్యలో ఈ రైళ్లు కాజీపేట్, వరంగల్, డోర్నకల్, ఖమ్మం స్టేషన్‌లలో ఆగుతాయి.

ఇండో జర్మన్ విత్తనోత్పత్తి సహకారం పొడిగింపు

రాష్ట్ర అధికారులతో జర్మన్ బృందం భేటీ



విజయక్రాంతి, హైదరాబాద్: విత్తన రంగం అభివృద్ధినుద్దేశించి ఇండోజర్మన్ ప్రాజెక్టు గడువును మరో మూడేళ్లకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత రెండేళ్లుగా ఈ ప్రాజెక్టు కొనసాగుతోంది. ఈ ఏడాదితో గడువు ముగియటంతో మరో మూడేళ్లకు పొడిగించటం జరిగింది. ఈ మేరకు మంగళవారం ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొ. గాటిఫ్రైడ్ హార్నిబర్ సారథ్యంలోని జర్మన్ బృందంతో తెలంగాణ వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి సమావేశమయ్యారు. గత రెండేళ్లలో ఈ ప్రాజెక్టు అమలు తీరును సమీక్షించేందుకు గత మూడు రోజులుగా జర్మన్ బృందం వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల విత్తనోత్పత్తి గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసింది. తదనంతరం మరో మూడేళ్లకు పొడింగించే ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది.

ఇందులో భాగంగా విత్తన నాణ్యతకు పంటకోత తరువాత అవసరమయ్యే సాంకేతికత, ప్రాసెసింగ్ మెళకువలు, ఓయిసీడీ అంతర్జాతీ య విత్తన ధృవీకరణతో విదేశాలకు విత్తన ఎగుమతులను ప్రోత్సహించటం, విత్తనాభివృద్ధి, విత్తన రైతులకు శిక్షణ, అవగాహన వర్క్‌షాప్‌ల నిర్వహణపై ఈసారి దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలియజేశారు. సమావేశంలో తెలంగాణ విత్తనాభివృద్ధి, ధృవీకరణ సంస్థ డైరెక్టర్ డా. కేశవులు, ఇండ్ జర్మన్ సీడ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ గాటిఫ్రైడ్ హార్నిబర్, సిగ్రిట్ గియాన్సీ, ఎకెనార్డ్ షాండర్ పాల్గొన్నారు.



హయత్‌నగర్ ఎమ్మార్వో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి (విజయక్రాంతి, ఎల్బీనగర్)

క్రమశిక్షణకు నిదర్శనం ఎన్‌సీసీ కెడెట్స్



- అర్కైవ్స్ డైరెక్టర్ జనరల్ ఆకునూరి మురళి

విజయక్రాంతి, హైదరాబాద్: సామాజిక సేవ, క్రమశిక్షణ రెండు నిబద్ధతగా పాటించే సైనికులు ఎన్‌సీసీ కెడెట్స్ అని అర్కివ్స్ డైరెక్టర్ జనరల్ ఆకునూరి మురళి అన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అందరూ నీతిగా, నిజాయితీగా ఓటు వేయాలన్నారు. అప్పుడే మన గ్రామాలు, మన దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. మన దేశంలో కులం, మతం వల్లే వెనుకబాటు గురవుతున్నామన్నారు. గత అమెరికా అధ్యక్షుడు ఒబామా పదవిలో ఉన్నప్పుడు కూడా తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపారు. ఆ పద్ధతి మనదేశంలో లేదు. అందుకే విద్యార్థుల నుంచే ప్రశ్నించడం, సమాజంపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ ఈ తరం నుంచే సమాజంపై అవగాహన, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ పౌండర్ రాజేందర్ పల్నాటి, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేష్, బాబీయర్స్, ఎన్‌సీసీ హెచ్‌ఓడీ సంతోషిని, యాక్ సభ్యులు జోగినపల్లి సతీష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ న్యాయాలయాల ఏర్పాటు పట్ల హర్షం

విజయక్రాంతి, హైదరాబాద్: గ్రామ న్యాయాలయాలు ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ప్రదాత తాత శివాజీ హైకోర్టు న్యాయవాది, అడిషనల్ ఎస్‌పీ సత్య ప్రసాద్, హైకోర్టు న్యాయవాది, నర్సింగరావు న్యాయవాది తదితరులు హాజరయ్యారు.

దేశవ్యాప్తంగా మార్చి 1నుంచి రేషన్ సరుకులు బంద్

- రేషన్ డీలర్ల సంఘం

విజయక్రాంతి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో మార్చి 1వ తేదీ నుంచి సరుకుల పంపిణీ బంద్ చేయనున్నట్లు రేషన్ డీలర్ల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు నాయికోటి రాజు డిమాండ్ చేసారు. మంగళవారం డిల్లీలో అల్ ఇండియా రేషన్ డీలర్స్ ఫెడరేషన్ సెంట్రల్ కమిటీ సర్వ సభ్య సమావేశం 'సంఘట్ భవన్' లో జరిగింది. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు కాకా దేశముఖ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అన్ని రాష్ట్రాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయికోటి రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న 5 లక్షల17 వేల మంది రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి నెలకు రూ.50 వేల వేతనం ఇవ్వాలని, లేనిచో క్వింటాల్‌కు రూ. 300 ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించలేని పక్షంలో మార్చ్ 1వ తేదీ నుండి రేషన్ సరుకుల పంపిణీని బంద్ చేసేందుకు నిర్ణయించామని చెప్పారు. డీలర్ల సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వానికి పలుమార్ల విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మార్చినెలలో దేశవ్యాప్తంగా రేషన్ డీలర్ల చేపడుతున్న ఆందోళనకు తెలంగాణ రాష్టంలోని డీలర్లందరు పాల్గొని విజయవంతం చేయాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు కిష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు 9లోగా చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేత



విజయక్రాంతి, హైదరాబాద్: విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలుగు రాష్ట్రాలను ఎన్టీపీసీ హెచ్చరించింది. బకాయలు చెల్లించాల్సిన రాష్టాలలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు కూడా ఉన్నాయి. బకాయలు వందల కోట్లకు చేరుకోవటంతో ఈనెల 9 వ తేదీలోగా చెల్లించాలని స్పష్టం చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు గడువులోపు బకాయిలు చెల్లించకపోతే విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఎన్టీపీసీ హెచ్చరించింది. ఈ మేరకు 'విద్యుత్ సరఫరా నియంత్రణ' నోటీసులను ఎన్టీపీసీ ఆయా రాష్ట్రాలకు జారీ చేసింది. గత రెండు నెలల పైబడి బకాయిలు చెల్లించకపోవటం వల్లే వీటిని జారీ చేసినట్లు ఎన్టీపీసీ తెలిపింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి రూ.7,859కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఎన్టీపీసీ వెల్లడించింది. ఇందులో అగ్ర భాగం రూ. 4,890 కోట్లు బకాయిలు కేవలం ఈ మూడు రాష్ట్రాల నుంచే రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ తర్వాతి స్థానంలో ఉందన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ పోర్టల్లో పేర్కొన్న సమాచారం మేరకు ఎన్టీపీసీకే కాకుండా ఇతర విద్యుత్ సరఫరా కంపెనీలకు ఉత్తరప్రదేశ్ రూ. 6,127 కోట్లు బకాయి పడింది. రాజస్థాన్ రూ.2404 కోట్లు, పంజాబ్ రూ.1,041 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా గజానన్ మాల్య

(మొదటిపేజీ తరువాయి)

దక్షిణ మధ్య రైల్వేలో సీనియర్ డిప్యూటి జనరల్ మేనేజర్‌గా, రాంచీ డివిజన్ డిఆర్ఎంగా, ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్) చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా, రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ (రైట్స్) జనరల్ మేనేజర్ (ఇన్‌స్పెక్షన్)గా, ఐఆర్ఐఎంఇఇలో సీనియర్ ప్రొఫెసర్‌గా, దక్షిణ రైల్వేలో జీఎం కార్యదర్శిగా, సీనియర్ డిఎంఇగా, డిప్యూటి చీఫ్ మెకానికల్ ఇంజనీర్‌గా సేవలందించారు. 1998 రైల్వే వారోత్సవాలో ఐసిఎఫ్ జనరల్ మేనేజర్ అవార్డు, వెండి పతకం సాధించి అత్యుత్తమ సేవకు గుర్తింపు పొందారు. వ్యాపారంలో కొత్త పద్ధతులను అనుసరించినందుకు రైట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అవార్డును, దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో రాజభాష హిందీ అమలుకై ఆయన చూపిన చొరవకు రైల్వే బోర్డు ఛైర్మన్ నుంచి అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు.

నేడు పంచాయతీరాజ్ మాస్టర్ ట్రైనర్లతో సీఎం భేటీ

విజయక్రాంతి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు బుధవారం పంచాయతీరాజ్‌శాఖ మాస్టర్ ట్రైనర్లతో సమావేశం కానున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల ముగిసిన విషయం తెలిసిందే. అయా గ్రామ పంచాయతీల్లో నూతనంగా ఎన్నికైనా సర్పంచులు, వార్డు సభ్యులకు నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాల్లో సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చేందుకు మాస్టర్ ట్రైనర్లను పంచాయతీరాజ్‌శాఖ ఎంపిక చేసింది. ఈ మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమాలపై సీఎం కేసీఆర్ దిశానిర్ధేశం చేయనున్నారు. నూతన చట్టంపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు మాస్టర్ ట్రైనర్స్ చేయాల్సిన పనులపై నేరుగా సీఎం కేసీఆర్ సూచనలు ఇవ్వనున్నట్లు తెలిసింది. దీంతో మాస్టర్ ట్రైనర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

నెహ్రూనగర్‌లో కమ్యూనిటీ హాల్ ప్రారంభం

విజయక్రాంతి, అంబర్‌పేట్: నెహ్రూనగర్ జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్స్‌లో రూ. 30లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీహాల్‌ను మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులు బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి, గోల్నాక కార్పొరేటర్ కాలేరు పద్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అవసరమని, ఎన్నికల అనంతరం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో, అభివృద్ధి కార్యాక్రమాలను చేపట్టడంలో రాజకీయాలకు అతీతంగా చేపడుతున్నట్లు తెలిపారు. అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలు ఎవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటికి అవసరమైన నిధులను మంజూరు చేయించి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు బి.వెంకట్‌రెడ్డి, నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, రంగంపల్లి రాజు, శ్రీనివాస్‌ముదిరాజ్, నర్సింగ్‌యాదవ్, అజయ్‌కుమార్, టీఆర్ఎస్ నాయకులు దోర్నాల భరత్‌రాజ్‌ముదిరాజ్, కాశి నరేష్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, జగన్, భీష్మా, దేవిరెడ్డి విజితారెడ్డి, రాజేష్, కాలేరు రామకృష్ణ, ఆశన్న, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్



విజయక్రాంతి, ఎల్బీనగర్: నకిలీ నోట్లు తయారు చేస్తున్న 12 మంది అంతర్రాష్ట్ర సభ్యుల ముఠాలో 10మందిని రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 31.25లక్షల విలువైన నకిలీ నోట్లతో పాటు నకిలీ నోట్లు తయారు చేస్తున్న మిషన్స్ స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రాచకొండ సీపీ మహేష్ భగవత్ మీడియాకు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 12 మంది ముఠాగా ఏర్పడ్డారు. ఇందులో ప్రధాన నిందితుడైన ఎప్పనపల్లి రాజేష్ ఈ ముఠాకీ రోల్ పోషిస్తూ నకిలీ నోట్లు తయారు చేశారు. మార్కెట్లు, సంతల వద్ద రద్దీగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని ముద్రించిన నకిలీ నోట్లతో ఇక్కడ వివిధ బేరాలు చేస్తుంటారు. ఇలా 4లక్షలకు పైగా డబ్బులను మార్పిడి చేసినట్లు సీపీ మహేష్ భగవత్ తెలిపారు. నిందితులలో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

నేరస్తులకు రక్షణ కల్పిస్తున్న మమతా బెనర్జీ

- ఎంపీ బండారు దత్తాత్రేయ విమర్శ

విజయక్రాంతి, హైదరాబాద్: శారదా చిట్ ఫండ్ కుంభ కోణానికి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విజయం, ప్రజాస్వామ్య విజయం అని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. మంగళవారం రామ్ నగర్ లోని తన నివాసంలో దత్తాత్రేయ మీడియాతోమాట్లాడుతూ అంతర్యుద్ధానికి, రాజ్యాంగ సంక్షోభానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయత్నం చేశారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఒక దేశమన్నట్లు వ్యవహరించడం మంచిది కాదన్నారు. ముఖ్యమంత్రి, డీజీపీ, కోల్కత్త సిటీ పోలీస్ కమీషనర్ తో కలిసి ధర్నా చేయడం ఒక నాటకం అన్నారు.

గ్రంథాలయాలు ఆధునికత సంతరించుకోవాలి

- ఐసీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రసింగ్ రాథోర్

విజయక్రాంతి, రాజేంద్రనగర్: మారుతున్న పరిస్థితులకి అనుగుణంగా గ్రంథాలయాలు మా రాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (విద్య) డాక్టర్ నరేంద్రసింగ్ రాథోర్ అన్నారు. అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ టెక్నాలజీలన్నింటినీ విరివిగా ఉపయోగించుకొని గ్రంథాలయాలు 24 గంటలు సేవలు అందించేలా రూపాంతరం చెందాలని ఆయన సూచించారు. ఐదు రోజుల పాటు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల లైబ్రేరియన్స్‌కి నిర్వహి స్తున్న నేషనల్ లెవల్ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. ఐసీఏఆర్ , వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ సదస్సును



నిర్వహిస్తున్నాయి. నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ అని నేర్చుకోవడం మానేసిన నాడు విద్యావంతులు సైతం నిరక్షరాస్యులుగా మారిపోతారని అయన అన్నారు. గతంలో కేవలం పుస్తకా ల నిల్వ కేంద్రాలుగా ఉండే లైబ్రేరిలు నేడు డిజిట ల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, తదితర టెక్నాలజీలని ఉపయోగించుకొని అనుక్షణం వి జ్ఞానాన్ని పంచే కేంద్రాలుగా మారాయన్నారు. ఎలక్ట్రానిక్ యుగంలో దూరమవుతున్న పాఠకుడిని ఆకర్షించుకోవడానికి విన్నూత మా ర్గాలు అవలంభించాలని ఆయన సూచించారు. లైబ్రరియన్ వీరాంజనేయులు విస్తరణ సంచాలకులు డాక్టర్ రాజిరెడ్డి, డీన్ అఫ్ స్టూ డెంట్ అఫైర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, కంప్ట్రోలర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ ఫర్ రిజర్వ్‌డ్ కాన్‌స్టెన్సీస్ తెలంగాణ కన్వీనర్ హరకర వేణుగోపాల్ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని న్యూఢిల్లీలో కలిసారు. పలు అంశాలపై చర్చించారు.

స్కూల్ అసిస్టెంట్లుగా బాషా పండితులు

పీఈటీలు దస్త్రం పై సీఎం సంతకం



విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలోని రెండవ శ్రేణి భాషా పండితులు, పిఇటిల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సంతకం చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుగు భాషా పండితుల పోస్టులను అప్ గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకున్నారు. ఇకపై తెలంగాణ రాష్ట్రంలో గ్రేడ్ 2 పండిట్ల పోస్టులుండవు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని వేలాది మంది భాషా పండితులకు మేలు జరుగుతుంది.

ఎమ్మెల్సీల కృతజ్ఞతలు

తెలుగు పండిట్లు, పిఇటిలను స్కూలు అసిస్టెంట్లుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల టీచర్ ఎమ్మెల్సీలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పూల రవీందర్, జనార్ధన్ రెడ్డి, కవి, రచయిత దేశపతి శ్రీనివాస్ ప్రగతి భవన్ లో మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భాషా పండితుల చిరకాల వాంఛను కేసీఆర్ నెరవేర్చారని, విద్యారంగ చరిత్రలో ఇదొక అపూర్వ నిర్ణయంగా నిలిచిపోతుందని వారు అన్నారు. సిఎం కేసీఆర్ కు తెలుగు భాషపై ఉన్న ప్రేమకు ఇది నిదర్శనమన్నారు.

అధ్వానంగా మారిన బాచుపల్లి నిజాంపేట్ రోడ్డు



విజయక్రాంతి, కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మల్లంపేట్ నుండి బాచుపల్లి మీదుగా నిజాంపేట వరకు రోడ్డు అధ్వానంగా తయా రైంది.రోడ్డు మొత్తం గుంతల మయమైంది. రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.నిత్యం వేల మంది ఈ రోడ్డు మార్గం ద్వారా ప్రయాణిస్తుంటారు.ఒకవైపు గుంతల మయమైనా రోడ్డు మరో వైపు ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్న వాహనాదారులు .ఉదయం మరియు సాయంత్రం వేళల్లో ఈ రోడ్డు మార్గం వెళ్ళలంటేనే వాహనాదారులకు ఒక గంట సమయానికి ఎక్కువ అవుతుంది దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు మల్లంపేట్ నుండి బాచుపల్లి మీదుగా నిజాంపేట్ వరకు రోడ్డు మరమ్మత్తులు చేసి ట్రాఫిక్ సమస్యను తోలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పేదవారికి అండగా ఉంటాం



- వాసవి మహిళా సంఘం

అధ్యక్షురాలు విప్పల రాజ్యలక్ష్మి

విజయక్రాంతి, ముషీరాబాద్: తెలంగాణలోని పేద ఆర్యవైశ్యులు, ఇతర కులాల పేదవారికి అండగా ఉండి చేయూత అందిస్తామని ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షురాలు విప్పల రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ముషీరాబాద్ లలితానగర్‌లోని సికింద్రాబాద్ ఆర్యవైశ్య సంఘం సమావేశం జరిగింది ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో ముందున్నారని రాజకీయంగా మాత్రం వెనుక పడ్డారని ఈ తరుణంలో మహిళలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మా యొక్క సంఘం ద్వారా వెనుకబడిన ఆర్య వైశ్యులు మరియు ఇతర కులాల పేద వారికి ప్రతి నెలా 20 వేల రూపాయలతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు పద్మ, అనురాధ, మాధవి, చైతన్య, నాగరాణి, అన్నపూర్ణ, అనిత, సంధ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



పురుగులనూ తింటున్నారు

పురుగులను ఆహార పదార్థాలుగా ఊహించుకోవడానికే చాలా మంది ఇష్టపడరు. అవి మురికిగా ఉంటాయని, రోగాలను వ్యాప్తి చేస్తాయనే భావన ఉంటుంది. 2017 గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 200కోట్ల మంది ప్రజలు తమ సంప్రదాయంలో భాగంగా పురుగులను తింటున్నారని ఒక అంచనా. పాశ్చాత్య దేశాల్లో దీని గురించి ఇప్పుడిప్పుడే చర్చ జరుగుతోంది.

నెదర్లాండ్స్, ఆఫ్రికాల్లో కీటకాల పెంపకం ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాపారం 2023 నాటికి రూ.8,575 కోట్లకు చేరుతుందని ఒక ఫుడ్ మేగ్జైన్ పేర్కొంది. కీటకాలే అసలైన సూపర్ ఫుడ్ అని, మనుషులు తినగలిగే కీటకాల వ్యాపారి షామి రాడియా అన్నారు. కీటకాలు అసలైన సూపర్ ఫుడ్. వాటిల్లో ప్రొటీన్, మినరల్స్, అమైనో యాసిడ్లు అధికంగా ఉంటాయి. వాటిని తినడంలో అర్థం ఉంది అని ఆమె అన్నారు. మాంసాహారం తినడం కంటే కీటకాలను తినడం పర్యావరణానికి మంచిది. వీటికి జీవ వ్యర్థాలను ఆహారంగా ఇవ్వవచ్చు. జంతువుల పెంపకంతో పోలిస్తే, కీటకాల పెంపకానికి తక్కువ స్థలం, తక్కువ నీరు అవసరం అవుతుంది. సాధారణంగా జంతువులు బలంగా తయారవ్వడానికి ఎక్కువ దాణా లేదా ఆహారం అవసరం.

ఉదాహరణకు ఏదైనా జంతువు కేజీ బరువు పెరగాలంటే దానికి 8 కేజీల దాణా అవసరం. కానీ, కీటకాలు అలా కాదు. వాటి రక్తం వేడిగా కాకుండా చల్లగా ఉండటంతో, సగటున 2 కిలోల ఆహారానికి 1 కిలో 'కీటక ద్రవ్యరాశి' వస్తుంది.

ప్రపంచంలో మనిషి ఆహారానికి 1,900 రకాల కీటకాలు ఉపయోగపడతాయని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ తెలిపింది. చీమలు, ఈగలు, కందిరీగ, తేనెటీగ, గొంగళి పురుగు, కుమ్మరి పురుగు, మిడతలు, కీచురాళ్లు, తూనీగ లాంటి కీటకాలను వివిధ ప్రాంతాల ప్రజలు అత్యంత సాధారణంగా తింటున్నారు.

ఇరాన్ విప్లవానికి నలభై ఏళ్లు

విప్లవం దుమారం లాంటిది. ఎక్కడెక్కడి చెత్తా చెదారాన్ని ఊడ్చిపారేస్తుంది. కానీ దుమారం ఊపు తగ్గిన తరువాత కూలిన చెట్లు, రాలిన ఆకులు మరింత చెత్తను మోసుకొచ్చి పారేస్తాయి. తాము పెనం నుంచి పొయ్యిలోకి వచ్చి పడ్డామని గుర్తించేలోపు జరగాల్సినదంతా జరిగిపోతుంది. రష్యన్ విప్లవం నుంచి ప్రపంచంలో వచ్చిన 'విప్లవాలు' అన్నీ చెత్తను ఊచ్చిన మాట ఎంత నిజమో చెదారాన్ని మిగిల్చినదీ అంతే నిజం. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చి ఈ ఫిబ్రవరికి నాలుగు దశాబ్దాలు పూర్తయ్యాయి. ఈ చరిత్రను మలుపు తిప్పిన సంఘటన జరిగిన నలభై ఏళ్ల తరువాత ఇరాన్ పరిస్థితేమిటి?

జీవితాంతం నిరాడంబరతను కోరుకుని, భౌతిక సుఖాలకు దూరంగా బతికిన విప్లవ పితామహుడు అయతుల్లా రుహోల్లా ఖొమేనీని ఆయన ఆశయాలకు విరుద్ధంగా భవ్యమైన, బహు ఆడంబరపూరితమైన సమాధిని కట్టారు. అక్కడ కళ్లు మిరుమిట్లు గొలిపే షాండిలియర్లు, వైభోగానికి ప్రతీకల్లాంటి పర్షియన్ కార్పెట్లు, ఖరీదైన పాలరాతి గోడల మధ్య సర్వాలంకరణతో కూడిన సమాధి చేయడం చూస్తే ఇరానియన్ విప్లవం పయనం ఎటువైపో అర్థం చేసుకోవచ్చు. ఖొమేనీ మరణించిన ఇరవై ఆరేళ్ల తరువాత పూర్తయిన ఈ సమాధి ఇరానియన్ విప్లవం ఖొమేనీ నుంచి ఎంత దూరం జరిగిందో చెబుతుంది.

ఇరాన్‌లో ఈనాడు ఆధునిక ఆలోచనలు, ఆధునిక దుస్తులు, కొంగొత్త ఫ్యాషన్ పోకడలు, లగ్జరీ కార్లు, అత్యాధునిక సాధనాలు, అద్భుతమైన టీవీలు, అందులో అన్ని రకాల కార్యక్రమాలు, కళ్లు చెదిరేలా కట్టిన మాల్స్, మల్టిప్లెక్సులు నలభై ఏళ్లలో ఇరాన్ ప్రయాణాన్ని తెలియచేస్తున్నాయి. ఇరాన్‌లో 'అహన్ పరస్తీ' అంటే ఇనుప ముక్కల పూజ పెరిగిపోయిందని ప్రభుత్వమే ఆందోళన చెందుతోంది. పోలీసులు లాఠీలు, జైళ్లను చూపి భయపెట్టినా హిజాబ్ ధరించే వారి సంఖ్య నానాటికీ తగ్గుతోంది. కనీసం నలభై శాతం యువతీ యువకులు డేటింగ్‌లో పాల్గొంటున్నారు. ప్రభుత్వ కట్టడులు, మత నేతల దళాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ సరదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్‌లో పధ్నాలుగేళ్ల వయసులోనే అమ్మాయిలు, అబ్బాయిలు డేటింగ్ నానాటికీ పెరిగిపోతున్నాయి. ఇస్లామిక్ సంగీత కార్యక్రమాలకు ఆదరణ నానాటికీ తగ్గుతోంది. పాశ్చాత్య సంగీత కార్యక్రమాలకు హాల్లో చోటు లేనంత రద్దీ ఉంటోంది. ఇస్లామిక్ నైతికతా పాలన కోసం ఒక ప్రత్యేక పోలీసింగ్ వ్యవస్థ, ఒక మంత్రిత్వ శాఖ ఉన్నా పరిస్థితి నానాటికీ తీసికట్టవుతోందని ప్రభుత్వమే ఆందోళన చెందుతోంది.

అయితే మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు దాదాపు నాలుగున్నర లక్షల మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇరాన్ సరిహద్దుల్లో, ఇరాక్ యుద్ధంలో సున్నీ శక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని దాదాపు అయిదు లక్షల మంది యువకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రతివారం కోట్లాది మంది ప్రజలు జుమ్మా నమాజుల్లో పాల్గొని, తక్రీర్‌లు వింటున్నారు. ఇరానీయులు ఇస్లామిక్ విప్లవ స్ఫూర్తిని వదలలేదు. కానీ దాని పేరిట సృష్టిస్తున్న కృత్రిమ కచ్చడాలను మాత్రం పూర్తిగా తిరస్కరిస్తున్నారు. పైగా నేడు ఇరాన్ జనాభాలో దాదాపు అరవై శాతం మంది వయస్సు 35 ఏళ్ల లోపు ఉంది. అంటే వీరు 1979 ఇరానియన్ విప్లవాన్ని చూడలేదు. వారి తల్లిదండ్రులు ఇరాన్ రాజు షా రెజా పహ్లవీ నియంతృత్వ ఉత్పీడనను, ఆయన గూఢచారి సంస్థ సవాక్ కిరాతకాలను చూడలేదు. కాబట్టి వారికి ఖొమేనీ విధించిన విధి నిషేధాలు పంజరం ఊచల్లాగానే కనిపిస్తున్నాయి. అందుకే మత విశ్వాసాలు బలహీనం కాకపోయినా, శాసకుల నియంతృత్వ పోకడలను వ్యతిరేకిస్తూ గళం విప్పుతున్నారు.


మరో వైపు దౌత్యపరంగా ఇరాన్ విప్లవం లెబనాన్‌లోని షియాలను, సిరియాలోని షియా పాలకులను, యెమెన్‌లోని హౌథీ షియాలను, ఇంకో వైపు ఇరాక్‌లోని షియాలను రెచ్చగొట్టి గల్ఫ్ దేశాల్లో సున్నీ షియా వివాదాలకు తెర తీసింది. దాని పరిణామాలను పశ్చిమాసియా దేశాలు నేటికీ అనుభవిస్తున్నాయి. 2003లో ఇరాక్‌పై అమెరికా దండయాత్ర తరువాత ఇరాక్‌లోని షియాల చేతుల్లోకి అక్కడి ప్రభుత్వం రావడంతో ఇరాన్ గల్ఫ్ రాజకీయాల్లో ఒక కీలక శక్తిగా ఎదిగి, సౌదీ అరేబియా ఆధిపత్యాన్ని సవాలు చేసింది. 2013 అస్తానా ఫోరం, బహ్రేన్‌లో షియా తిరుగుబాటు వంటివి ఇరాన్ ప్రోద్బలంతోనే సాగాయి.

నాలుగు దశాబ్దాల తరువాత ఇరాన్ అంతర్గతంగా ఖొమేనీ విప్లవం తాలూకు దుష్ఫలితాలను అనుభవిస్తూనే ఉంది. అంతర్గతంగా కట్టడిపై ముట్టడి కొనసాగుతూనే ఉంది. దీని వల్ల పాలకులకు కొత్త తలనొప్పులు కలుగుతూనే ఉన్నాయి. మరో వైపు అంతర్జాతీయ రాజకీయాల్లో ఇరాన్ పలు ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే ఉంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇరాన్‌లో సకారాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉంది. ప్రజలతో ప్రభుత్వం ముఖాముఖి చర్చలను కొనసాగించి, సంవాదం ద్వారా సమస్యలను పరిష్కరించుకునే దిశగా ప్రయత్నాలు సాగించాల్సిన అవసరం ఉంది. ఈ నాలుగు పదుల అనుభవాన్ని ఉపయోగించుకుని కొత్త ఇరాన్ ఉద్భవానికి ప్రజా భాగస్వామ్యంతో ప్రయత్నాలు జరగాలి.

ఏ వేదన కలిగినా అవి మేఘాలుగానే కనిపిస్తాయి

తెలుగు పాఠకులను ముఖ్యంగా స్త్రీ పాఠకులను 1950, 1960 ప్రాంతాల్లో ఎంతో ప్రభావితం చేసి, తెలుగు సమాజాన్ని కదలించింది శరత్ సాహిత్యం. శరశ్చంద్ర చటర్జీ అవడానికి బెంగాలీ రచయిత అయినా ఆయన నవలలు, కథలు తెలుగు పాఠకలోకాన్ని అమితంగా ఆకర్షించాయి. 1950, 60లలోని తెలుగు మహిళా పాఠకులకు శరత్ ఒక ఆదర్శమయిన రచయిత. శరత్ ఇలా బహుళాదరణ పొందడానికి కారణం, శరత్ రచనలను తెలుగు లోకానికి అందించిన అనువాదకులు బొందలపాటి శివరామకృష్ణ, ఆయన శ్రీమతి శకుంతలాదేవి, ప్రముఖ రచయిత, నిర్మాత చక్రపాణి.ఈ శరత్ బెంగాలీ రచనల అనువాదాలు ఎంత గొప్పవి అంటే, శరత్ నిజంగా తెలుగు రచయిత అని అందరూ నమ్మేలా ఉన్నాయి. ఆనాటి మహిళా పాఠకులు ఎంతోమంది తమ పిల్లలకు శ్రీకాంత్, శరత్, పార్వతీ, రాజ్యలక్ష్మిలాంటి శరత్ కథానాయకులు, కథా నాయికుల పేర్లు పెట్టుకున్నారు. అనేక శరత్ నవలలు, రచనలు ఆధారంగా చాలా తెలుగు సినిమాలు 1950,60లలో వచ్చి మంచి ప్రజాదరణ పొందాయి. మీకోసం విజయక్రాంతి అందిస్తోన్న బొందలపాటి శివరామకృష్ణ, శకుంతల శరత్ అనువాద సాహిత్యం చదవండి... చదివించండి.

సమాజాన్ని కదలించిన శరత్ సాహిత్యం



స్త్రీ జీవితమంతా తిరుగుళ్ళతోనే గడిచిపోయింది. ఈ దేశదిమ్మరి జీవితంలో మూడవఝామున నిలబడి దానిలో ఒక అధ్యయాన్ని వినిపిస్తూ ఉంటే, ఇవ్వాళ నాకు ఎన్నో సంగతులు జ్ఞాపకమొస్తున్నాయి.

ఈ దిమ్మరి తనంతోనే నేను బాల్యావస్థనుండి వృద్ధాప్యానికి వచ్చాను. తనవాళ్ళు పరాయివాళ్ళ నోటితోనే గాక అడ్డమైనవాళ్ళ నోటితోనూ 'ఛీ' అనిపించుకుంటూ నా జీవితాన్ని ఒక మహా క్షుద్ర పురుగు కన్నా మిన్నగా భావించలేక పోయాను. కాని ఎంతోకాలానికి ఈనాడు కొంత జ్ఞప్తి ఉండి, మరికొంత మరచిపోయిన కథామాల నల్లటానికి కూర్చుని జీవిత ప్రభాతంలోనే అంకితమైన ఆ సుదీర్ఘ క్షుద్రత్వాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటే అది లోకులనుకున్నంత పెద్దది కాదేమోనని సంశయం కూడా కలుగుతూ ఉంటుంది. భగవంతుడు తన సృష్టి మధ్యన బలవంతాన నెట్టిన వానిని మంచిపిల్ల వాడనిపించి పరీక్ష పాసయ్యే అవకాశం ఇవ్వడు. బండ్ల మీద, పల్లకీలమీద తిప్పించి 'కథ' పేరు పెట్టి అచ్చొత్తించే అభిరుచి కలిగించడు. అతనికి తెలివితేటలయితే ఇస్తాడు కాని లోకులు వాటిని పనికి వచ్చే తెలివితేటలుగా భావించరు. అందుచేతే అతని ప్రవృత్తి అతి విచిత్రంగానూ వింతగానూ ఉంటుంది. అతను చూసే వస్తువులు, తెలుసుకోవాలనుకున్న వింతగానూ ఉంటుంది. అతను చూసే వస్తువులు, తెలుసుకోవాలనుకున్న తృష్ణను గురించి వర్ణిస్తే సుగుణవంతులు విరగపడి చస్తారు. తర్వాత ఆ మొద్దబ్బాయి అనాదరణ, అవహేళనవల్ల చెడు స్నేహం పట్టి మరింత చెడిపోయి డక్కా – ముక్కీలు తింటూ తనకు తెలియకుండానే ఏదో ఒక రోజున అపకీర్తి జోలి మెడను వేసుకుని ఎటు పోతాడో చాలా కాలంవరకు మరి అతని అంతు ఉండదు.

అందుచేత ఈ సంగతులన్నీ అలా ఉంచి చెప్పదలచుకున్నది చెబుతున్నాను. చెప్పినంత మాత్రాన చెప్పటమనిపించుకోదు. తిరగటం వేరు దాని గురించి వర్ణించటం వేరు. కాళ్ళున్న ప్రతివాడూ తిరగగలడు. కాని చేతులున్న ప్రతివాడూ వ్రాయలేడు. వ్రాయటం చాలా కష్టం. అదీగాక భగవంతుడు నాలో కల్పనగాని, కవిత్వంగాని ఇసుమంతకూడా పెట్టలేదు. ఈ దౌర్భాగ్యపు కళ్ళతో ఏది చూస్తారో అదే కనబడుతుంది. వృక్షాన్ని వృక్షంగానే చూస్తాను. పర్వతాలు పర్వతాలుగానే కనపడుతాయి. నీరు నీరుగా తప్ప మరొకవిధంగా కనపడదు. ఆకాశంలో మేఘాలకేసి చూస్తే, నా హృదయంలో ఏదో వేదన కలిగినా అవి మేఘాలుగానే కనిపిస్తాయి. వాటిని చూస్తూ ఉంటే నాకు ఎవరి కేశరాశీ జ్ఞప్తికిరాదు. ఆఖరికి ఒక వెంట్రుక కూడా కనపడదు. చంద్రునికేసి చూస్తూ ఉంటే, కళ్ళ వెంట నీళ్ళేకారతాయి కానీ దానిలో ఎవరి దేహమూ ప్రతిబింబించదు. ఈ విధంగా భగవంతుడు కల్పనకూ నాకూ ఇంతదూరం చేస్తే కవిత్వమెలా అల్లను? యదార్థాలను, ఎరుగున్న వాటిని సూటిగా చెప్పగలను. అందుచేత అలాగే చేస్తున్నాను.

నేను తిరుగుబోతు ఎందుకయ్యానో చెప్పబోయే ముందు జీవితాలకు దూరంలోనే నన్ను ఈ మత్తులో ముంచిన వ్యక్తిని గురించి చెప్పటం అవసరం. అతని పేరు ఇంద్రుడు. మా ఇద్దరికీ మొట్ట మొదటగా ఒక ఫుట్‌బాల్‌మేచ్ వద్ద పరిచయమైంది. అతడు ఇవ్వాళ బ్రతికిఉన్నాడో లేదో తెలియదుగాని, ఒక రోజున తెల్లవారుఝామున లేచి కట్టుపంచ మాత్రం చంకన పెట్టుకుపోయాడు, మళ్ళీ తిరగిరాలేదు.

స్కూలు ఆవరణలో హిందువులు ఒక జట్టుగాను, ముస్లింలు ఒక జట్టుగాను చేరి ఫుట్‌బాల్ మేచ్ ఆడుతున్నారు. నేను ధ్యానంతో చూస్తున్నాను. నా ఆనందానికి అంతులేదు. హఠాత్తుగా ఇదేమిటి? చటపట శబ్దాలు. 'కొట్టండి గాడిదకొడుకొని కొట్టండి' అన్న అరుపులు మారుమ్రోగాయి. నా గుండె కొట్టుకోసాగింది. రెండు నిముషాలు ఇంతలో ఎవరెక్కడ మాయమయ్యారో తెలుసుకోలేక పోయాను. నీ వీపు మీద గొడుగు కర్ర విరిగేటప్పటికి తెలివి వచ్చింది. నలుగురైదుగురు వ్యూహం పన్ని కూర్చున్నారు. పారిపోవటానికి సందుకూడా దొరక్కపోయింది.

వీపుమీద దెబ్బ పడుతున్నది. సరిగ్గా ఆ సమయానికి కరవేగంతో వ్యూహాన్ని ఛేదించుకుంటూ ఒక యువకుడు వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. అతడే ఇంద్రనాధుడు.

నల్లటిరంగు. మురళిలాంటి ముక్కు, పెద్ద తల, మొహం మీద రెండు పుట్టుమచ్చలు ఉన్నాయి. నా ఎత్తే ఉంటాడుగాని, వయసు మాత్రం నాకంటే ఎక్కువ ఉంటుంది. 'భయమేమీ లేదు – నువ్వు నా వెనకనే బయటకు రా' అన్నాడు. ఆ యువకుని గుండెలోనున్న సాహసమూ, దయా దుర్లభమైనప్పటికీ అసాధారణము మాత్రం కాదు. అతని భుజాలు అసాధారణమనటంలో సందేహము లేదు. ధైర్యమే కాదు బలంకూడా ఉంది. అతని చేతులు చూచి ఎరుగనివారికి మూడుచేతులు సత్తువగల ఆ చెయ్యి పెట్టి కొడితే, ముక్కు పగులుతుందేమోనని సందేహము కలుగుతుంది. కాని దాన్ని చెయ్యి అనేకన్న పులి పంజా అనడం ఎక్కువ సమంజసమనుకు ంటాను. నిమిషంలో నేను అతని వెన్నంటుకుని బయటికి వచ్చాను. ఇంద్రనాధుడు ప్రగల్భమేమీ కనపరచకుండా 'పారిపో' అన్నాడు. పారిపోతూ నేను 'మరి నువ్వు?' అని అడిగాను. అతను కఠినంగా సమాధానమిచ్చాడు. 'నువ్వు పారిపోరా వెధవా!' అని.

వెధవను కానీ మరేమన్నా కానీ రివ్వున వెనక్కి తిరిగి నుంచుని 'నేను పారిపోను' అన్నాను. (సశేషం)

– బొందలపాటి శివరామకృష్ణ, శకుంతలదేవి

తెలంగాణకు అన్యాయం జరిగింది యదార్థమే: రాజీవ్

(నిన్నటి తరువాయి)

అప్పటి నుండి చెన్నారెడ్డి రాజకీయ ప్రత్యర్థులకు సంజయ్ నుండేకాక శ్రీమతి గాంధీ మద్దతుకూడ లభించింది. ఆంధ్ర లాబీ తెలంగాణ నాయకుడిని ముఖ్యమంత్రి పదవి నుండి ఉద్వాసన చెప్పే పన్నాగం సాగించగా, వారికి చెన్నారెడ్డి మంత్రివర్గ సహచరులు కొందరి సహాయం కూడ దొరికినది. వీరిలో తెలంగాణ నాయకులూ ఉన్నారు. ఈలోగా ఒక ప్రముఖ దినపత్రిక నిర్విరామంగా చెన్నారెడ్డి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించి ఆయనను తిరుగలేని విధంగా అప్రతిష్టపాలు చేసి బలహీనపరిచింది. మంత్రివర్గ సహచరులతోను, కొందరు శాసన సభ్యులతోను ఏర్పడిన విభేదాలు ఆ తరువాత చెలరేగిన మతకలహాలు, మారణహోమాలు చివరకు చెన్నారెడ్డి పదవి నుండి వైదొలగడానికి కారణమయ్యాయి.

ఆ తరువాత ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన తెలంగాణ నాయకుడు శ్రీ అంజయ్యను కూడా ఆంధ్రనాయకులు ప్రశాంతంగా జీవించనీయలేదు. 1982లో ఆంధ్రప్రాంతానికి చెందిన వెంకట్రామ్ ముఖ్యమంత్రి అయ్యేవరకు వారు విశ్రమించలేదు. ఇంచుమించు అదే సమయంలో అసంతృప్త కాంగ్రెస్ నాయకుడు నాదెండ్ల భాస్కరరావు సహకారంతో ఎన్టీ రామారావు నూతన రాజకీయ పార్టీ ఏర్పాటు చేసి, దానికి 'తెలుగుదేశం' అని నామకరణం చేశారు. ముగ్గురు ముఖ్యమంత్రుల మార్పుతో విసుగు చెందిన ప్రజలు తెలుగుదేశం కొమ్ము కాయడం జరిగింది. పదవులు దొరకని వారు భవనంకు కూడా ఎసరు పెట్టడంతో విజయభాస్కరరెడ్డి నాయకుడై, కులతత్వంతో పాలనచేసి తరువాత శాసనసభ ఎన్నికలలో ప్రభుత్వాన్ని తెలుగుదేశం పార్టీకి అప్పగించారు. 1983–89 మధ్యకాలంలో తెలుగుదేశం అధినేత శ్రీ నందమూరి తారకరామారావు ప్రభుత్వానికి ఆధిపత్యం వహించారు.తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి గురించి ఆలోచించే వ్యవధి, రాజకీయ కారణాల వలన ఆయనకు లేకపోయినది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదని గగ్గోలుపెట్టి, తెలుగుదేశం నాయకులచే ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ నివాసం ముందు ధర్నా చేయించడం ద్వారా ప్రచారం పొంది, ప్రజల దృష్టిని మళ్ళించే ప్రయత్నమే రామారావు ప్రభుత్వం చేసింది తప్ప, తెలంగాణ అభివృద్ధికి తాను చేయగలిగిన పని చేయలేదు. 1973–83 మధ్యకాలంలో దశాబ్దం పాటు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రవాదులు కొడిగట్టిన దీపాలవలె ఉండిపోయినా, తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన అనంతరం 1983లో హిమయత్ నగర్ నుండి శాసన సభకు జరిగిన ఉప ఎన్నికలలో వారిలో కొందరు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరు ఎవరో ఒక అభ్యర్థి విజయానికి కాక, పి. ఉపేంద్ర ఓటమికి కృషి చేశారు. ఈ ప్రయత్నానికి యి.వి. పద్మనాభం, జర్నలిస్ట్ ప్రతాప్ కిషోర్ వారి మిత్రులు చొరవ తీసుకున్నారు. వీరు ఇంటింటికి వెళ్ళి ఆంధ్ర ప్రాంతీయుడు పి.ఉపేంద్ర, హైదరాబాదు నుండి గెలవడానికి ఎట్టి పరిస్థితిలోను సహకరించవలదని చేసిన విజ్ఞప్తి, పరోక్షంగా బీజేపీ అభ్యర్థి స్థానిక నాయకుడు యన్.నరేంద్ర విజయానికి తోడ్పడింది. ఉపేంద్ర ఓటమితో సంతృప్తి చెందిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రవాదులు వై.యం.సి.ఏ హాలులో జరిపిన సదస్సు విజయవంతమైంది. మాజీ మంత్రులు బాగారెడ్డి, గోకారామస్వామి, ఈ సదస్సులో ప్రసంగించగా స్టేట్ ఎడ్వయిజర్ పత్రిక సంపాదకుడు సత్యనారాయణ, పద్మనాభం, ప్రతాప్ కిషోర్ ప్రభృతులు ఈ సదస్సును గురించి ఆలోచన చేసి దానిని ఏర్పాటు చేశారు. తరువాత ఉద్యమనిర్వహణకు ఎడిటర్ సత్యనారాయణ కన్వీనర్‌గా తెలంగాణ డెమోక్రాటిక్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. ఈ టి.డి.ఎఫ్, కార్యకలాపాలకు జాతీయ పత్రికలలో ప్రాధాన్యత లభించింది. 1984లో దేవానంద స్వామి అనే మరొక ప్రత్యేకరాష్ట్ర వాది వరంగల్ పట్టణంలో తెలంగాణ పార్టీని స్థాపించి రాష్ట్ర విభజన నినాదాన్ని కొంతకాలం ప్రచారంలో ఉంచగలిగారు. ఈలోగా హైదరాబాద్‌లో 'స్టేట్ ఎడ్వయిజర్' పత్రిక సంపాదకుడు సత్యనారాయణ అధ్యక్షతనే ఏర్పడిన 'తెలంగాణా జనసభ' 1985 ఫిబ్రవరి 27న ఆంధ్ర సారస్వత పరిషత్తుహాలులో మరొక పెద్ద సదస్సు నిర్వహించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించాలని డిమాండ్ చేసింది. ఈ సదస్సుకు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, అఖిల భారత ఆర్యసమాజ్ నాయకుడు వందేమాతరం రామచంద్రరావు అధ్యక్షత వహించారు. అదే రోజున సిద్ధిపేటలో ఒక బహిరంగసభలో ప్రసంగించిన నాటి ప్రధానమంత్రి శ్రీ రాజీవ్‌గాంధీ తెలంగాణ విషయం ప్రస్తావించి ఆ ప్రాంతానికి అన్యాయం జరిగిన మాట యదార్థమేననీ, అది నిర్లక్ష్యానికి గురియైనదని పేర్కొన్నారు. సారస్వత పరిషత్ హాలులో జరిగిన సదస్సు వివరాలు అటు రాజీవ్ గాంధీ అభిప్రాయాలు మర్నాడు పత్రికలు ప్రచురించగానే ప్రత్యేక రాష్ట్ర వాదులలో నూతన ఆశలు చిగురించాయి. జనసభ నాయకులు వందేమాతరం రామచంద్రారావు నేతృత్వంలో కొత్తగూడెం, వరంగల్ పట్టణాలలో సభలు నిర్వహించిన అనంతరం ఒక ప్రతినిధి వర్గంతో ఢిల్లీవెళ్ళి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రి, దేశీయాంగశాఖా మంత్రి యస్.బి. చవాన్‌కు వినతి పత్రాలు సమర్పించి, బీజేపీ నాయకుడు అద్వానీ, జనతా పార్టీ నాయకుడు జార్జి ఫెర్నాండెజ్‌తో సహా పలువురు నాయకులను సందర్శించి తిరిగి వచ్చింది. తరువాత కాలంలో వందేమాతరం రామచంద్రరావు అఖిల భారతస్థాయిలో ఆర్యసమాజ్ కార్యకలాపాలలో తలమునకలవడంతో ప్రత్యేక రాష్ట్ర కార్యక్రమాలు క్రమక్రమంగా దాదాపు స్తంభించిపోయాయి. 1987లో ప్రతాప్ కిషోర్ ఢిల్లీ పాద యాత్ర కార్యక్రమం చేపట్టి జూన్ 6న హైదరాబాద్‌లో బయలుదేరారు. మార్గ మధ్యాన ఎంతో మందితో మాట్లాడి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అవసరాన్ని ప్రజలకు తెలియజేస్తూ కాలినడకన జూన్ 28న నాగపూర్ చేరే సరికి పాదాలు పూర్తిగా వాచి కదలలేని పరిస్థితి ఏర్పడింది.

(సశేషం) – ఆదిరాజు వెంకటేశ్వర రావు

దేశ ప్రగతికి యువతే ప్రాణవాయువు



సాహసోపేతమైన చర్యలకు చిరునామాగా నిలచిన యువత, తమను తాము సంస్కరించుకునే స్వభావాన్ని అలవరచుకుని ముందడుగు వేస్తుంటే అత్యున్నత శిఖరాలకు తేలికగా చేరుకోగలరు. ఇందుకు గాను మొట్టమొదటగా ప్రధాన భూమిక పోషించేది తల్లిదండ్రులు. పిన్న వయసులోనే పిల్లలకు ప్రతి పనిలోను అవకాశం కల్పించి వారిచేతనే చేయించవలెను. తర్వాత బాధ్యతను ఆపాదించవలెను. చదువుకై ఒకటవ తరగతి నుంచి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, అక్కడి నుంచే పనిమీద శ్రద్ధ, ఏకాగ్రత, అవగాహనలను అలవాటు చేయాలి. దాని వలన వచ్చే ఫలితాలు యువత భవిష్యత్తుకు పునాదిగా మిగులుతాయి. దేశాభివృద్ధిలో యువత తమవంతు కీలకపాత్ర పోషిస్తారనడంలో సందేహమే లేదు. ఒక పల్లె రైతు తన వ్యవసాయంలోని మెళకువలను, తన ఇంటి గేదెల పెంపకం విషయాలను తన పిల్లలకు ఎలా చెబుతాడో, పిల్లవాని చదువు విషయంలోనూ అంతే ప్రాధాన్యతను ఇస్తున్నాడు. కష్టపడే తత్వాన్ని చిన్న వయసు నుంచే అలవాటు చేస్తే, తాము ఏ రంగంలో రాణించగలమో యుక్తవయస్సు వచ్చేనాటికి ఒక నిర్ణయానికి రాగలుగుతారు. తల్లిదండ్రులు పిల్లలు వారి బాధ్యతను వారే గుర్తెరిగేలా ముందుకు సాగాలి.

ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాఠ్యంశాలమీదనే దృష్టి పెట్టకుండా, యువతను ఉత్తేజపరచే విషయాలను, నైతిక విలువలను పెంపొందించే సారాన్ని రుచి చూపించటం చాలా అవసరం. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థి ప్రవేశార్హత పొందినప్పుడే కఠినమైన నియమ నిబంధనలను తెలియజెప్పాలి. ర్యాగింగులు, ఉద్యమాలు, అసాంఘిక చర్యలకు పాల్పడనని, బయటి వ్యక్తులకు ప్రవేశం కల్పించనని ఖచ్చితమయిన హామీ పత్రాన్ని ప్రతి విద్యార్థి నుంచి తప్పనిసరిగా తీసుకోవడం వల్ల క్రమశిక్షణకు పునాది రాయి వేసినట్లవుతుంది. అలాగే ప్రతి కాలేజీ నిర్వాహకులు బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటుచేసి ప్రతి విద్యార్థి యొక్క ప్రతిక్లాసు యొక్క హాజరు తల్లిదండ్రులకు వెళ్ళేటట్లుగా సెల్‌ఫోన్ ద్వారా ప్రణాళికులు రూపొందించుకొని కట్టుదిట్టమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. విద్యాలయమంటే దేవాలయమంత పవిత్రమయినదని అటు విద్యార్థులు, ఇటు యాజమాన్యము గుర్తించి నడుచుకోవాలి. యువత అసభ్యకర ప్రవర్తనను విడనాడాలి. అన్ని రంగాలను అందిపుచ్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికను విద్యార్థి దశ నుంచే వేసుకోవాలి. అవి అమలు జరిగేటట్లు పక్కా సమయపాలనను యువత పాటించాలి.

యువత దేశప్రగతి ప్రాణవాయువులాంటి వారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను శాసించే స్థాయిలో మన దేశ యువత ఈ రోజు ఉన్నదంటే ఆశ్చర్యపోవలసిన పనే లేదు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో దేశభవిష్యత్తు, మంచి అభివృద్ధి, భ్రష్టుపట్టిన రాజకీయ వాతావరణాన్ని తరిమేసి, అవినీతి రహిత సుపరిపాలనను తీసుకురావాలంటే యువత విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలి. శాస్త్ర సాంకేతిక రంగాలలో యువత తన సాహసోపేతమైన అభివృద్ధిని దేశప్రగతిలో నిరూపించాలి. ఇటీవల తమిళనాడు కళాశాల విద్యార్థులు 'కలాంశాట్' రాకెట్ ప్రయోగించి వారిసత్తా ఏమిటో దేశానికి తెలియచేశారు. అన్ని కళాశాలల యాజమాన్యాలు అధ్యాపకులు యువతను కార్యోన్ముఖులను చేసి ముందుకు నడిపించాలి. ఈ విషయంలో దివంగత రాష్ట్రపతి కీర్తిశేషులు అబ్దుల్ కలాంగారు పదవిలో ఉండగా, పదవి నుండి బయటకు వచ్చిన తరువాత కూడా యువతను సెమినార్‌లు, ట్రైనింగ్ ప్రోగామ్స్, సమావేశాలకు హాజరయి యువతను ఎంతగానో ప్రోత్సహించి ఉత్తేజపరిచారు. చివరకు తుదిశ్వాస కూడా విద్యార్థుల సాంగత్యంలో విడిచారు. ప్రతిమేధావి, ప్రతి యువకుడు ఒక కలాంలా ఆలోచిస్తే దేశ ప్రగతిలో యువతే ప్రాణవాయువుగా ఉంటుందనేది అతిశయోక్తి లేదు. ప్రస్తుతం సమాజంలో ఉన్న రుగ్మతలకు, అసందర్భపు ఆవేశాలకు చక్కని పరిష్కారం యువత చేయగలిగేటట్లుగా తయారు కావాలి.


శాశ్వతమయిన విలువలనుగాని, ఉన్నతమయిన ఆదర్శభావాలను గాని, మానసిక వికాసానికి, పరిపక్వతకు మన భారతీయ సంస్కృతీ సంప్రదయాలను, సంపదలను తీర్చిదిద్దుకొనుటకు వివేకానందుని దివ్య బోధనలు మన యువతకు మార్గదర్శకాలు. ఆయన సందేశాలన్నీ మనకు జ్ఞాననేత్రము ల వంటివి. జాతీయ యువజనోత్సవాలను జరుపుకోవడంలోని ముఖ్యోద్దేశ్యం జాతిని జాగృతం చేయడం. దేశప్రగతిలో యువతీ యువకుల పాత్రను గుర్తు చేసుకోవడం. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో యన్.సి. సి, యన్.యస్.యస్. సైనిక ప్రతిభా పాటవాలను తప్పనిసరిగా వారానికి ఒకరోజు కేటాయించి క్రమశిక్షణకు బాటలు వేయాలి. మన జాతీయ పండుగలయిన జనవరి 26, ఆగస్టు 15, అక్టోబరు 2వ తేదీలను, ముఖ్యమయిన పవిత్ర పండుగలకు సెలవులు ప్రకటించకుండా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలా ఆ పర్వదినాల విశిష్టతను విద్యార్థులకు, యువకులకు తెలియజేయటం చాలా అవసరం. మన గాంధీజీ, పటేల్‌జీ, కలాంజీ కలలుగన్న యువ భారతావనిని చూడాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు విద్యాసంస్థలు, ప్రభుత్వాలు తీసుకుంటేనే భారతదేశం అగ్రదేశాల జాబితాలో ముందువరుసలో ఉండ గలదని ఆశిద్దాం.

– చివుకుల వాసుదేవమూర్తి
9849651444

మద్యం విక్రయాలపై నియంత్రణ లేదు

సమయ పాలన లేకుండా మద్యం విక్రయాలు జరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ దుకాణాలు ఏర్పాటు చేయటం, దుకాణాల చుట్టు పక్కలే మద్యం తాగుతుండటంతో మందు బాబుల గొడవతో చుట్టుపక్కల ఇళ్లలోని వారు, రహదారులపై ప్రయాణించే వారు అనేక అవస్థలు పడుతున్నారు. పిల్లలు, మహిళలు ఆ దారుల్లో వెళ్లాలంటేనే తీవ్ర భయాందోళనలకు గురవుతన్నారు. గ్రేటర్ పరిధిలో చాలా ప్రాంతాల్లో కొన్ని మద్యం దుకాణాలు అర్ధరాత్రి కూడా మద్యం అమ్మకాలు సాగిస్తున్నాయి. కొందరు దుకాణదారులైతే అనుమతి పొందిన దుకాణానికి సమీపంలోనే ఒక గొలుసు దుకాణాన్ని ఏర్పాటు చేసి అక్కడ నుంచి విక్రయాలు సాగిస్తున్నారు. గొలుసు దుకాణాలకు సమీపంలో ఉంటున్న వారికి రాత్రిసమయాల్లో కంటిమీద కునుకు ఉండటం లేదు. కొన్ని వీధుల మొదట్లోనే మద్యం దుకాణాలు ఉంటున్నాయి. ఇలాంటి వీధుల్లోకి నివాసితులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణానికి సమీపంలో ఉన్న పర్మిట్ రూంలు బార్లను తలపిస్తున్నాయి. అంతేగాక మద్యం దుకాణాలకు దగ్గరగానే ఆహారపదార్థాలు అమ్మటం వలన మద్యం తాగిన వారు అక్కడే నిలబడి తాగి, తిని, చుట్టు ప్రక్కల ప్రాంతాలలోనే మూత్రం పోసి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. తాగిన మత్తులో తరచూ రోడల మీదే గొడవలు పడుతున్నారు. మద్యం దుకాణాల చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అబ్కారీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సురేఖ, హైదరాబాద్



వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

ఆ ఘనత టీడీపీదే

- సూక్ష్మసేద్యంలో దేశంలోని తొలి 10 జిల్లాల్లో ఆరు ఏపీలోనే
- వ్యవసాయంలో రాష్ట్ర వృద్ధి 11 శాతం
- శాసనసభలో సీఎం చంద్రబాబు




విజయక్రాంతి, అమరావతి : ఎరువులు, విత్తనాలు దొరక్క 2004 నుంచి 2014 వరకు రాష్ట్రంలో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దీంతో దిగుబడి తగ్గిపోయి రైతులు నష్టపోయారని చెప్పారు. విద్యుత్ సరఫరాను దృష్టిలో పెట్టుకుని రాత్రిపూట పొలాలకు వెళ్లిన రైతులు చనిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయని చంద్రబాబు వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలపై శాసనసభలో చేపట్టిన లఘుచర్చలో సీఎం మాట్లాడారు. దేశంలోనే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదని చెప్పారు. వ్యవసాయానికి కేటాయింపులే కాకుండా అభివృద్ధి కూడా చేయగలిగామన్నారు. వ్యవసాయంలో రాష్ట్ర వృద్ధి 11శాతం ఉండగా, దేశంలో 2.4శాతం ఉందని చెప్పారు. రైతుల ఆదాయం పెరిగేలా చేశామని, సూక్ష్మసేద్యంలో దేశంలోని తొలి 10 జిల్లాల్లో ఆరు ఏపీలోనే ఉన్నాయన్నారు. రైతులకు కేంద్రం ఇచ్చే సాయం తక్కువగా ఉందని, ఐదెకరాల లోపు భూమి ఉండాలని షరతులు విధించారని చంద్రబాబు విమర్శించారు. ఫసల్ బీమా పథకంలో కట్టే ప్రీమియంకు వచ్చే బీమా డబ్బుకు చాలా వ్యత్యాసం ఉంటోందన్నారు. కర్నూలులో సీడ్ పార్కును తీసుకొస్తున్నామని, దీని ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుతాయన్నారు.

అన్నదాతా సుఖీభవ తీసుకొస్తున్నాం

వ్యవసాయంలో గణనీయమైన అభివృద్ధి సాధించామని, త్వరలో అన్నదాతా సుఖీభవ పథకాన్ని కూడా తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. ఉద్యాన రంగంలో తక్కువ ఖర్చుతో ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం సమకూరుతోందన్నారు. ఈ రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నామని, దక్షిణాదిలో పండే పండ్లు, కూరగాయల్లో ఎక్కువ శాతం ఏపీ నుంచే ఉంటున్నాయని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో కోటి ఎకరాల్లో ఉద్యాన పంటలు ఉండాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దేశానికి కావాల్సిన ఆక్వా ఉత్పత్తులన్నీ ఏపీ నుంచే అందిస్తున్నామని, రాష్ట్ర రైతుల ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి కావాలని ఆయన ఆకాంక్షించారు.

సామాజిక న్యాయం కోసమే పోరాడా

పశ్చిమ బెంగాల్‌లో కేంద్రం చర్యను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తప్ప అంతా ఖండించారని ఏపీ సీఎం చంద్రబాబు మండిపడ్డారు. అభివృద్ధి గురించి మాట్లాడలేకే కులాల మధ్య జగన్ చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. సామాజిక న్యాయం కోసం పాటు పడే ఏకైక పార్టీ టీడీపీనేనని సీఎం స్పష్టంచేశారు. పార్టీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని వర్గాల బాగుకోసమే ఫెడరేషన్లు పెట్టి ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. మోదీ పక్షాన జగన్ ఉండటం చూసి మైనార్టీలు ఆయనకు దూరం అయ్యారన్నారు. జగన్‌కు ఉన్న కుల పిచ్చి ఏమిటో అందరికీ తెలుసని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చిన్నతనం నుంచే సామాజిక న్యాయం కోసమే తాను పోరాడానన్నారు. ఫెడరల్ ఫ్రంట్ అని తిరిగిన కేసీఆర్ నిన్న ఎందుకు నోరు మెదపలేదని సీఎం ప్రశ్నించారు. అమిత్ షా తలుపులు మూసేశానని మాట్లాడుతున్నారని, బీజేపీ తలుపులను ప్రజలు ఎప్పుడో మూసేశారని చంద్రబాబు ఎద్దేవాచేశారు. నిన్నటి పలాస సభలో ప్రజలు లేక బీజేపీ నేతలు దిక్కులు చూశారని సీఎం అన్నారు.



సంక్షేమానికి పెద్ద పీట

- ఏపీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- 11వసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన యనమల

విజయక్రాంతి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు 2019–20 సంవత్సరానికి సంబంధించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 11వసారి యనమల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం గమనార్హం. చారిత్రాత్మకమైన రాజధాని నగరం మన అమరావతి అని ఈ సందర్భంగా కొనియాడారు. 11వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. నాలుగున్నరేళ్ల ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నామన్నారు. హేతుబద్ధత లేకుండా రాష్ట్ర విభజన జరిగిందని విమర్శించారు. దాని వల్ల రాజధాని నగరాన్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయవ్యయాలు, ఆస్తులు, అప్పులు సరిగా పంపిణీ చేయలేదన్నారు. సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు యనమల తెలిపారు. 2019–20 బడ్జెట్ అంచనా రూ.2,26,117.53కోట్లు కాగా, గతేడాది కన్నా ఇది 18.38శాతం పెరుగుదల. రెవెన్యూ వ్యయం రూ.1,80,369.33 కోట్లు (20.03శాతం పెంపు కాగా, మూలధన వ్యయం రూ.29,596.33 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2,099.47కోట్లుగా అంచనా వేయగా, ఆర్థికలోటు 32,390.68కోట్లుగా అంచనా వేశారు.

బడ్జెట్ స్వరూపం (రూ.కోట్లలో)

అంచనా	–2,26,117.53
రెవెన్యూ వ్యయం	– 1,80,369.33
మూలధన వ్యయం	– 29,596.33
రెవెన్యూ మిగులు	– 2099.47
ఆర్థికలోటు	– 32,390.68

పోలీసు వ్యవస్థను

భ్రష్టు పట్టించిన బాబు

- ఏలూరులో బీసీ డిక్లరేషన్
- వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ



విజయక్రాంతి, హైదరాబాద్ : ఈవీఎంల ద్వారా గెలిచిన చంద్రబాబు ఇప్పుడు వాటిని విమర్శించడం తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ టాంపరింగ్ చేసి గెలిచాయి కాబట్టే ఇప్పుడు ఆ పార్టీ నేతలు భయపడుతున్నారని దుయ్యబట్టారు. పోలీసు వ్యవస్థను బాబు భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయన సామాజిక వర్గ పోలీసులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. నిబద్ధత గల పోలీసులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఏనాడు పోలీసులను టార్గెట్ చేయలేదని పేర్కొన్నారు.

బుధవారం చిత్తూరు జిల్లాలో వైఎస్ జగన్ సమర శంఖారావం సదస్సు ప్రారంభిస్తారని బొత్స తెలిపారు. వైఎస్ జగన్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో భాగంగా పార్టీ బూత్ కమిటీ నాయకులతో ఆయన భేటీ అవుతారని బొత్స పేర్కొన్నారు. ఈ సదస్సులో ఓటర్ల తొలగింపు, డబ్బు, మద్యం పంపిణీ వంటి టీడీపీ అకృత్యాలు ఎండగడతామని తెలిపారు. సమర శంఖారావానికి జిల్లాకు 40 వేల మంది హాజరవుతారన్నారు. బీసీ సంక్షేమానికై ఏలూరులో వైఎస్ జగన్ బీసీ డిక్లరేషన్ విడుదల చేయనున్నారని పేర్కొన్నారు.

డబ్బుల కోసమే జయరాం హత్య

- వివరాలను వెల్లడించిన కృష్ణాజిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి
- ఇద్దరు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన పోలీసులు



విజయక్రాంతి, నందిగామ: పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరాం హత్యకేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఇవాళ పోలీసుల మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేసు వివరాలను కృష్ణాజిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి వివరించారు. జయరాం హత్యకేసులో రాకేశ్‌రెడ్డితో పాటు అతని డ్రైవర్ శ్రీనివాస్‌ను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశామని తెలిపారు. డబ్బుల కోసమే పథకం ప్రకారం జయరాంను హత్య చేశారని తమ దర్యాప్తులో వెల్లడైందని ఎస్పీ వివరించారు. రాకేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. కుత్బుల్లాపూర్‌లోని జయరాం కంపెనీలో లాకౌట్ సమస్య వచ్చింది. ఈ సమస్య పరిష్కారం కోసం అమెరికా నుంచి జయరాం రాకేశ్‌రెడ్డికి ఫోన్ చేశారు. సమస్య పరిష్కారానికి శిఖా చౌదరికి సహకరించాలని రాకేశ్‌ను కోరారు. అలా వారి మధ్య కొన్నాళ్లు పరిచయం కొనసాగింది. ఆ తర్వాత జయరాం అమెరికా నుంచి రాగానే మహిళ పేరుతో సిమ్‌కార్డు తీసుకుని ఆయనతో చాటింగ్ చేశారు. గత నెల 30న జూబ్లీహిల్స్‌లోని రాకేశ్‌రెడ్డికి ఇంటికి జయరాంను రప్పించి బంధించి డబ్బుల కోసం వేధించాడు. తన వద్ద తీసుకున్న రూ.6కోట్లు వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశాడు. డబ్బుల కోసం జయరాంతో అతని స్నేహితులకు ఫోన్ చేయించారు. జయరాం కేవలం రూ.6లక్షలు మాత్రమే తెప్పించగలిగాడు.

గత నెల 31న ఉదయం వరకూ డబ్బుల కోసం వేచి చూశారు. డబ్బులు తీసుకురాకపోవడంతో జయరాంపై రాకేశ్‌రెడ్డి దాడి చేశాడు. జయరాం ముఖంపై బలంగా కొట్టడంతో జయరాం సోఫాపై నుంచి కింద పడిపోయారు. సోఫాకు ముఖం అదిమిపెట్టి ఊపిరాడకుండా చేసి హత్యచేశారు. వాచ్‌మెన్ సహాయంతో కారులో జయరాం మృతదేహం పెట్టారు. కారులో తీసుకొచ్చి నందిగామ వద్ద వదిలి వెళ్లిపోయారు. ఈ కేసులో ఇంకెవరి ప్రమేయమైనా ఉందా అనే విషయం దర్యాప్తు చేస్తున్నాం. ఈ కేసులో నుంచి బయట పడేందుకు రాకేశ్‌రెడ్డి కొందరు పోలీసుల అధికారుల సహాయం తీసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేస్తామని ఎస్పీ వివరించారు.

ఏసీపీపై బదిలీ వేటు

హైదరాబాద్ : ప్రముఖ వ్యాపారవేత్త, ఎన్నారై జయరాం హత్య కేసులో నిందితుడిగా భావిస్తున్న రాకేష్‌రెడ్డితో సంబంధం ఉన్నట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డిపై బదిలీ వేటు పడింది. ఈ విషయం గురించి రాచకొండ సీపీ మహేష్ భగవత్ మంగళవారం విలేరులతో మాట్లాడుతూ నిందితుడు రాకేష్ రెడ్డి, ఏసీపీ మల్లారెడ్డితో ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లుగా సమాచారం ఉందన్నారు. ఓ కేసు సందర్భంగా వీరిద్దరికి పరిచయం ఏర్పడిందని, ఆ క్రమంలోనే నింది తుడు మల్లారెడ్డితో సంబంధాలు పెంచుకున్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో అంబర్‌పేట్ కార్ హెడ్ క్వార్టర్స్‌కు మల్లారెడ్డిని అటాచ్ చేసినట్లు సీపీ పేర్కొన్నారు. ఈ విషయమై లోతుగా విచారణ జరుపుతున్నామన్నారు. ఇక ఇబ్రహీంపట్నం ఏసీపీగా వనస్థలిపురం ఏసీపీ గాంధీ నారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.



నేడు వైఎస్సార్‌సీపీ

'అన్న పిలుపు'

విజయక్రాంతి, తిరుపతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే 'అన్న పిలుపు' కార్యక్రమంలో తటస్థులు పాల్గొననున్నారని ఆ పార్టీ మీడియా విభాగం తెలిపింది. తిరుపతి రూరల్ మండలం తనపల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని పీఎల్ ఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని పేర్కొంది. అనంతరం తిరుపతి వేదికగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో జరగనున్న 'సమర శంఖారావ సదస్సు'కు మీడియా మిత్రులందరూ తప్పక హాజరుకావాలని మీడియా సెల్ మనవి చేసింది. తిరుపతిలోని యోగానంద్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సమర శంఖారావ సదస్సు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, చిత్తూరు జిల్లా బూత్ కన్వీనర్లతో వైఎస్ జగన్ సమావేశం కానున్నారు.

కలకలం రేపిన పరువు హత్య

- ప్రేమ వ్యవహారమే కారణం
- కూతురిని చంపిన తండ్రి

విజయక్రాంతి, ఒంగోలు: ఒంగోలు జిల్లా తాళ్లూరు మండలం కొత్తపాలెం గ్రామంలో పరువు హత్య కలకలం రేపింది. గ్రామానికి చెందిన కోట వెంకారెడ్డి తన కుమార్తె వైష్ణవి(20) వేరే సామాజిక వర్గానికి చెందిన యువకుడిని ప్రేమిస్తోందని ఆగ్రహించాడు. పలు మార్లు ఆమెకు నచ్చచెప్పినా వినలేదన్న కోపంతో ఆదివారం రాత్రి ఆమెను గొంతు నులిమి చంపేశాడు. కుమార్తె గుండెపోటుతో మృతి చెందిందని బంధువులు, గ్రామస్థులను నమ్మించే ప్రయత్నం చేశాడు. విషయం తెలిసి పోలీసులు రంగప్రవేశం చేయటంతో కథ మారిపోయింది. ఒంటిపై గాయాలు, గొంతు నులిమిన ఆనవాళ్లను బట్టి ఆమె హత్యకు గురైందని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. గ్రామ వీఆర్వో యలమందారావు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కన్న కూతుర్ని తండ్రే చంపటం ఏమిటంటూ పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైష్ణవి ఒంగోలులోని ఒక ప్రైవేటు కళాశాలలో రెండో సంవత్సరం బీకాం చదువుతోంది. లింగసముద్రం గ్రామానికి చెందిన తన సహచర విద్యార్థిని వైష్ణవి ప్రేమించినట్లు తెలుస్తోంది. వైష్ణవి రోజూ తమ ఊరి నుంచి బస్సులో కళాశాలకు వస్తుంటుంది. అతడు ఒంగోలులోనే ప్రైవేటు హాస్టల్లో ఉంటున్నాడు. రెండేళ్ల కిందటే వీరు ప్రేమలో పడినట్లు చెబుతున్నారు. ఏడెనిమిది నెలల క్రితం వీరి వ్యవహారాన్ని గమనించిన కళాశాల యాజమాన్యం సమాచారం ఇవ్వడంతో వైష్ణవి తల్లిదండ్రులు ఆమెను మందలించారు. గత నెల 31వ తేదీన ఇంటి నుంచి కళాశాలకని బయలుదేరిన వైష్ణవి ఇంటికి చేరలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆమె తల్లిదండ్రులు ఒంగోలులోని కళాశాల వద్దకు వచ్చి విచారించారు. తర్వాత ఆమె ఆచూకీని గుర్తించి ఇంటికి తీసుకొచ్చారు. కుమార్తెకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన తర్వాత ఆ విద్యార్థిని కూడా అతడి తండ్రి ఇంటికి తీసుకెళ్లిపోయారు. మళ్లీ ఒక్కరోజు వ్యవధిలోనే వైష్ణవి ఇంటి నుంచి అదృశ్యమైంది. ఫోన్ ద్వారా తన ప్రేమికుడికి సమాచారం ఇచ్చి మార్కాపురం వెళ్లింది. అతడొచ్చే లోపు బస్టాండులో ఒంటరిగా కనిపించిన వైష్ణవిని పోలీసులు గుర్తించి విచారించారు. విషయం తెలుసుకుని ఆమె తల్లిదండ్రుల్ని పిలిపించి వారికి అప్పగించినట్లు సమాచారం. ఇంటికి చేరిన తర్వాత ఈ విషయంపై తండ్రీ కూతుళ్ల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఆ ఘర్షణే హత్యకు దారి తీసింది. దీనిపై తాళ్లూరు ఎస్ఐ దాచేపల్లి రంగనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండపల్లి కోటకు మహర్దశ

- రూ.9.5 కోట్లతో రహదారుల అభివృద్ధి

విజయక్రాంతి, విజయవాడ : కొండపల్లి కోటకు మహర్దశ పట్టనుంది. పూర్తి స్థాయిలో పర్యాటక ధామంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. కోటకు వచ్చే మార్గాన్ని సైతం నేరుగా ఇబ్రహీంపట్నం నుంచి వేయనున్నట్లు ప్రకటించారు. కొండపల్లి కోట ఉత్సవాలు, సాహస క్రీడలు సోమవారంతో ముగిశాయి. ముగింపు వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లి కోటకు రూ.9.5 కోట్లతో రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు తిరుమల మాదిరిగా మెట్ల మార్గం కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో కొండపల్లి కోట, పవిత్ర సంగమం ప్రాంతం, రూ.1680 కోట్లతో కూచిపూడి ఐకానిక్ బ్రిడ్జి వంటివి ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అగ్రస్థానంలో నిలపనున్నాయన్నారు. రెండు రోజుల పాటు జరిగిన కొండపల్లి కోట ఉత్సవాలు, సాహసక్రీడల్లో యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జుమెరింగ్, రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్, జిప్లైన్, జొరాబిన్ వంటి సాహస క్రీడలను ఏర్పాటు చేశారు. వీటిని దిగ్విజయంగా నిర్వహించడంలో కీలకంగా వ్యవహరించిన వారికి ముఖ్యమంత్రి చేతులమీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించారు.

రెండో రోజు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కొండపల్లి ఖిండపల్లి ముఖ ద్వారం వద్ద ఉన్న హాజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ రెహమతుల్లా దర్గాను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఫకీర్లు ఘనంగా డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. దర్గాలో మతగురువులు, ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ అల్తాఫ్రజా, మొయిన్ తదితరుల ఆధ్వర్యంలో ఫతేహా నిర్వహించారు. పవిత్ర వస్త్రాన్ని చంద్రబాబుకు కప్పి, తలకు టోపీని తొడిగారు. అనంతరం మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొండపల్లి తాజాగా ఏర్పాటు చేసిన లేజర్ షో ఆకట్టుకుంది. రెండో రోజు లేజర్ షో ను చూసేందుకు పెద్దఎత్తున సందర్శకులు తరలివచ్చారు. కొండపల్లి ఖిల్లా మధ్యలో ఏర్పాటు చేసి మ్యూజియంను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు.



ఇది ఎన్నికల బడ్జెట్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శ

విజయక్రాంతి, అమరావతి : రాష్ట్ర బడ్జెట్ ప్రసంగం సీఎం చంద్రబాబు నాయుడు స్తోత్రంలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఇది మధ్యంతర బడ్జెటో లేక పూర్తిస్థాయి బడ్జెటో టీడీపీ నాయకులకే అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్ రాబోయే ప్రభుత్వానికి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడారు. ఇది కేవలం ఎన్నికల బడ్జెటే అంటూ తేల్చిచెప్పారు. బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప నిజంగా ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధికి సరైన మార్గాలు లేవన్నారు. ప్రజలు చాలా తెలివైన వారని, బాబు మాయ మాటలను నమ్మరని స్పష్టం చేశారు.

గత నాలుగున్నరేళ్లుగా రైతులకు పూర్తిగా రుణ మాఫీ చేయని చంద్రబాబు.. రైతులను మరోసారి మోసగించేందుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రవేశపెట్టారని మండిపడ్డారు. రూ.2.26 లక్షల కోట్ల బడ్జెట్‌లో కీలక రంగాలకు కేటాయింపులు సరిగా లేవని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కుదించిన రైతు రుణమాఫీలో ఇంకా రూ.8,200 కోట్లను ఇవ్వలేదని పేర్కొన్నారు. గత సెప్టెంబర్ నాటికి రైతుల అప్పులు రూ.1.37లక్షల కోట్లకు చేరాయని ఆయన అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు ఇళ్ల మంజూరు కేవలం రూ.4,099 కోట్ల రూపాయల కేటాయింపులతో ఎలా సాధ్యమని రామకృష్ణ ప్రశ్నించారు.

పాతవి మరచి కొత్త హామీలు

- బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు



విజయక్రాంతి, విజయవాడ : ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశ పెట్టిందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని చంద్రబాబు ఇప్పుడు కొత్త హామీలు గుప్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ అమలు చేయలేని చంద్రబాబు మళ్లీ రైతుల కోసం రూ.5000 కోట్లు అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. డ్వాక్రా రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు పసుపు కుంకుమ పేరుతో మరో డ్రామాకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. చంద్రబాబు మాటలని ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. ఒకవైపు కేంద్రం సహకరించలేదంటారు, మరోవైపు రాష్ట్రం అభివృద్ధి పథంలోనడుస్తుందని చంద్రబాబు చెపుతుంటారని చెప్పారు. కేంద్రం సహకరించకపోతే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు.

మెరిట్ ప్రకారమే పదోన్నతులు

- పోలీసులకు కులం ఉండదు
- ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్

విజయక్రాంతి, తిరుపతి: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ చేసిన ఆరోపణలపై ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ స్పందించారు. జగన్ ఆరోపణలను మీడియాలో చూశానని చెప్పారు. పోలీసులకు కులం ఉండదని, తమది ఖాకీ కులమని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశం మేరకు మెరిట్ ప్రకారం పదోన్నతులు ఇచ్చారని వివరించారు.

ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం అడిగితే తాను సమాధానం చెబుతానని స్పష్టం చేశారు. తాను నిజాయతీగా పనిచేస్తున్నానని, అవినీతి నిరోధక శాఖ డీజీగా తన పనితీరు ప్రజలకు తెలుసని పేర్కొన్నారు.



అది అవాస్తవం : చినరాజప్ప

ఏపీ డీజీపీపై జగన్ ఆరోపణలు చేయడం సరికాదని, ఆయన సమర్థంగా పనిచేస్తున్నారని హోంశాఖ మంత్రి చినరాజప్ప అన్నారు. కోర్టు తీర్పు ప్రకారమే కొందరికి పదోన్నతులు ఇచ్చామని చినరాజప్ప వెల్లడించారు. ఒకే సామాజిక వర్గానికి పదోన్నతులు ఇస్తున్నారనేది అవాస్తవమని పేర్కొన్నారు. జగన్‌పై కేసులు మాఫీ చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కాపులకు 5 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు పెడతామని, పదోన్నతులు, పోస్టింగ్ వివరాలపై తమ ప్రభుత్వం చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. నిన్న కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసిన జగన్ డీజీపీ ఠాకూర్, ఇంటెలిజెన్స్ చీఫ్ వెంకటేశ్వరరావు తదితరులను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరిన విషయం తెలిసిందే. వారు విధుల్లో ఉంటే ఎన్నికలు శాంతియుతంగా జరగవని జగన్ సీఈసీకి ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన ప్రముఖ టీవీ నటి

ముంబై: ప్రముఖ టీవీ నటి శిల్పా షిండే కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహారాష్ట్ర పార్టీ చీఫ్ సంజయ్ నిరుపమ్, సీనియర్ నేత చరణ్ సింగ్ సప్రా సమక్షంలో మంగళవారం ఆమె కాంగ్రెస్‌లో చేరారు. 1999లో టీవీ నటిగా కెరీర్ ఆరంభించిన 42 సంవత్సరాల శిల్పా షిండే ప్రముఖ టెలివిజన్ షో బాబీతో గుర్తింపు పొందారు.

కాగా, ప్రజల్లో ఆదరణ పొందిన టీవీ షో బాబీ జీ ఘర్ పర్ హైలో అంగూరి బాబీగా ఆమె నటన విశేషంగా ఆకట్టుకుంది. ఇక 2017 అక్టోబర్లో బిగ్‌బాస్ 11లో పాల్గొన్న షిండే విన్నర్‌గా నిలిచింది. కాగా 2014 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 48 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ కేవలం రెండు స్థానాల్లోనే గెలుపొందింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్ బరిలో దిగే అవకాశం ఉంది.

కష్టపడే వారికే సీట్లు



జైపూర్: కష్టపడి పనిచేసే కాంగ్రెస్ నేతలకే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వడం జరుగుతుందని రాజస్థాన్ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ స్పష్టం చేశారు. ఈ విషయమై ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడారు. మాకు నిజాయితీ, విధేయత, కష్టపడేతత్వం ఉన్న కార్యకర్తలు కావాలి. వారికి మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం వస్తుంది. టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మీ కుటుంబం నుంచి ఎవరైనా పోటీ చేయనున్నారా..? అన్న ప్రశ్నకు సచిన్ పైలట్ స్పందిస్తూ..కాంగ్రెస్ పార్టీ నాకు పెద్ద పదవి ఇచ్చింది. ఒకవేళ నేను మా కుటుంబసభ్యులకు టికెట్ కావాలని అడిగితే పార్టీ కార్యకర్తల పరిస్థితి ఏంటి..?. అందుకే నా కుటుంబం నుంచి ఎవరూ వచ్చే ఎన్నికల్లో పోటీచేయరని సచిన్ స్పష్టం చేశారు. కష్టపడే కార్యకర్తలకు ఎప్పటికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు.

ఐటీ రీఫండ్.. కసరత్తు ప్రారంభం



న్యూఢిల్లీ: ఆదాయపన్ను చెల్లిస్తున్న వాళ్లకు ఓ శుభవార్త. ఐటీ రిటర్న్స్ ప్రక్రియను 24 గంటల్లోనే ముగించి, ఆ వెంటనే రీఫండ్ చేసేలా రెవెన్యూ శాఖ కసరత్తు ప్రారంభించింది. రెండేళ్లలోపే దీనిని అమలు చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ)లోని ఐటీ విభాగాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.4200 కోట్లు మంజూరు చేసింది. దీనివల్ల రిటర్న్స్, రీఫండ్స్, స్క్రూటినీ, వెరిఫికేషన్ వేగంగా పూర్తి చేసే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం రీఫండ్స్ ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే పూర్తి చేస్తున్నట్లు రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే చెప్పారు. ఈ ఏడాది ఇలా రూ.1.5 లక్షల కోట్ల రీఫండ్స్‌ను నేరుగా బ్యాంకు అకౌంట్లలో వేసినట్లు తెలిపారు. ఇప్పుడీ వ్యవస్థను మరింత మెరుగుపరచి 24 గంటల్లోనే రీఫండ్స్ ఇచ్చేలా చేస్తున్నామని ఆయన వెల్లడించారు. సాధ్యమైనంత త్వరలో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని పాండే తెలిపారు. మొన్న బడ్జెట్ సందర్భంగానే ఇన్కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆన్‌లైన్‌లో పని చేస్తున్నదని ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ వెల్లడించిన విషయం తెలిసిందే.

కిడ్నాప్ చేసి తీసుకొచ్చారు!



న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేసిన కార్పొరేట్ లాబీయిస్ట్ దీపక్ తల్వార్ ఢిల్లీ హైకోర్టు ముందు సంచలన ఆరోపణలు చేశాడు. తనను దుబాయ్ అప్పగించలేదని, కిడ్నాప్ చేసి ఇండియాకు తీసుకొచ్చారని కోర్టుకు తెలిపాడు. దీనిపై కోర్టు ఈడీ వివరణ కోరింది. పోయిన గురువారం దుబాయ్ నుంచి అతన్ని ఇండియాకు తీసుకొచ్చిన అధికారులు ఈడీకి అప్పగించిన విషయం తెలిసిందే. అయితే తనను అక్రమంగా ఇక్కడికి తీసుకొచ్చారంటూ అతడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహత్గి అతని తరపున వాదిస్తున్నాడు. తనక్లయింట్‌ను కిడ్నాప్ చేసి ఇండియాకు తీసుకొచ్చారని ఆయన కోర్టుకు తెలిపారు. సరైన ప్రక్రియను పాటించలేదని రోహత్గి స్పష్టం చేశారు.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద వచ్చిన విదేశీ నిధులు రూ.90 కోట్లను దుర్వినియోగం చేసిన కేసులో దీపక్ తల్వార్‌ను ఈడీ, సీబీఐ అరెస్ట్ చేశాయి. అతనిపై నేరపూరిత కుట్ర, ఫోర్జరీ, ఎఫ్సీఆర్ఏ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అంబులెన్సులు, ఇతర ఆరోగ్య సామాగ్రి కోసం తన ఎన్జీవోకు వచ్చిన రూ.90.72 కోట్ల నిధులను దారి మళ్లించాడని దీపక్ తల్వార్‌పైఆరోపణలు ఉన్నాయి. గత వారమే అతన్ని ఇండియాకు తీసుకొచ్చారు. అతనితోపాటు యూఏఈ అప్పగించిన ఆగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ కుంభకోణం నిందితుడు రాజీవ్ సక్సేనాను కూడా ఒకే విమానంలో ఇండియాకు తరలించడం విశేషం.

ఏయిర్‌క్రాఫ్ట్ క్రాష్ పైలెట్‌కు గాయాలు



పూణే: ట్రైనింగ్ ఏయిర్‌క్రాఫ్ట్ ఒకటి కూలి పైలెట్ గాయపడ్డ సంఘటన పూణేలో మంగళవారం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో పైలెట్ సిద్ధార్థ టైటెస్ కుడి చేతి భుజం ఎముకకు గాయాలయ్యాయని పేర్కొన్నారు. ఇంద్రాపూర్ తాలూకా రూయి గ్రామంలో ఏయిర్‌క్రాఫ్ట్ కుప్పకూలింది. ప్రమాదానికి క్రాష్ ల్యాండింగ్ కారణమని భావిస్తున్నారు. విమానం బారాబతి కార్వర్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినది. పైలెట్ సిద్ధార్థ మూడు సంవత్సరాల నుంచి 130 గంటలు ఏయిర్‌క్రాఫ్ట్ నడిపన అనుభవం ఉందని పోలీసులు తెలిపారు. విమానం పంట పొలాల్లో కూలడంతో పెను ప్రమాదమే తప్పిందన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రియాంకగాంధీ పొలిటికల్ ఎంట్రీకి సిద్ధం

- నేమ్‌ప్లేట్ బోర్డు ఏర్పాటు
- కొత్తశోభను సంతరించుకున్న పార్టీ కార్యాలయం
- రాహుల్‌తో భేటీ



ఢిల్లీ: ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం మంగళవారం కొత్త శోభ సంతరించకుంది. పార్టీ ఆఫీసులో ఓ గదిని సరికొత్తగా ముస్తాబు చేశారు. అందంగా అలంకరించి.. గది ముందు పూలకుండీలు ఉంచారు. ఇటీవలే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ప్రియాంక గాంధీ త్వరలోనే కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ హెడ్ క్వార్టర్స్‌లో ఆమెకు ప్రత్యేక గదిని కేటాయించారు. సోదరుడు రాహుల్ గాంధీ కార్యాలయం పక్కనే ఆమె ఆఫీసును ఏర్పాటుచేశారు. మంగళవారం గది బయట గోడకు ప్రియాంక గాంధీ నేమ్ ప్లేట్ కూడా తగిలించారు. ఈ నేపథ్యంలో ప్రియాంక గాంధీ తుగ్లక్ రోడ్డులో ఉన్న రాహుల్ గాంధీ నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. ఆమెను కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించిన తర్వాత రాహుల్‌ను కలవడం ఇదే తొలిసారి. ప్రియాంకతో పాటు జ్యోతరాధిత్య సింధియా కూడా సమావేశంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆఫీసులో ఆఫీసు సిద్ధమవడంతో త్వరలోనే ఆమె ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. విదేశీ పర్యటన పూర్తిచేసుకున్న ప్రియాంక గాంధీ.. సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. తుగ్లక్ రోడ్డులో ఉన్న రాహుల్ గాంధీ నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. ఆమెను కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించిన తర్వాత రాహుల్ని కలవడం ఇదే తొలిసారి. ప్రియాంక గాంధీని తూర్పు యూపీ జనరల్ సెక్రటరీగా, సింధియాను వెస్ట్ యూపీ జనరల్ సెక్రటరీగా నియమించిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. భేటీలో మిషన్ యూపీపైనే ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.

సీబీఐ, మమతనే మాట్లాడగలరు: నితీష్‌కుమార్



బీహార్: శారదా స్కామ్ వివాదం కోర్టులో ఉండగా తాము మాట్లాడడం ఉచితం కాదని, చిన్న చిన్న ఆపదలకు కూడా కాంగ్రెస్ రాష్ట్రపతి పాలన విధించేదని, 2005లో కాంగ్రెస్ పార్టీ బీహార్‌లో రాష్ట్రపతి పాలన విధించిందని, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దీక్ష, కేంద్ర సీబీఐ వర్గాల దర్యాప్తు విషయంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అన్నారు. మనది రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ, కోర్టులపై గౌరవం, ఓ మంచి పరంపరను కొనసాగిస్తున్నామన్నారు. ఈ విషయంపై వారిద్దరే (సీబీఐ, మమతా బెనర్జీ) మాట్లాడగలరని అన్నారు. ర్యాలీలు ఎవ్వరైనా ఎక్కడైనా చేపట్టవచ్చని అన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ మరిన్ని వివాదాలు కనిపిస్తాయన్నారు. ఎన్నికల కమిషన్ ఎలక్షన్ తేదీ ప్రకటించే వరకూ ఒక నెలరోజుల్లో ఏదైనా జరగొచ్చన్నారు. ర్యాలీల ద్వారా బీహార్‌పై విమర్శలు చేస్తున్న వారు ఒక విషయం తెలుసుకోవాలని బీహార్ గ్రోత్ రేట్ 11.3శాతంతో దూసుకుపోతుందన్నారు. గత 13 సంవత్సరాల్లో బీహార్‌లో విద్య, వైద్యం, పవర్ తదితర రంగాల్లో అభివృద్ధి జరిగిందని నితీష్ అన్నారు.

మరోమారు పెరగనున్న కేబుల్ బిల్లు!



ఢిల్లీ: వినియోగదారులు వారికి నచ్చిన టీవీ ఛానెళ్లు మాత్రమే చూసే అవకాశం కల్పిస్తూ.. ట్రాయ్ తీసుకువచ్చిన కొత్త నిబంధనలతో కేబుల్ టీవీ వినియోగదారులపై భారం మరింత పెరగనుంది. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ మార్గదర్శకాల వల్ల ఎక్కువ ప్రజాదరణ కలిగిన ఛానెళ్లకు ఎక్కువ ప్రయోజనం చేకూరనుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ వెల్లడించింది. కొత్త విధానం వల్ల ప్రసార సంస్థలు, పంపిణీ దారులకు ఎక్కువ లాభం చేకూరనుందని తన నివేదికలో స్పష్టం చేసింది. తాజా నిబంధనల ప్రకారం.. వినియోగదారుల నెలవారీ బిల్లు రూ.230–240 నుంచి 25 శాతం పెరిగి రూ.300లకు చేరే అవకాశం ఉంది. అయితే టాప్5 ఛానెళ్లను ఎంచుకున్న వినియోగదారులకు మాత్రం ఆ మొత్తం కాస్త తగ్గనుందని క్రిసిల్ సీనియర్ డైరెక్టర్ సచిన్ గుప్తా వెల్లడించారు.

ట్రాయ్ తీసుకొచ్చిన ఈ నిబంధనల వల్ల ప్రసార సంస్థల ఆదాయం 40 శాతం పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల పాపులర్ ఛానెళ్ల ఆదాయానికి లోటేమి లేకపోయినా.. పాపులారిటీ తక్కువగా ఉన్న ఛానెళ్ల పరిస్థితి మాత్రం దారుణంగా ఉండనుందని.. టీవీల్లో ఆ ఛానెళ్లు ప్రసారం కాకపోవచ్చని కూడా సచిన్ వెల్లడించారు. పంపిణీ దారులు, డీటీహెచ్, కేబుల్ ఆపరేటర్లు మాత్రం ట్రాయ్ తీసుకువచ్చిన నిబంధనల వల్ల ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు.

సబ్‌స్క్రిప్షన్ బిల్లులు పెరిగిపోవడం, డేటా టారిఫ్‌లు తక్కువగా ఉండటం వల్ల ప్రజలు ఎక్కువగా డేటా ఆధారిత సేవలవైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం పంపిణీదారుడు వసూలు చేసే కనీస ధర రూ.130 ఉండగా.. అత్యంత ప్రజాదరణ ఉన్న ఛానెళ్లకు ప్రసార సంస్థలు అత్యధికంగా రూ.19 వరకు వసూలు చేస్తున్నాయి. అయితే రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని క్రిసిల్ తన నివేదికలో వెల్లడించింది.

కుప్పకూలిన ఎస్పీ ఎమ్మెల్యే



లక్నో: సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే సుభాష్ పసి (50)బ్రెయిన్ హేమరేజ్ (మెదడులో రక్తస్రావం)తో కుప్పకూలిపోయారు. ఉత్తరప్రదేశ్ యోగిఆదిత్యానాథ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్పీ, బీఎస్పీ ఎమ్మెల్యేలు, నేతలు ఆందోళన నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో అప్రమత్తమైన నేతలు ఎమ్మెల్యే సుభాష్ పసిని వెంటనే శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆస్పత్రికి తరలించారు. ఆయన్ను పరీక్షించిన వైద్యులు వెంటనే లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ సెంటర్లోని ట్రామా కేంద్రానికి పంపించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే సుభాష్ ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వైద్యులు ఆయనకు చికిత్స కొనసాగిస్తున్నారు. గొప్ప దళితనేతగా ఎదిగిన సుభాష్ పసి ఘాజిపూర్ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఫ్యాన్సీ నెంబర్ కోసం రూ.31 లక్షలు!



తిరువనంతపురం: వాహనాల కొనుగులకంటే కూడా వాటికి కేటాయించే నంబర్ల మీద చాలా ఎక్కువ ఖర్చు చేస్తారు జనాలు. ఫ్యాన్సీ నంబర్ కోసం ఓ బిజినేస్ మ్యాన్ ఏకంగా రూ.31 లక్షలు ఖర్చు చేశాడు. వివరాలు.. కేరళకు చెందిన వ్యాపారవేత్త బాలగోపాల్... తాను ఎంతో ముచ్చటపడి కొనుకున్న కోటి రూపాయల ఖరీదైన పోర్ష్ కారు కోసం ఫ్యాన్సీ నంబర్‌ను వేలంలో కొనుగోలు చేశారు. వేలం పాటలో రూ. 31 లక్షలు పెట్టి తాను కోరుకున్న కేఎల్ 01 సీకే 1 నంబర్‌ను సొంతం చేసుకున్నారు. ఈ ఫ్యాన్సీ నంబర్ కోసం బాలగోపాల్‌తో పాటు మరో ఇద్దరు పోటీ పడ్డారు. దుబాయ్‌కు చెందిన వ్యక్తి వేలంలో రూ. 10 లక్షల వరకు కోట్ చేశారు. ఆ తరువాత అతను వేలం నుంచి డ్రాప్ అయ్యారు. అయితే మరో వ్యక్తి మాత్రం ఈ నంబర్ కోసం రూ. 25.50 లక్షల వరకు కోట్ చేశారు. కానీ బాలగోపాల్ ఏకంగా రూ. 31 లక్షలు చెప్పడంతో... అతను కూడా వేలం పాటు నుంచి తప్పుకున్నారు. దీంతో అత్యధిక రేటు కోట్ చేసిన వ్యాపారవేత్త బాలగోపాల్.. కేఎల్ 01 సీకే 1 నంబర్‌ను సొంతం చేసుకున్నారు. రెండేళ్ల క్రితం తాను ఎంతో ముచ్చటపడి కొనుక్కున్న టయోటా ల్యాండ్ క్రూయిజర్ కోసం కేఎల్ 01 సీబీ 01 నంబర్‌ను వేలం పాటలో రూ. 19 లక్షలకు కొనుగోలు చేశారు బాలగోపాల్. ఓ ఫ్యాన్సీ నంబర్‌కు ఈ స్థాయిలో ధర పలకడం కేరళతో పాటు దక్షిణాదిలో కూడా ఇదే మొదటిసారి అని తెలిపారు రవాణాశాఖ అధికారులు.

మరో వందేళ్లలో హిమాలయాల్లో మంచు మాయం!



ఢిల్లీ: హిందూకుష్ పర్వత శ్రేణుల్లో మూడవ వంతు గ్లేసియర్లు కరిగిపోనున్నాయి. 2100 సంవత్సరంలోగా ఈ పర్వతాల్లోని మంచుకొండలు అడుగంటిపోతాయని ఓ సర్వే హెచ్చరించింది. గ్లోబల్ వార్మింగ్‌ను ఈ శతాబ్ధంలోపు 1.5 సెంటీగ్రేడ్ల వరకు కట్టడి చేసినా.. హిందూకుష్ పర్వతాల్లోని మంచు మూడో వంతు కరుగుతుందని ఖాట్మాండుకు చెందిన ఐసీఐఎంవోడీ సంస్థ తన నివేదికలో తెలిపింది. హిమాలయాలతో పాటు కరక్కోణం ప్రాంతాల్లో సగటున 0.7 శాతం ఉష్ణోగ్రతలు పెరుగుతాయని సర్వే వెల్లడించింది. టిబెట్ పీఠభూమితో పాటు మధ్యశ్రేణి హిమాలయాలు, కరక్కోణం ప్రాంతాలు హిందుకుష్ కన్నా ఎక్కవ వేడెక్కనున్నాయి. సుమారు 350 పరిశోధకులు, నిపుణులు, విధానకర్తలు హిందూకుష్ ముసాయిదాను తయారు చేశారు. మరో వందేళ్లలో హిందూకుష్‌లో మంచు కరిగిపోయి, కేవలం కొండప్రాంతంగా మారుతుందని ఆ రిపోర్టు తెలిపారు. మొత్తం 8 దేశాల్లో హిందుకుష్ పర్వతాలు ఉన్నాయి. సుమారు 3500 కిలోమీటర్లు వ్యాపించి ఉంటాయి. ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, చైనా, ఇండియా, మయన్మార్, నేపాల్, పాక్లో ఉన్నాయి. గంగా, బ్రహ్మపుత్ర, ఇండస్తో పాటు మరికొన్ని ముఖ్యనదులు హిందూకుష్ నుంచే ఉద్భవిస్తాయి. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న కారణంగానే హిమాలయాలు వేడెక్కుతున్నట్లు సర్వే వెల్లడించింది. మంచు కొండలు కరగడం వల్ల సుమారు 2050 వరకు గంగా, బ్రహ్మపుత నదులు విపరీతంగా ప్రవహించే అవకాశాలున్నాయన్నారు. వాయుకాలుష్యం వల్ల కూడా ఈ సమస్య ఎక్కువకానున్నది.


టీఎంసీతో సంప్రదింపులు లేవు: నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: గత ఏడాదిగా బీజేడీ, తృణమూల్ కాంగ్రెస్‌ల మధ్య గత సంవత్సర కాలంగా ఎలాంటి సంప్రదింపులూ లేవని ఒడిషా సీఎం, బీజేడీ చీఫ్ నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో రాజకీయంగా కలిసి నడవాలని తాను భావించడం లేదన్నారు. సీబీఐ వ్యవహార శైలిపై తాము ఒడిషాలో చోటుచేసుకున్న ఘటనల ఆధారంగానే వ్యాఖ్యలు చేశామని, సీబీఐ వృత్తిపరమైన విధులు నిర్వహించాలని, రాజకీయేతరంగా వ్యవహరించాలని వ్యాఖ్యానించామని ఆయన చెప్పుకొచ్చారు. సీబీఐ తీరుపై తమ వైఖరిని తృణమూల్‌తో, మరో ఇతర రాజకీయ పార్టీతో ముడిపెట్టరాదని బీజేడీ పేర్కొంది.

కాగా బీజేడీ ప్రకటనను ఒడిషాలో సీబీఐ పాత్ర పరిధిలో చూడాలని బీజేపీ వ్యాఖ్యానించడం గమనార్హం. సీబీఐ వ్యవహారంపై బీజేడీ చేసిన ప్రకటన నేపథ్యంలో తమ పార్టీని తృణమూల్ సహా ఇతర పార్టీలకు వత్తాసు పలికినట్టుగా చూడటం వాస్తవవిరుద్ధమని, తప్పుదారిపట్టించడమేనని బీజేడీ ఓ ప్రకటనలో వివరణ ఇచ్చింది.

ఓట్ల కోసమే కేంద్ర బడ్జెట్: కమల్



చెన్నై: తాత్కాలిక బడ్జెట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా మధ్య తరగతి ప్రజలు, రైతులు పొందే సాయం చాలా తక్కువని మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు కమల్‌హాసన్ విమర్శించారు. ట్విటర్ ద్వారా ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ చూడటానికి ఎంతో ఆకర్షణీయ పథకాలుగా, మేలు చేసేవిగా కనిపిస్తున్నప్పటికీ రోజుకు ఓ లబ్ధిదారుడికి అందే మొత్తం పిసరంతేనని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉన్న లోపాల్ని ఆర్థిక నిపుణులు సులభంగా గుర్తించగలుగుతారని, సామాన్యులకు ఆ విషయాలేవీ అర్థం కాదు కాబట్టే గొప్పమేలు చేసినట్లుగా చెప్పుకొంటున్నారన్నారు. ఇప్పుడు ఇస్తున్న సహాయం మొత్తం ఓట్లను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నదేనని ఆరోపించారు. తమ ప్రభుత్వమే అధికారంలో కొనసాగుతుందనే ఉద్దేశంతో ఈ పథకాల్ని తీసుకొచ్చారని, కొత్తగా మరో ప్రభుత్వం ఏర్పాటైతే వాటిని ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించారు. అంతిమంగా ఈ బడ్జెట్ను తమకు తాము లబ్ధిపొందేందుకే అధికారంలో ఉన్న ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. మిగతా ఏ కీలక విషయంపైనా బడ్జెట్‌లో దృష్టిసారించలేదని, ముఖ్యంగా తమిళనాడుకు సంబంధించిన అంశాలేవీ లేవని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం సవతితల్లి ప్రేమ చూపిస్తోందనడానికి ఈ బడ్జెట్టే నిదర్శనమని కమల్‌హాసన్ పేర్కొన్నారు.

దీదీకి విచారణపై భయమెందుకు?

మమతపై విరుచుకుపడ్డ ఆదిత్యనాథ్



కోల్‌కత్తా: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ లక్ష్యంగా యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ విమర్శలతో విరుచుకుపడ్డారు. సీబీఐ ఉదంతం నేపథ్యంలో మమతా బెనర్జీ ధర్నా చేపట్టడాన్ని ఆయన ఆక్షేపించారు. ముఖ్యమంత్రే ధర్నాకు దిగడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని అభ్యంతరం వ్యక్తం చేశారు. పురూలియాలో మంగళవారం ప్రచార ర్యాలీలో పాల్గొన్న యోగి మమతా దీక్షను ఎద్దేవా చేశారు.

అవినీతిపై విచారణకు ఆమె అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. కాగా పురూలియా ర్యాలీకి హాజరయ్యేందుకు యోగి హెలికాప్టర్కు అధికారులు అనుమతి నిరాకరించడంతో లక్నో నుంచి జార్ఖండ్లోని బొకారోకు చాపర్లో వచ్చిన యోగి అక్కడి నుంచి 50 కిమీ దూరంలోని పురూలియాకు రోడ్డు మార్గంలో చేరుకున్నారు. మరోవైపు బీజేపీ చీఫ్ అమిత్ షా సహ పలువురు కేంద్ర మంత్రుల ర్యాలీలకు సైతం ఇటీవల బెంగాల్ ప్రభుత్వం అనుమతులు నిరాకరించిన సంగతి తెలిసిందే. ఇక కోల్కతా పోలీస్ కమిషనర్ నివాసంపై సీబీఐ అధికారుల దాడులకు నిరసనగా మమతా బెనర్జీ చేపట్టిన దీక్ష మూడవ రోజుకు చేరుకుంది.

శబరిమలకి మరోసారి వెళతాం

సుప్రీంకోర్టు తలుపు తట్టిన బిందు, కనకదుర్గలు



ఢిల్లీ: శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలు బిందు, కనకదుర్గలు మరోసారి సుప్రీంకోర్టు తలుపుతట్టారు. శబరిమల తీర్పు విషయంలో వేసిన రివ్యూ పిటిషన్లలో తమను వ్యాజ్యదారులుగా చేర్చుకోమని వాళ్లు కోరారు. అలాగే శబరిమల ఆలయ తలుపులు మరోసారి తెరిచిన సమయంలో తాము వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వాళ్లిద్దరూ ఈ పిటిషన్ వేశారు. దీనికి సంబంధించి సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది.

శబరిమల ఆలయంలోకి ప్రవేశించినందుకు తమకు బెదిరింపులు వస్తున్నాయని, ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ ఇటీవల ఆ ఇద్దరు మహిళలు గత నెల సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం బిందు, కనకదుర్గలకు 24/7 రక్షణ కల్పించాలంటూ కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించింది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలు ప్రవేశించవచ్చని గత ఏడాది సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలోనే జనవరి 2వ తేదీన బిందు, కనకదుర్గలు ఆలయంలోకి వెళ్లారు. దీంతో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. ఆలయంలోకి వెళ్లిన అనంతరం వారిద్దరూ కొన్ని రోజుల పాటు అజ్ఞాత ప్రదేశంలో తలదాచుకున్నారు. జనవరి 15న కనకదుర్గ తన ఇంటికి వెళ్లగా.. ఆమె అత్త కనకదుర్గపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే బిందు, కనకదుర్గలు తమకు రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా ఇప్పటికే శబరిమల వివాదంపై పలు ఆందోళనలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో సుప్రీం తీర్పు ఎలా ఉండనుందో అనే ఆందోళన పలువురిలో టెన్షన్‌లో రేపుతోంది.

జనాన్ని పరుగు పెట్టించిన బాలుడు

బీజింగ్: చైనా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ రోజున ఓ బుడతడు చేసిన పని ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. చిఫెంగ్కు చెందిన ఓ బాలుడు రెండు చేతుల్లో రెండు మండుతున్న కాకరపుల్లలు పట్టుకుని నడుస్తూ కనిపించాడు. అలా నడుచుకుంటూ వెళ్లి రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్హోల్ రంధ్రంలో ఓ దానిని జారవిడిచాడు. ఆ వెంటనే అందులోంచి తారాజువ్వల్లా మంటలు పైకి లేవడంతో భయంతో బాలుడు పరుగులు తీశాడు. ఆ తర్వాత క్షణకాలంలోనే మ్యాన్హోల్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఇటుకలు అంతెత్తున పైకి లేచాయి. ఆ ప్రాంతం మొత్తం పొగ కమ్మేసింది. అయితే, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ మొత్తం ఘటనను అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరా రికార్డు చేసింది. ఈ వీడియోను ఫేస్బుక్లో షేర్ చేయడంతో వైరల్ అయింది. ఇప్పటికే దీనిని లక్షలాది మంది చూశారు. మ్యాన్హోల్ పేలుడుకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తెలుగు విద్యార్థుల ట్రయల్ షురూ



విజయక్రాంతి, హైదరాబాదు: యూఎస్ మిషిగన్ ఫెడరల్ కోర్టులో డిటెన్షన్లో ఉన్న 8 మంది తెలుగు విద్యార్థుల ట్రయల్(విచారణ) ప్రారంభమైంది. థియోడోర్ లివిన్ యునైటెడ్ స్టేట్స్ మిషిగన్ ఫెడరల్ కోర్ట్ హౌజ్ లో(మిషిగన్ ఫెడరల్ కోర్టు) ఫార్మింగ్టన్ యూనివర్శిటీ విద్యార్థుల ట్రయల్ చేపట్టారు. ఆ 8 మంది తెలుగు విద్యార్థుల తరపున అటార్నీని అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ (ఆట తెలంగాణ) ఏర్పాటు చేసింది. అటార్నీ ఎడ్వర్డ్ బజూకా మొదటి రోజు వాదనలు వినిపించారు. అనంతరం ఈ ట్రయల్ వివరాలను అటార్నీ ఎడ్వర్డ్ బజూకా వెల్లడించినట్టు అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధి వెంకట్ మంతెన తెలియజేశారు. 8 మంది తెలుగు విద్యార్థుల తరపున వేము వాదిస్తున్నాం. ఇవాళ ట్రయల్ ప్రారంభమయ్యింది. వీలైనంత తొందరగా విద్యార్థుల విడుదలయ్యేలా ప్రయత్నిస్తున్నాం. ట్రయల్ పూర్తయ్యేంత వరకు తెలుగు విద్యార్థులను ఫెడరల్ కటస్టడీలోనే ఉంచాలని వాదిస్తున్నాం. ఆ మేరకు జడ్జీని కోరాం. లేదంటే వారు బేయిల్ పై విడుదలైతే యూఎస్ ఐస్(US ICEunited states immigration and customs enfoce) అరెస్ట్ చేసే అవాకాశం ఉంది. అదే జరిగితే వారి యూఎస్ ఐస్ వద్ద కస్టడీ శిక్షలో పరిగణించ బడదు.

అదే ఫెడరల్ కస్టడీలో ఉంటే రేపు శిక్ష పడ్డాక ఫెడరల్ కస్టడీలో ఉన్న రోజులకు శిక్షకాలం నుంచి మినహాయింపు వస్తుంది.అది ICE అరెస్ట్ చేస్తే సాధ్యపడదు. అందుకే తెలుగు విద్యార్థులను ఫెడరల్ కస్టడీకి కోరుతున్నాం.కొంత సానుకూల నిర్ణయం వచ్చే అవకాశం ఉంది.ఇక డి3(డిఫెండెంట్) గా ఉన్న విద్యార్థి ఫణీంద్ర కర్ణాటికి బెయిల్ వచ్చింది.కానీ అతన్ని ఐస్ అదుపులోకి తీసుకోలేదు ఎందుకుంటే అతను H1 వీసా కలిగి ఉన్నాడు. ప్రభుత్వం విద్యార్థుల అరెస్టు సమయంలో సీజ్ చేసిన చాలా ఫైల్స్, ఫోన్ కాల్ లిస్ట్ , డేటా సేకరించింది. ఆ డేటా మాకు వచ్చింది. ఆ డేటా చాలా పెద్ద మొత్తంలో ఉంది, వాటిని పరిశీలించేందుకు చాలా సమయం పడుతుంది. విచారణలో చాలా కాన్ఫిడెన్షియల్ విషయాలు ఉన్నాయి. వాటిని చెప్పలేం. తదుపరి విచారణ ఎప్పుడు ఉండేది కూడా న్యాయమూర్తి నిర్ణయం మేరకే ఉంటుంది. అది ఇప్పుడే చెప్పలేం..కానీ వచ్చే వారం ఉండొచ్చు.

తప్పు చేస్తున్నామని..

ఆ విద్యార్థులకు ముందే తెలుసు: అమెరికా



ఢిల్లీ: అమెరికాలో భారత విద్యార్థుల అరెస్టుపై ప్రభుత్వం ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయానికి అభ్యంతర పత్రం(డెమార్ష్) జారీ చేయడంపై అక్కడి ప్రభుత్వం స్పందించింది. భారత విద్యార్థులకు తప్పు చేస్తున్నామన్న విషయం ముందే తెలుసని చెప్పుకొచ్చింది. "ఈ విషయంలో అరెస్టయిన విద్యార్థులందరికీ తప్పు చేస్తున్నామన్న విషయం ముందే తెలుసు. ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయంలో బోధనా వ్యవస్థ లేదన్న విషయం కూడా వారికి తెలుసు. అక్రమంగా అమెరికాలో ఉండాలనే ఉద్దేశంతోనే వారు అలా చేశారు" అని అమెరికాకు చెందిన ఓ అధికార ప్రతినిధి ఆరోపిస్తున్నారు.

అయితే ఈ అంశంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న భారత ప్రభుత్వం.. పరిస్థితులను చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా విద్యార్థులను కలవడానికి భారత దౌత్య అధికారులను అనుమతించాలని కోరింది. దళారులను, విద్యార్థులను ఒకేలాగా చూడొద్దని విజ్ఞప్తి చేసింది.వీలైనంత త్వరగా వారిని విడుదల చేయాలని కోరింది. విద్యార్థులను బలవంతంగా అక్కడి నుంచి పంపొద్దని తెలిపింది. అలాగే భారత రాయబార కార్యాలయంలో 24గంటల హెల్ప్లైన్ ఏర్పాటు చేశారు. అలాగే ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయం నకిలీదని భారత విద్యార్థులకు తెలియదని ఇమ్మిగ్రేషన్ అధికారులు ఇప్పటికే అమెరికా ప్రభుత్వానికి వివరించారు. విద్యార్థి వీసా కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తున్నవారిని పట్టుకోవాలని భావించిన అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ ఎన్ఫోర్స్మెంటు అధికారులు ఓ నకిలీ విశ్వవిద్యాలయాన్ని సృష్టించారు. అందులో భాగంగా 8 మంది దళారులను, వారి ద్వారా చేరిన 130 మంది విద్యార్థులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే ఫార్మింగ్టన్ వర్సిటీ మాత్రం జాతీయ గుర్తింపు ఉందని, ఆన్లైన్ తరగతులు కూడా అందుబాటులో ఉన్నాయని ప్రకటించుకోవడం గమనార్హం. ఒకసారి వారు తిరిగొస్తే మళ్లీ వీసా లభించడం అసాధ్యమని నిపుణుల అంటున్నారు. దీంతో ఉన్నత చదువుల కోసం వెళ్లిన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సోమాలియాలో ఉగ్రదాడి

తొమ్మిది మంది మృతి

సోమాలియా: సోమాలియా రాజధాని మొగాడిషు బాంబుల మోతతో దద్దరిల్లింది. బాంబు దాడితో ఉగ్రవాదులు మారణహోమం సృష్టించారు. ఓ ప్రభుత్వ కార్యాలయం ఎదుట కారులో బాంబులు నింపి పేల్చివేశారు. ఈ ఉగ్రదాడి ఘటనలో తొమ్మిది మంది పౌరులు చనిపోయారు. మరో 20 మందికి పైగా గాయాలయ్యాయి. దాడికి పాల్పడింది తామేనని అల్ షబాబ్ ఉగ్ర సంస్థ ప్రకటించింది.

ప్యాంట్ విప్పాల్సిందే..!

న్యూయార్క్సిటీ: ప్రపంచంలో కొన్ని వింతలు అబ్బురపరుస్తుంటాయి. నో ప్యాంట్స్ సబ్వే రైడ్ కూడా అలాంటిదే. 'నో ప్యాంట్స్ నో ప్రాబ్లమ్' పేరుతో ప్రతీ ఏడాది జరిగే ఈ ఈవెంట్లో ప్రజలు ప్యాంట్లు లేకుండానే చక్కర్లు కొడతారు. ఈసారి న్యూయార్క్లో జరిగిన నో ప్యాంట్స్ సబ్వే రైడ్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.





వరదలతో రోడ్లపైకి మొసళ్లు, పాములు

- ఆస్ట్రేలియన్లకు కొత్త కష్టాలు


ఆస్ట్రేలియా: ఆస్ట్రేలియాలో వరదలు ఏ రేంజ్లో వచ్చాయో వారం నుంచీ చూస్తూనే ఉన్నాం. ఆ వరద నీటిలో ఈదుకుంటూ... పాములు, మొసళ్లు చుట్టుపక్కల ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. రోడ్లపైనా, ఇళ్ల దగ్గర, చెట్లపైనా, సెల్లార్లలో... ఇలా ఎక్కడ చూసినా మొసలో, పామో కనిపిస్తున్నాయి. వాటిని చూసి పై ప్రాణాలు పైనే పోతున్నాయి.

వారం నుంచీ ఈశాన్య ఆస్ట్రేలియాలోని క్వీన్స్లాండ్ను వరదలు ముంచేస్తున్నాయి. ఆల్రెడీ చాలా మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. అలా వెళ్లిన వాళ్లంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఐతే... క్వీన్స్లాండ్ తీరంలో ఉండే మొసళ్లు, పాములు కూడా వరదలకు కొట్టుకొచ్చేస్తున్నాయి. ఎటు వెళ్లాలో తెలియక... వరద నీరు ఎటు తీసుకెళ్తే అటు వెళ్తున్నాయి. చివరకు ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లోకి వెళ్లి... అక్కడ తిరుగుతున్నాయి. ఎప్పుడు, ఎక్కడ ఏ మొసలి కనిపిస్తుందోనని హడలిపోతున్నారు జనం.

గూగుల్ ట్రాన్స్లేట్లో ఐ లవ్ యూ..

హైదరాబాదు: గూగుల్ ట్రాన్స్లేట్ గూగుల్ అందించే సర్వీసుల్లో ఇది ఒకటి. ఇప్పటివరకు గూగుల్ ట్రాన్స్లేట్ ఉపయోగించని వాళ్లుండరు. రోజూ సుమారు 100 బిలియన్ అంటే 10 వేల కోట్ల పదాలను గూగుల్ ట్రాన్స్లేట్ చేస్తోందట. ఈ విషయాన్ని స్వయంగా గూగుల్ ప్రకటించడం విశేషం. #GoogleTranslate పేరుతో ఓ యాడ్ క్రియేట్ చేసి రిలీజ్ చేసింది. రోజూ 10 వేల కోట్ల పదాలను ట్రాన్స్లేట్ చేయడం అంటే మామూలు విషయం కాదు. 100 బిలియన్ పదాల పేరుతో యూట్యూబ్, ట్విట్టర్లో ఈ యాడ్ పోస్ట్ చేసింది గూగుల్. పలు దేశాలకు చెందిన ప్రజలు గూగుల్ ట్రాన్స్లేట్ను ఎలా ఉపయోగిస్తున్నారో చూపించింది. మరి రోజూ గూగుల్ ట్రాన్స్లేట్లో ఎక్కువగా టైప్ చేస్తున్న పదాలు ఏంటో తెలుసా? How are you?, I love you, Thank you. అవును... యూజర్లు ఎక్కువగా ఈ వాక్యాలనే గూగుల్ ట్రాన్స్లేట్ అనువదిస్తున్నారట. ఈ విషయాన్ని గూగులే చెప్పింది. వీటి అర్థాలను వేర్వేరు భాషల్లో తెలుసుకునేందుకు యూజర్లు గూగుల్ ట్రాన్స్ లేట్ను ఆశ్రయిస్తున్నారన్నమాట.

నేపాల్ రాయబారిగా నీలాంబర్ ఆచార్య



ఖాట్మండు: నేపాల్ మాజీ న్యాయశాఖ మంత్రి నీలాంబర్ ఆచార్య భారత్లో ఆ దేశ రాయ బారిగా నియమితులయ్యారు. సుమారు ఏడాదిన్నరగా భారత్లో నేపాల్ రాయబారిని నియ మించలేదు. రాయబారిగా ఉన్న దీప్కుమార్ ఉపాధ్యాయ రాజీనామా చేసి రాజకీయాల్లోకి వెళ్లడంతో స్థానం ఖాళీ అయింది. ఆదివారం ఖాట్మండ్లో రాష్ట్రపతి బిద్యాదేవి భండారి నీలాంబర్ ఆచార్యతో ప్రమాణం చేయించారు. భారత్లో రాయబారిగా నియమితులవ్వడంపై ఆచార్యకు అభినందనలు తెలిపారు. గతంలో రాయబారిగా నియమితులైన వారితో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణం చేయించేవారు. ఆచార్య మాస్కో వర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. మొదట్లో వామపక్ష భావజాలంతో ఉన్నా తర్వాత నేపాలీ కాంగ్రెస్లో చేరారు. 1990లో తాత్కాలిక ప్రభుత్వంలో న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాలు, సామాజిక సంక్షేమ శాఖల మంత్రిగా పనిచేశారు.

కాలిఫోర్నియాలో కూలిన విమానం – ఐదుగురి మృతి

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియా స్టేట్లో విమాన ప్రమాదం జరిగింది. ఓ చిన్న విమానం అదుపుతప్పి ఇళ్లపై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఐదుగురు చనిపోయారు.

లాస్ఏంజెలెస్ శివారులోని యోబ్రా లిండాలో ఈ ప్రమాదం జరిగింది. క్రాష్ అయిన తర్వాత పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మీ సరదా కోసం చిన్నారిని హింసిస్తారా?

- మలేషియాలో రష్యన్ జంట అరెస్ట్



కౌలాలంపూర్: ప్రపంచ పర్యటనకై డబ్బులు సేకరించేందుకు ఓ రష్యన్ జంట తమ చిన్నారి పట్ల క్రూరంగా ప్రవర్తించింది. వీధుల్లో నాలుగు నెలల పసికందుతో విన్యాసాలు చేస్తూ తమాషా చేసింది. దీంతో ఆగ్రహించిన మలేషియా పోలీసులు సోమవారం వారిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రష్యాకు చెందిన ఓ వ్యక్తి తన భార్యతో కలిసి ప్రపంచ పర్యటన చేయాలని భావించాడు. ఇందులో భాగంగా సోమవారం కౌలాలంపూర్కు చేరుకున్నారు. ఈ క్రమంలో పర్యటన ఖర్చుల నిమిత్తం డబ్బు సేకరించేందుకు సదరు వ్యక్తి తన కూతురిని గాల్లోకి ఎగురవేస్తూ వివిధ రకాల విన్యాసాలు చేశాడు. ఆమె ఏడుస్తున్నా పట్టించుకోకుండా తలకిందులుగా వేలాడదీస్తూ తన ఆటను కొనసాగించాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న చిన్నారి తల్లి.. ' మేము ప్రపంచ పర్యటన చేస్తున్నాం' అనే ప్లకార్డు పట్టుకుని కూర్చుని ఉంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఫేస్బుక్లో పోస్ట్ చేయడంతో వైరల్గా మారింది. కాగా ఈ వీడియోపై మండిపడిన నెటిజన్లు.. 'స్టుపిడ్.. మీ సరదా కోసం చిన్నారిని ఇలా హింసిస్తారా' అంటూ కామెంట్లు చేస్తున్నారు.



యుఎస్–చైనా వాణిజ్య పోరుతో..

భారత్కు లబ్ధి: యుఎన్

జెనీవా: ప్రపంచ రెండు అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా – చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్యపోరులో లబ్ధి పొందుతున్న దేశాల్లో భారతదేశం ఒకటని ఐక్యరాజ్యసమితి తన తాజా నివేదికలో పేర్కొంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత గత సంవత్సరం మార్చిలో ఆయన తమ దేశానికి చైనా నుంచి దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యుమినియంపై పన్నులను భారీ స్థాయిలో పెంచడంతో ఈ వాణిజ్య పోరు మొదలైంది. అందుకు బదులుగా అమెరికా నుంచి దిగుమతి వస్తువులపై చైనా భారీ స్థాయిలో సుంకాన్ని విధించింది. తమ, తమ దేశాల్లో గృహోపకరణాల తయారీదారులకు ప్రయోజనం కలిగించేందుకు రెండు దేశాలు సమస్యను పరిష్కరించుకోవాల్సిన అవసరముందని సోమవారం ఐక్యరాజ్య సమితికి చెందిన నిపుణులు అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్యసమితి ట్రేడ్ అండ్ డెవలప్మెంట్ కాన్ఫరెన్స్ నివేదిక ప్రకారం... ఎగుమతులపై చైనా దాదాపు 85 బిలియన్ డాలర్ల సుంకాన్ని విధించగా వీటిలో 6 ఫర్మ్స్ మాత్రమే యుఎస్కు చెందినవి ఉన్నాయి. చైనాతో జరిగే ద్వైపాక్షిక చర్చల్లో అమెరికా ఎగుమతి చేస్తున్న 375 బిలియన్ డాలర్ల పెట్టుబడులపై చర్చించనున్నారు. ఇందుకోసం మార్చి 1వ తేదీని డెడ్లైన్గా పెట్టుకున్నారు. అమెరికా, చైనా దేశాలు దిగుమతులపై తమ టారీఫ్లు తగ్గించుకోకపోతే ప్రతి దేశం తమ ఉత్పత్తుల డ్యూటీని ప్రస్తుతం ఉన్న 10 శాతం నుంచి 25 శాతానికి పెంచాల్సి ఉంటుంది. అయితే చైనా, అమెరికా దేశాల మధ్య వాణిజ్యపోరులో ఇయు సభ్య దేశాలతో పాటు లబ్ధి పొందే దేశాల్లో భారత్ కూడా ఒకటని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. జపాన్, కెనడాల ఎగుమతులు 20 బిలియన్ అమెరికన్ డాలర్లకు ఎగబాకనున్నాయి. వీటితో పాటు ఆస్ట్రేలియా 4.6, బ్రెజిల్ 3.8, ఇండియా 3.5, ఫిలిప్పైన్స్ 3.2, వియాత్నం 5 శాతం ఎగుమతులు పెంచుకోగలుగుతాయని ఐక్యరాజ్యసమితి అధ్యయనంలో తేలింది. ఈ పరిణామాలపై యుఎన్ట్రేడ్ అండ్ డెవలప్మెంట్ స్టేట్ కోర్డెల్ హల్ , ఈ చర్యలపై మనపై మనమే తుపాకీ గురి పెట్టుకున్నట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. 1930 నాటి కాలంలో తీవ్ర నిరాశ, అతివాదం పెరిగిన పరిస్థితుల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాలన్నారు. యుఎస్, చైనాలు అవగాహనకు రాకపోతే ఆర్థిక మార్కెట్లలో నిత్యావసర వస్తువుల విషయంలో అస్థిరత నెలకొనే అవకాశముందని యుఎన్ ట్రేడ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ కో హమిల్టన్ వ్యాఖ్యానించారు.



చివరకు గాడిదలను అమ్ముకుంటూ..!

- గాడిదల సంఖ్య అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో పాకిస్తాన్ ది మూడో స్థానం..

ఇస్లామాబాద్: బేవార్స్ గా ఇంట్లో కూర్చుని, పనీ పాటా లేకుండా, తినడం, తొంగోవడం అనే కాన్సెప్ట్ తో బండిని లాగించేస్తుంటారు కొందరు బద్దకిస్టులు. అలాంటి జనాలను గాడిదలతో పోల్చుతుంటారు ఇంట్లో పెద్దవాళ్లు. చివరికి..గాడిదలు తోలడానికి కూడా పనికిరావు.. అనే ముద్రను వేయించుకుంటారు. అయినా వారు అలాంటి మాటలను లైట్ గా తీసుకుంటుంటారు. అది వేరే విషయం. అలాంటి గాడిదలు ఇప్పుడు ఓ దేశానికి తిండి పెడుతున్నాయంటే నమ్మగలరా? నమ్మలేం కదా? ఇది నిజం. ఆ దేశం మరేదో కాదు.. మన పొరుగునే ఉన్న పాకిస్తాన్. గాడిదలు అమ్ముకుని సొమ్ము చేసుకుంటోంది ఆ దేశం. దీనికి కారణం అక్కడ నెలకొన్న ఆర్థిక పరిస్థితులే. ఆర్థికపరంగా అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది పాకిస్తాన్. మాజీ క్రికెటర్, పాకిస్తాన్ తెహ్రీక్ఇఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ ఆ దేశ పగ్గాలను ఏ ముహూర్తంలో అందుకున్నారో గానీ.. అప్పటి నుంచీ పైసల్లేక అల్లాడుతోంది. చివరికి విలాసవంతమైన కార్లను కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. అమ్ముకుంటున్నారు కూడా. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి వచ్చే నిధులతోనే పాకిస్తాన్ కాలం గడుపుతోంది. ఎప్పటికప్పుడు ఐఎంఎఫ్ నుంచి బెయిల్ అవుట్ ప్యాకేజీలను తీసుకుంటోంది. ఈ చర్యలన్నీ ఆ దేశానికి తాత్కాలిక ఊరటను ఇచ్చేవి మాత్రమే. ఇలాంటి తాత్కాలిక చర్యల్లో భాగంగా.. గాడిదలను అమ్ముకునే ప్రణాళికను తెర మీదికి తీసుకొచ్చింది అక్కడి ప్రభుత్వం. తమ దేశంలో జులాయిగా తిరుగుతున్న గాడిదలన్నింటినీ ఓ గాటన కట్టేసి,కంటైనర్లలో నింపి చైనాకు విక్రయించాలని నిర్ణయించింది. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం ఒకటుంది. ప్రపంచం మొత్తం మీద గాడిదల సంఖ్య అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో పాకిస్తాన్ ది మూడో స్థానం. ఎలా లెక్క పెట్టారో తెలియట్లేదు గానీ.. పాకిస్తాన్ లో ఉన్న గాడిదల సంఖ్య అరకోటికి పైమాటే. ఎక్కడపడితే అక్కడ అడ్డంగా కనిపిస్తుంటాయవి. అందుకే కనిపించిన వాటిని కనిపించినట్టే పట్టేసుకుని చైనాకు ఎగుమతి చేయాలనే నిర్ణయానికి వచ్చిందట.

పారిస్లో అగ్నిప్రమాదం

- ఏడుగురి మృతి

పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక 8 అంతస్తుల నివాస భవనంలో మంటలు చెలరేగి ఏడుగురు మృతిచెందారు. పారిస్లోని 16వ అరోన్డిసెమెంట్లో గల రు ఎర్లాంగర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. రు ఎర్లాంగర్లోని ఓ నివాస భవనంలో సోమవారం అర్థరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే భవనమంతా మంటలు వ్యాపించాయి. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేసేందుకు యత్నించారు. మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఏడుగురు సజీవదహనమయ్యారు. మరో 28 మందిని రక్షించి బయటకు తీసుకొచ్చారు. ఇంకా కొందరు మంటల్లో చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తోంది. వారిని రక్షించేందుకు సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. దాదాపు 200 మంది అగ్నిమాపక సిబ్బంది సహాయకచర్యల్లో పాల్గొన్నారు. 7, 8వ అంతస్తులో మంటలు ఇంకా చెలరేగుతున్నాయి. మంటల తాకిడి ఎక్కువగా ఉండటంతో పక్కనే ఉన్న భవనాలను కూడా అధికారులు ఖాళీ చేయించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.



ప్రపంచశాంతి కోసం..

క్యాథలిక్, కైరో అల్ అజహర్ల ఒప్పందం

అబుదాబి: ప్రపంచ శాంతి కోసం మనుష్యులంతా సోదరభావంతో మెలిగేందుకు కృషి చేసేందుకు సిద్ధమంటూ పోప్ ఫ్రాన్సీస్, ప్రముఖ సున్నీ ఇస్లాం సంస్థ కైరో అల్ అజహర్లు ఒప్పందం చేసుకున్నాయి. దీనికి సంబంధించిన పత్రంపై పోప్ ఫ్రాన్సీస్, కైరో అల్ అజహర్ ఇమాం షేక్ అహ్మద్ అల్ –తయెబ్లు సంతకాలు చేశారు. క్రైస్తవులు, ముస్లీంల మధ్య శాంతి చర్చల ప్రాధాన్యతను గుర్తించి అడుగులు వేసే దిశగా వాటికన్ దీనిని రూపొందించింది. విశ్వాసాల స్వేచ్ఛ, సాంస్కృతిక సహనం కోసం ప్రచారం, ప్రార్థనా మందిరాల పరిరక్షణ, అల్పసంఖ్యాకులు పూర్తి పౌరసత్వ హక్కు దీని ప్రధాన ఉద్దేశాలు

పోప్ ఫ్రాన్సీస్ మూడు రోజుల పర్యటనలో భాగంగా యుఎఇ రాజధానిలో జరిగిన చారిత్రాత్మక ఆరాధనలో దాదాపు 1,70,000 మంది క్యాథలిక్కులు పాల్గొన్నారు. జాయెద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో వాటికన్ పచ్చరంగు జెండాలు రెపరెపలాడాయి. సాధారణంగా చర్చీల్లో ఆరాధనకు నిషేధం ఉన్న చర్చీల్లో బయట భారీ స్థాయిలో శిలువలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా ఇస్లాం జన్మస్థలంకు పోప్ ఫ్రాన్సీస్ రావడం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిగా తిలకిస్తోంది. ఈ పర్యటన సందర్భంగా ఆయన మధ్య తూర్పు ప్రాంతాల్లో యుద్ధాన్ని అగిపోవాలని, పౌరుల హక్కులు పరిరక్షించబడాలని ఆయన పిలుపునిచ్చారు. పోప్ పర్యటనతో వేలాది మంది వలసదార్లు తమకు కొన్ని హక్కులు దక్కుతాయని ఆసక్తిగా ఉన్నారు. తన పర్యటనలో పోప్, మన ఇంటి నుండి మనం దూరం ఉండలేం. మనం అమితంగా ప్రేమించే వ్యక్తులను కోల్పోతున్నానన్న భావం నిలువనీయదు. అదే విధంగా భవిష్యత్పై ఆందోళన కూడా ఎదగనీయదన్నారు. పోప్ రాకను ఫిలిపినో, ఇండియా క్యాథలిక్కులు ఘనంగా స్వాగతించారు. యుఎఇలో ప్రతి పది మందిలో ఒకరు క్యాథలిక్ ఉన్నట్లు అంచనా. దాదాపు 10 లక్షల మంది క్యాథలిక్కులున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. పోప్ తన పర్యటనలో వలసదారులు, శరణార్థుల సమస్యలపై ఎక్కువగా దృష్టి సారించారు. పోప్ పాల్గొన్న ఆరాధనలో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం స్టేడియం బయట వేలాది మంది క్యాథలిక్కులు గుంపులు గుంపులుగా చేరారు. లోపల ఆరాధనల్లో పాల్గొన్న వారే కాకుండా బయట పోప్ సందేశాన్ని వీడియో లింక్ ద్వారా భారీ స్క్రీన్లలో వినేందుకు 1,20,00 మంది గుమిగూడారు. పోప్ పాల్గొంటున్న చారిత్రాత్మక ఆరాధనలో పాల్గొనేందుకు తాము 1,35,000 టికెట్లను పంపిణీ చేశామని, ఇందులో 4,000 టికెట్లను ముస్లీంలకు పంపిణీ చేసినట్టు స్థానిక చర్చీలు తెలిపాయి.

ఉదయం 10.30 గంటలకు పోప్, వివిధ దేశాల మతగురువుల రాక తర్వాత కీర్తనతో ప్రారంభమైన ఆరాధనను ఎమిరటీ టెలివిజన్ లైవ్ టెలికాస్ట్ చేసింది. యుఎఇ 2019ను సహన సంవత్సరంగా ప్రకటించి, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పోప్ను సందర్శనకు రావాలని ఆహ్వానించింది. పోప్ పర్యటన సందర్భంగా సహన (టాలరెన్స్) మంత్రిత్వ శాఖ మంత్రి షేఖ్ నహ్యాన్ బిన్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ మాట్లాడుతూ, కల్లోల మధ్య ప్రాంతంలో ముఖ్యంగా యెమెన్, సిరియా, లిబియాల్లో యుద్ధం ఆగాలని, ఇందుకోసం అని మతాల గురువులు ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకించాలన్నారు. పోప్ బహిరంగంగా ఎలాంటి రాజకీయాలు మాట్లాడలేదు. అయినప్పటికీ అల్పసంఖ్యాకులైన క్రైస్తవులతో పాటు అందరికి సమాన హక్కులు దక్కాలని కోరుకుంటున్నారన్నాని షేక్ అన్నారు. వివిధ విశ్వాసాలకు చెందిన వారికి సమాన హక్కు దక్కేందుకు అన్ని రూపాల్లో హింసను రూపుమాపాల్సిన అవసరముందన్నారు.





తెరపై మహేష్ అన్న కొడుకు

సినిమాల్లో వారసుల హవా నిరంతరం చూస్తున్నదే. టాలీవుడ్‌లో అఖిల్ ఎంట్రీ తర్వాత మోక్షజ్ఞ ఎంట్రీ గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. వీళ్లతో పాటే.. త్వరలో మరో నట వారసుడు తెరంగేట్రం చేయబోతున్నాడు. ఈసారి ఘట్టమనేని ఫ్యామిలీ వారసుడు బరిలో దిగుతున్నారు. అతడు తొలుత వెబ్ సిరీస్ తో పాపులరై పెద్ద తెరపైకి ఎంట్రీ ఇస్తారట. వెబ్ సిరీస్ ప్రీ ప్రాక్టికల్స్ కోసమేనని తెలుస్తోంది. ఎఎంబీ సినిమాస్ పేరుతో సినిమా థియేటర్ రంగంలోకి అడుగుపెట్టిన మహేస్ తాజాగా వెబ్ సిరీస్‌ల నిర్మాణంలోకి ప్రవేశిస్తున్న విషయం తెలిసిందే. తొలి ప్రయత్నంగా 'చార్లీ' అనే పేరుతో ఓ వెబ్ సిరీస్‌కి శ్రీకారం చుడుతున్న మహేష్ ఈ సినిమాతో తన అన్న రమేష్‌బాబు తనయుడు జయకృష్ణని హీరోగా పరిచయం చేస్తున్నారు. భారీ ఖర్చుతో అత్యంత సాంకేతికతతో రూపొందనున్న ఈ వెబ్ సిరీస్ డిటెక్టివ్ పంథాలో సాగుతుందట. త్వరలో ప్రారంభం కానున్న ఈ వెబ్ సిరీస్కు హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించబోతున్నాడు. వెబ్ సిరీస్ లో సక్సెసైతే, అటుపై పెద్ద తెరపైనా జయకృష్ణ వెలుగులు ప్రసరిస్తారట. ఇక ఈ తరహా ట్రెండ్ బాలీవుడ్ లో ఇప్పటికే ఉంది. అక్కడ స్టార్ హీరోలు, వారి వారసులు కూడా వెబ్ సిరీస్‌లో నటించడానికి ముందుకొస్తున్నారు. సైఫ్ అలీఖాన్, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి స్టార్స్ ఇప్పటికే వరుస వెబ్ సిరీస్‌లతో ఆకట్టుకుంటున్నారు.

తెలివిగా చక్కబెట్టేస్తోంది!



'వెంకటాద్రి ఎక్స్ ప్రెస్' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన నాజూకు సుందరి రకుల్ ప్రీత్ సింగ్ జెట్ స్పీడ్తో వరుస అవకాశాలను అందిపుచ్చుకుంది. మహేష్, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్, రవితేజ లాంటి స్టార్ హీరోలతో ఆడిపాడి టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన అతి కొద్ది కాలంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్‌కి ఎదిగింది. అయితే నాన్నకు ప్రేమతో, స్పైడర్, సరైనోడు, బ్రూస్ లీ, ధృవ, రారండోయ్ వేడుక చూద్దాం లాంటి చిత్రాల్లో నటించినప్పటికీ.. ఆరు పాటలు, నాలుగు సీన్స్‌పై పరిమితం అయ్యింది తప్ప హీరోయిన్‌గా తనను తాను నిరూపించుకునే పాత్రలైతే చేయలేకపోయింది.

అయినప్పటికీ అవకాశాలు మాత్రం ఈ హీరోయిన్ తలుపు తడుతూనే ఉన్నాయి. ఇక తెలుగులోనే కాకుండా తమిళ్, హిందీ, కన్నడ చిత్ర పరిశ్రమలను సైతం చుట్టొచ్చింది ఈ ముద్దుగుమ్మ. స్టార్ హీరోయిన్ రేంజ్ రావడంతో భారీగా రెమ్యునరేషన్ రాబడుతోంది. అయితే ఇటీవల కాలంలో తెలుగులో విన్నర్, స్పైడర్ లాంటి భారీ డిజాస్టర్లు రావడంతో పాటు.. కొత్తగా వచ్చిన కీర్తి సురేష్, అను ఇమ్మానుయేల్, పూజా హెగ్డేల నుండి విపరీతమైన పోటీ ఉండటంతో రకుల్ ప్రీత్ సింగ్ రేంజ్ తగ్గింది. యంగ్ హీరో నితిన్ త్వరలో వెంకీ కుడుముల దర్శకత్వంలో నటించేందుకు సిద్ధం అవుతున్నాడు. ఈ చిత్రం జనవరిలో ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ చిత్రంలో ఓ హీరోయిన్ గా క్రేజీ బ్యూటీ రష్మిక మందన ఖరారైంది. వెంకీ కుడుముల చిత్రం తరువాత నితిన్ నటించబోయే చిత్రాన్ని ఓ ప్రముఖ నిర్మాత రూపొందించ బోతున్నారట. ఈ చిత్రంలో మరో హీరోయిన్ గా రకుల్ ప్రీత్ సింగ్ ని సంప్రదించినట్లు తెలుస్తోంది. రకుల్ ప్రీత్ సింగ్ విక్టరీ వెంకటేష్, నాగ చైతన్య కాంబోలో తెరకెక్కబోతున్న మల్టీస్టారర్ చిత్రం వెంకీ మామలో అవకాశం దక్కించుకుంది. అలాగే హీరో కార్తీ సరసన దేవ్ చిత్రంలో నటిస్తోంది.



రాశీఖన్నా కవయిత్రి

గత ఏడాది శ్రీనివాస కళ్యాణం చిత్రంలో నటించింది రాశీఖన్నా. ఆ సినిమా రిలీజై బాక్సాఫీస్ వద్ద ఫ్లాపైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రాశీ ఏం చేస్తోంది? అంటే సినిమాల కంటే ఫోటోషూట్లతోనే ఫ్యాన్స్ కి ట్రీట్ ఇస్తోంది ఈ బ్యూటీ. తమిళంలో అయోగ్య, సైతాన్ కా బచ్చా అనే రెండు చిత్రాలు మినహా తెలుగులో వేరొక సినిమాకి సంతకం చేయలేదు. అయితే సామాజిక మాధ్యమాల్లో మాత్రం రాశీ నిరంతరం అభిమానులకు టచ్ లో ఉంటోంది.

మీకు దక్కిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏది? అని నన్ను అందరూ ప్రశ్నిస్తుంటారు. దానికి నా దగ్గర సరైన సమాధానం లేదు. ఏదో ఒక బెస్ట్ ని ఎంపిక చేసి చెప్పలేను. అయితే ఇదిగో నేను ఓ ఎమోషనల్ సీన్లో నటించాను. ఈ ప్రపంచాన్ని నేను నీ కళ్లలో ఒదిగిపోతున్న తీరును చూడగలను. అలసిపోయినట్టుగా ఓ నవ్వు నవ్వాను. మన కళ్లు మన ఆత్మకు కిటికీలు వంటివని నేను భావిస్తాను. అందుకే ఈ హగ్.. అంటూ పోయెట్రీ చెబుతూ ఇన్ స్టాలో ఓ ఫోటోని అభిమానులకు షేర్ చేసింది. ఇక ట్విట్టర్ లో వేరొక పోస్ట్ తోనూ ఆకట్టుకుంది. అక్కడ జెన్నిఫర్ ఆల్ఫోన్స్ నగోబ జాతర వీడియోని షేర్ చేసింది. గోండ్ జాతి గిరిజనులకు సంబంధించిన పూర్వీకుల చరిత్రతో కూడుకున్న డాక్యుమెంటరీ ఇది.. నా ఫేవరెట్ అని తెలిపారు రాశీ.



లేడీ ఆఫీసర్ తడాఖా

తలైవి (నాయకి) నయనతార నటించిన బ్లాక్ బస్టర్ సినిమా ఇమైక్క నోడిగల్. ఈ చిత్రాన్ని తెలుగులో అంజలి 'సిబిఐ ఆఫీసర్' పేరుతో అనువదిస్తున్నారు. ఆర్ అజయ్ జ్ఞానముత్తు ఈ క్రైమ్ థ్రిల్లర్ తెరకెక్కించారు. నయనతార సిబిఐ ఆఫీసర్ గా టైటిల్ రోల్ లో నటించింది. ఈ చిత్రంలో అథర్వ, రాశీఖన్నా కీలక పాత్రల్లో నటించగా.. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయకుడిగా నటించారు. ప్రముఖ హీరో విజయ్ సేతుపతి విక్రమాదిత్య అనే అతిథి పాత్రలో నటించారు. నయనతార భర్త పాత్ర ఇది. ఈ చిత్రాన్ని క్యామియో ఫిలిమ్స్ బ్యానర్ సంస్థలో సిజే జయకుమార్ నిర్మించారు. హిప్ హాప్ తమిళన్ ఈ చిత్రానికి సంగీతం అందించగా.. ఆర్ డి రాజశేఖర్ సినిమాటోగ్రఫీ అందించారు. తెలుగు అనువాద కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. విశ్వశాంతి క్రియేషన్స్ బ్యానర్ పై తెలుగు హక్కులను దక్కించుకున్నారు నిర్మాతలు సిహెచ్ రాంబాబు, ఆచంట గోపీనాథ్. ఫిబ్రవరి 22న అంజలి సిబిఐ ఆఫీసర్ విడుదల కానుంది. బ్యానర్: విశ్వశాంతి క్రియేషన్స్, సంగీతం: హిప్ హాప్ తమిళన్, కెమెరా : ఆర్ డి రాజశేఖర్, ఎడిటింగ్: భువన్ శ్రీనివాసన్, నిర్మాతలు: సిహెచ్ రాంబాబు, ఆచంట గోపీనాథ్, కథ, స్క్రీన్ ప్లే, దర్శకుడు: ఆర్ అజయ్ జ్ఞానముత్తు.



హుషారుగా 50రోజులు

బెక్కెం వేణుగోపాల్, రియాజ్ నిర్మాతలుగా రూపొందిన చిత్రం 'హుషారు'. శ్రీహర్ష కొనుగంటి దర్శకుడు. తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్ మంచు, దినేష్ తేజ్, దక్ష నగార్కర్, ప్రియా వడ్లమాని, హేమ ఇంగ్లే ప్రధాన తారాగణంగా రూపొందిన ఈ సినిమా డిసెంబర్ 14న విడుదలై 50 రోజులను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్ లో 50 రోజుల వేడుకను నిర్వహించారు. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ "మా సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థాంక్స్. సినిమా ఇంత పెద్ద విజయాన్ని సాధిస్తుందని నేను ఊహించలేదు. కొన్ని ఏరియాల్లో షిఫ్టింగ్‌తో.. శ్రీ మయూరిలో ఫుల్ రన్‌తో 50 రోజులు వరకు సినిమా రన్ అయ్యింది. హార్డ్ వర్క్ మంచి పేరు వస్తుందనడానికి మా సినిమానే కారణం. ఈ సినిమా కోసం యూనిట్ అందరం ఏడాదిన్నర పాటు కష్టపడ్డాం. నాకు కూడా గొప్ప ఎక్స్‌పీరియెన్స్. సినిమాకు సంబంధించిన పాటలు, ట్రైలర్ బయటకు వచ్చినప్పుడు వచ్చిన రెస్పాన్స్‌తో మాలో నమ్మకం బాగా పెరిగింది. శ్రీహర్ష చాలా ఓపికగా, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా చేశాడు. ఎంటైర్ యూనిట్‌కు, నాకు సహకరించిన వారికి థాంక్స్" అన్నారు.

దిల్‌రాజు మాట్లాడుతూ "సినిమా ఫస్ట్ సాంగ్ రిలీజ్ రోజునే సినిమా బాగా ఉందని, ఆడేలా ఉందని చెప్పాను. నిజంగానే సినిమాను ప్రేక్షకులు ఆదరించారు. ఈరోజుల్లో సినిమా ఆడేదే కష్టం. అలాంటిది 50 రోజులు పూర్తి చేసుకోవడం అంటే సాధారణ విషయం కాదు. ఎంటైర్ యూనిట్‌కు అభినందనలు" అన్నారు.

శ్రీహర్ష కొనుగంటి మాట్లాడుతూ "నా లైఫ్‌లో ఈ సినిమాకు పనిచేసిన ప్రతిరోజూ బెస్ట్ మెమొరీ. ప్రేక్షకులు సినిమాను రిపీటెడ్ చూసి ఇంత పెద్ద హిట్ ఇచ్చారు. అందరికీ థాంక్స్" అన్నారు.

వెంకీ మామ ఆశీస్సులతో నాలుగు లేఖలు



ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ బ్యానర్ ప్రొడక్షన్ నెం.1గా రూపొందుతోన్న చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్ధమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు విక్టరీ వెంకటేష్ టీజర్, ట్రైలర్ ను చూసి చిత్ర కథానాయకుడు, దర్శక, నిర్మాతలను అభినందించి, చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 'ఏ' సర్టిఫికెట్ ను పొందింది. ఫిబ్రవరి 15 న చిత్రం ను విడుదల చేస్తున్నట్లు నిర్మాత ఉదయ్ కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా.. నిర్మాతలు దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ "మా బ్యానర్‌లో నిర్మిస్తోన్న తొలి చిత్రం '4 లెటర్స్'. ఈ చిత్రం టీజర్ ను సుప్రసిద్ధ దర్శకులు శ్రీ రాఘవేంద్ర రావు గారు విడుదల చేయటం మాకెంతో ఆనందంగా ఉంది. ఆయనకు కృతజ్ఞతలు. చిత్రం ద్వారా ఈశ్వర్‌ను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. చాలా చక్కగా నటించాడు. సత్యానంద్గారి వద్ద శిక్షణ తీసుకున్న ఈశ్వర్.. ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్నీ వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందించాం" అన్నారు.

హీరో ఈశ్వర్ మాట్లాడుతూ..విక్టరీ వెంకటేష్ గారి ఆశీస్సులు అందుకోవటం ఎంతో ఆనందంగా ఉంది. చిత్రం కూడా ప్రేక్షకాదరణకు నోచుకుంటుందనే నమ్మకం ఉందని అన్నారు. దర్శకుడు ఆర్.రఘురాజ్ మాట్లాడుతూ 'కలుసుకోవాలని' తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేసిన మూవీ ఈ 4 లెటర్స్. '4 లెటర్స్': నేటితరం ప్రేమకథాచిత్రం. అందుకే 'కుర్రాళ్ళకి అర్ధమవుతుందిలే' అన్నది ఉప శీర్షిక గా పెట్టాము.

ప్రేమ,పెళ్లి విషయాలలో నేటితరం యువత ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏమిటన్నది విషయాలను వాస్తవానికి దగ్గరగా ఉండేలా చిత్రీకరించటం జరిగింది. చిత్ర కథ, కథనాలు, సంభాషణలు అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సాగటం తో పాటు, ఆలోచన రేకెత్తించేలా ఉంటాయి అన్నారు. హీరో ఈశ్వర్ చక్కగా నటించాడు. తనకు మంచి భవిష్యత్ ఉంటుంది. హీరోయిన్స్ టువ చక్రవర్తి, అంకిత మహారాణాలు చక్కగా నటించారు. హైదరాబాద్‌లో టాకీ పార్ట్స్‌ను, బ్యాంకాక్‌లో సాంగ్స్‌ను చిత్రీకరించాం. నిర్మాతలు మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సపోర్ట్ చేయడంతో సినిమాను అనుకున్న ప్రణాళిక ప్రకారం పూర్తి చేశాం"అన్నారు.

ఎంతవారలైనా కాంత దాసులే!



రామదూత ఆర్ట్స్ పతాకంపై గురు చిందేపల్లి దర్శకత్వంలో జి.సీతారెడ్డి నిర్మిస్తున్న థ్రిల్లింగ్ హారర్ మూవీ 'ఎంతవారలైనా'. ఈ చిత్రంలో అద్వైత్, జహీదా శ్యామ్, అలోక్ జైన్, సీతారెడ్డి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు గురు చిందేపల్లి మాట్లాడుతూ –"ఎంతవారలైనా కాంత దాసులు కావచ్చు, కనకదాసులు కావచ్చు. కానీ, తప్పు చేసినప్పుడు ఎంతవారలైనా కూడా కచ్చితంగా శిక్షార్హులే అనే పాయింట్ మీద చేస్తున్న థ్రిల్లర్ హారర్ మూవీ. ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయింది అన్నారు. నిర్మాత జి.సీతారెడ్డి మాట్లాడుతూ దర్శకుడు గురు చిందేపల్లి నా క్లాస్ మేట్, చిరకాల మిత్రుడు. సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో నిర్మాతనయ్యాను. అలాగే నటన మీద ఉన్న ఆసక్తితోనే డైరెక్టర్ ప్రోత్సాహంతో ఈ సినిమాలో ఒక క్యారెక్టర్ కూడా చేశాను. గురు చిందేపల్లి చెప్పిన కథ ఎంతో నచ్చి ఈ సినిమాను చేశాం. హైదరాబాద్, మైసూర్, బెంగళూరు, చిక్మంగళూరులలో దాదాపు 60 రోజుల పాటు షెడ్యూల్ చేశాం. షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ కూడా స్టార్ట్ అయ్యింది. త్వరలోనే ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తాం. అన్నారు. అద్వైత్, జహీదా శ్యామ్, అలోక్ జైన్, సీతారెడ్డి, స్వప్న, అలీషా, అభిలాష్, మాస్టర్ అయాన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సుక్కు, కెమెరా: ఎస్.మురళీమోహన్‌రెడ్డి, ఎడిటింగ్: వి.నాగిరెడ్డి, ఆర్ట్: బాబ్జీ, నిర్మాత: జి.సీతారెడ్డి, కథ, కథనం, మాటలు, దర్శకత్వం: గురు చిందేపల్లి.

సినీకార్మికులకు ఆరోగ్యభీమా

పది మంది పేదలకు మనం సైతం టీమ్ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. వీరిలో విద్యా, వైద్యం, క్రీడలు వంటి వివిధ అవసరార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ రామ్మోహన్ రావు, దర్శకులు దశరథ్, న్యూస్ రీడర్ దీప్తి వాజ్ పేయి, పాత్రికేయులు సాయి, మనం సైతం సభ్యులు బందరు బాబీ, అనిల్ కుమార్, వినోద్ బాలా, సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు చెక్ లు అందజేశారు. ఎఫ్ డీసీ ఛైర్మన్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ.. ఇంత గొప్పసేవా కార్యక్రమం చేస్తున్న కాదంబరి కిరణ్ కు అభినందనలు. పేదలకు డబ్బులు ఇవ్వడమే కాదు ఆత్మీయత పంచుతున్నారు. అవసరం ఉన్న వాళ్ల ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆదుకుంటున్నారు. చిత్ర పరిశ్రమ అంటే పోటీ. ఇక్కడ నిత్యం పరుగులు పెట్టాలి. అవన్నీ వదిలేసి పేదలకు సేవ చేయడం ఎంతో కష్టమైన పని. చిత్ర పరిశ్రమలో కొన్ని విభాగాల కార్మికులకు ఆరోగ్య బీమా కల్పించాల్సి ఉంది అన్నారు. నిజాయితీగా శ్రమిస్తున్న కాదంబరి మరిన్ని మంచి పనులు చేయాలన్నారు.



మనం సైతం కార్యక్రమంలో కాదంబరి కిరణ్, ఎఫ్‌డీసీ ఛైర్మన్ రామ్మోహన్‌రావు, తదితరులు



పూజా హెగ్డే లేటెస్ట్ ఫోటో షూట్



వీధుల్లో డ్యాన్సింగ్ ట్రీట్

వరుణ్ ధావన్– శ్రద్ధా కపూర్ జంట డ్యాన్సింగ్ స్కిల్స్ గురించి తెలిసిందే. ఏబీసీడీ 2 లో ఈ జంట డ్యాన్సులు కట్టి పడేశాయి. ఇప్పుడు ఏబీసీడీ సిరీస్ లో మూడో సినిమా సెట్స్ పై ఉంది. ఈ సినిమా సెట్స్ పై ఉండగానే మరో ట్విస్టు. తాజాగా శ్రద్ధ, ధావన్ నటిస్తున్న ఇది ఏబీసీడీ 3 కాదు. పూర్తిగా వేరొక సిరీస్ అని నిర్మాత భూషణ్ కుమార్ తెలిపారు. స్ట్రీట్ డ్యాన్సర్ 3డి అనేది ప్రత్యేకించి ఓ సిరీస్ లా రూపొందిస్తున్నామని ఆయన వెల్లడించారు. స్ట్రీట్ డ్యాన్సర్లుగా శ్రద్ధా కపూర్, వరుణ్ ధావన్ ల లుక్ ని లేటెస్ట్ గా లాంచ్ చేశారు. పోస్టర్లు అద్భుతమైన లుక్ తో ఆకట్టుకున్నాయి. అలాగే టైటిల్ ని వరుణ్ ధావన్ స్వయంగా సామాజిక మాధ్యమాల్లో అభిమానులకు షేర్ చేశాడు. రెమో డిసౌజా తెరకెక్కించిన ఏబీసీడీ 2లో వరుణ్ ధావన్ శ్రద్ధా కపూర్ డ్యాన్సులు కుర్రకారును కళ్లు తిప్పుకోనివ్వలేదు. అందుకే ఈసారి స్ట్రీట్ డ్యాన్సర్ 3డిలో ఇంకే రేంజులో డ్యాన్సులు చేయబోతున్నారో? అంటూ ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారు. మరోవైపు ఏబీసీడీ 3 చిత్రం కూడా రెమో డి.సౌజా దర్శకత్వంలో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఒకేసారి డ్యాన్స్ బేస్డ్ సిరీస్ లతో బాలీవుడ్ వేడెక్కిపోతోంది. ఇక శ్రద్ధా కపూర్ ప్రభాస్ సరసన సాహో చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే.



కళ్లు మండుతున్నాయా..?

- గుడ్డు తెల్ల సొనను తీసుకుని అందులో స్పూన్ తేనె కలిపి కళ్లపై రాసుకోవాలి. 20 నిమిషాల పాటు అలానే ఉంచి తరువాత గోరువెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి ఆ నీటితో కళ్లను శుభ్రంగా కడుక్కోవాలి. ఇలా క్రమంగా చేస్తే తప్పక ఫలితం ఉంటుంది.
- గోరువెచ్చని నీటిలో కొంచెం ఉప్పు కలుపుకుని అందులో మెత్తటి బట్టను ముంచి దానిని కళ్ల మీద వేసుకుని ఓ అరగంటపాటు అలానే ఉంచాలి. ఆ తర్వాత చల్లని నీటితో కడుక్కోవాలి. ఇలా చేస్తే కంటి అలసట తగ్గుతుంది.
- కళ్లు విపరీతంగా మండుతుంటే.. ఐస్‌క్యూబ్స్‌తో కళ్లపై మర్దన చేసుకోవాలి. 5 నిమిషాల పాటు చేస్తే కళ్ల ఒత్తిడి తగ్గుతుంది.
- ధనియాలు కూడా కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గ్లాస్ నీటిలో 2 స్పూన్ల ధనియాలు వేసి రాత్రంత నానబెట్టుకోవాలి. ఉదయాన్నే ఆ నీటిలో కొద్దిగా బెల్లం కలిగి తాగితే మంచిది.

ఇల్లాలి ఆరోగ్యమే.. కుటుంబ సౌభాగ్యం



స్త్రీ అంటే ఆకాశమంత సహనం, భూదేవికి ఉన్నంత ఓర్పు ఉండాలంటారు. ఆ విషయంలో ఆడవారికి ఎవ్వరూ సాటి రారు. ఎందుకంటే ఉదయం లేచినప్పటి నుంచీ రాత్రి నిద్రించే దాకా తీరిక ఉండదు. ఇప్పుడు ఇంకో బాధ్యత కూడా పెరిగింది. ఉద్యోగం చేసి, పిల్లలను పికప్ చేసుకోవడం. దీంతో ఆడవారికి వారి ఆరోగ్యం కన్నా భర్త, పిల్లలపై చూపించే శ్రద్ధే ఎక్కువ. తన కంటే తన వారే ముఖ్యం అనుకునే స్త్రీ గుణం చాలా గొప్పది.

ఆడవారికి అన్ని విషయాల్లోనూ బాధ్యతలు ఎక్కువే. సమాజంలో నిర్వహించాల్సిన పాత్రలూ ఎక్కువే. దానితోపాటు ఒత్తిళ్ళూ అధికమే. అందులోనూ ఇంట్లో ఎవరికన్నా బాగోలేదంటే వారితోపాటు రాత్రింబవళ్ళు ఉంటూ వారి ఆరోగ్యం కుదుట పడే దాకా నిద్ర లేకుండా మేల్కొని ఒత్తిడికి గురవుతారు. అయితే ఈ ఒత్తిళ్ళని కూడా భరిస్తూ తన బాధ్యతలని సక్రమంగా, సరైన సమయంలో పూర్తి చేయడానికి అలవాటుపడిపోయింది. దాంతో తన గురించి, తన ఆరోగ్య పరిస్థితి గురించి, తనలోని మానసిక ఆందోళన గురించి ఏమాత్రం ఆలోచించదు. అదిగో అలా తనని తాను నిర్లక్ష్యం చేసుకునే ఆడవారి గురించి హెచ్చరిస్తోంది ఇటీవల వెలువరించిన పరిశోధన ఫలితం.

ఇంట్లో వారి ఆరోగ్య దృష్ట్యా..

ఇంట్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారికి సేవలు చేయడంలో ఆడవారు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం వుంటుంది అంటున్నారు పరిశోధకులు. ఆ ఒత్తిడి ఆడవారి శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుందని కూడా చెబుతున్నారు. ఈ పరిశోధనలో భాగంగా 65 సంవత్సరాలు పైబడ్డ స్త్రీలని, వారి జీవన శైలిని, వారి కుటుంబ ఆరోగ్య పరిస్థితులని, వారి వైద్య రికార్డులని పరిశీలించారు. ఒకరు ఇద్దరు కాదు.. సుమారు ఐదు లక్షల మందిని పరిశీలించిన ఈ పరిశోధకులు చివరికి తేల్చిన విషయం.. కుటుంబంలోని వారి అనారోగ్యం స్త్రీలని తీవ్ర ఒత్తిడికి గురిచేసి, వారి ఆయుష్షుపై ప్రభావాన్ని చూపిస్తుంది. అదీ దీర్ఘకాలిక అనారోగ్యం కలిగిన వారి మంచి చెడ్డలు చూడటంలో అంతర్లీనంగా ఉండే ఎన్నో విషయాలు ఆ ఒత్తిడికి కారణం అవుతాయట.

అధిక ఒత్తిడికి లోనవుతారు..

వయసు మళ్ళినవారు, మంచంపై ఉన్నవారి ఆలనా పాలనా చూడటంతో తమపై తాము శ్రద్ధ పెట్టకపోవటం. పూర్తిగా తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయటం ఒక కారణం అయితే, పోషకాహారం తీసుకోకపోవడం, సంరక్షణ చేసే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు ఎక్కువ శ్రమపడటం వంటివి మరో కారణం. అధ్యయనంలో భాగంగా స్త్రీల వైద్య రికార్డుల్ని పరిశీలించినప్పుడు కేన్సర్ వంటి అనారోగ్యంతో బాధపడేవారు, తీవ్ర అంగవైకల్యానికి గురైన వ్యక్తులు, ఇంట్లో వున్న వారికంటే ఎక్కువ ఒత్తిడికి గురైనట్టు తేలింది. శారీరక శ్రమ, సామాజిక ఒత్తిళ్ళ వంటివి కారణం కావచ్చుంటున్నారు పరిశోధకులు. మానసిక సమస్యలతో బాధపడే వ్యక్తులకు రక్షణగా ఉండే వారికి ఈ ఒత్తిడి మరీ అధికమట.



ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవాలి..

'డిమెన్షియా' అంటే మతిమరుపు. ఇతర మానసిక రుగ్మతల బారిన పడిన వారిని రక్షించడంలో సాధారణ స్థాయి కంటే ఒత్తిడి, వేదన అధికంగా వుంటాయట. హార్మోన్ల హెచ్చుతగ్గులు కూడా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. రోగ నిరోధక వ్యవస్థను కాపాడే తెల్ల రక్తకణాలు చురుకుదనాన్ని కోల్పోతాయట. దీంతో అధిక రక్తపోటు, గుండెజబ్బుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా వున్నట్టు గుర్తించారు. ఇలా రోగుల సంరక్షణలో ఎన్నో సవాళ్ళు, ఒత్తిళ్ళు దాగున్నాయని, ఈ విషయంలో స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మీరు బాగుంటేనే.. ఎదుటి వాళ్ళను చూసుకోగలిగేది..

ఇంట్లోవారి ఆరోగ్యం తప్పకుండా ఒత్తిడికి గురిచేస్తుంది. అయిన వారి బాధ చూడటం కష్టమే. వారిని అన్నివేళలా కంటికి రెప్పలా కాపాడాలనుకోవటం సహజమే. అయితే అదే సమయంలో మన ఆరోగ్యం గురించి కూడా ఆలోచించమని చెబుతున్నారు పరిశోధకులు. ముందుగా పరిస్థితులని యథాతథంగా స్వీకరించడం, తర్వాత ఏం జరుగుతుందో అన్న ఆందోళన చెందకుండా మంచి ఆహారాన్ని, విశ్రాంతిని తీసుకోవడమే మేలు. ఇంట్లో మిగిలిన సభ్యుల సహాయ సహకారాలని తీసుకోవడం ఉత్తమం. ఒత్తిడిగా అనిపిస్తే రిలాక్స్ అయ్యే టెక్నిక్స్‌ను పాటించాలి. వీలయితే ఓ గంట ఒంటరిగా ఉంటే ఒత్తిడి తగ్గి మనసుకు విశ్రాంతి దొరికే అవకాశమూ లేకపోలేదు. ఇన్ని జాగ్రత్తలు ఎందుకంటే ఆడవారి ఆరోగ్యంతోనే ఇతర కుటుంబాల ఆరోగ్యం ముడి పడి ఉంటుంది. కాబట్టి కొంచెం ధైర్యంగా, జాగ్రత్తగా ఉండటం ఆడవాళ్ళకి చాలా అవసరం.





ఆవ వంకాయ

కావలసిన పదార్థములు

వంకాయలు 6, సోంపు 2 స్పూన్లు, వాము, మెంతులు 1 స్పూను, ఆవపిండి 2 స్పూన్లు, మసాల పొడి ఒక స్పూను. ఆవ నూనె 2 స్పూన్లు, ఉప్పు రుచికి తగినంత.

తయారు చేయు విధానం



పెనం వేడి చేసి వాము, సోంపు, మెంతులు దోరగా వేగించాలి. చల్లారిన తర్వాత దంచి బరకగా పొడిచేయాలి. తర్వాత మసాల పొడి, ఆవ పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. ఇప్పుడు కడిగి శుభ్రం చేసుకుని తుడిచిన వంకాయలను కత్తితో నిలువుగా గాటుపెట్టి పొడుల మిశ్రమం కూరాలి. కడాయిలో నూనె వేసి వంకాయలు వరసగా పేర్చి చిన్నమంటపై మూతపెట్టి మగ్గించాలి. సాంబారు అన్నంతో సైడ్ డిష్గా లేదా అన్నంలో కలుపుకున్నా ఎంతో రుచిగా ఉండే వంటకం ఇది.

బ్రింజాల్ ఫ్రై

కావలసిన పదార్థములు

గుండ్రని వంకాయలు అరకిలో(రెండు ముక్కలుగా చేసుకోవాలి), ఎండుకొబ్బరి పొడి: కప్పు, ఉల్లిపాయ:ఒకటి(కావలసిన సైజులో ముక్కలుగా చేసుకోవాలి), వెల్లుల్లి :పావుకప్పు, జీలకర్ర: రెండు స్పూన్లు, ఆవాలు: 1 టేబుల్ స్పూన్, పసుపు: చిటికెడు, కారం:రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు: రుచికి సరిపడ, నూనె: తగినంత, కరివేపాకు: కొద్దిగా.

తయారీ విధానం

ముందుగా ఉల్లిపాయముక్కలు, కొబ్బరిపొడి, వెల్లుల్లి రెమ్మలు, జీలకర్ర అన్నీ వేసి మసాలా రుబ్బి పెట్టుకోవాలి. ఇప్పుడు బాండీలో నూనె వేసి కాగిన తరువాత ఆవాలు, జీలకర్ర, కరివేపాకు వేసి వేయించుకోవాలి. ఇప్పుడు వంకాయ ముక్కలు వేసుకుని వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నూనెలో మసాలా ముద్ద వేసి నూనె పైకి తేలేంత వరకూ వేగనిచ్చి దీనికి వంకాయ ముక్కలు, ఉప్పు, కారం జతచేసి సన్నని మంట మీద ఓ ఐదు నిమిషాలు ఉడికించుకోవాలి. ఇది అన్నం లేదా చపాతీల్లోకి బాగుంటుంది.





వాంగీ బాత్

వాంగీ బాత్ ప్రపంచంలోనే అన్నిటికన్నా రుచికరమైన వంటకం. ఈ సాంప్రదాయపు కర్ణాటక స్టైల్ వంకాయ రైస్ రెసిపీని చాలా సులభంగా చేసుకోవచ్చు. వంకాయ పోషకవిలువలకి, యాంటీఆక్సిడెంట్ లక్షణాలకి ప్రసిద్ధి. ఆరోగ్యానికి చాలా మంచిది. అలాగే రుచికరమైన వంట ఇది. వాంగీ బాత్‌లో ఈ రెసిపి కోసమే ప్రత్యేకంగా వాడే భారతీయ దినుసుల సువాసనలన్నీ దేనికవి అందంగా అమరిపోతాయి. వేయించిన సెనగపప్పు, మినపప్పు, అలాగే దినుసులైన లవంగాలు, ఏలకులు, దాల్చినచెక్క, వాటితో మెంతులు, ధనియాల కలయిక అన్నీ కలిపి ఈ వంటకానికి మాటల్లో చెప్పలేని రుచిని అందిస్తాయి. అన్నానికి వంకాయ రుచి కలిస్తే ఈ ప్రత్యేకమైన ఫ్లేవర్ సూపర్‌గా ఉంటుంది.

కావలసిన పదార్థములు

వంకాయలు 45, కొత్తిమీర చేతిలో పట్టినన్ని చింతపండు రసం 1 చెంచా, ధనియాలు 1 చెంచా, నూనె అలంకరణకి + వేయించటానికి ఎర్రమిర్చి (ఎండినది) 56, పొడి కొబ్బరి (తురిమినది) 1/2 కప్పు, బియ్యం 1 కప్పు, ఆవాలు 1చెంచా , మినపప్పు1 చెంచా, సెనగపప్పు 1 చెంచా, మసాలాదినుసులు (ఏలకులు, దాల్చినచెక్క, లవంగాలు) 1 చెంచా, బెల్లం 1చెంచా, ఉప్పు రుచికి సరిపడా, నువ్వులు 1చెంచా, మెంతులు 1 చెంచా, జీలకర్ర 1 చెంచా, కరివేపాకు రెండు రెమ్మలు, పసుపుపొడి 1 చెంచా.

తయారు చేయు విధానం

ఒక బౌల్ తీసుకుని బియ్యం వేయండి. నీళ్ళు పోసి బాగా కడగండి. 3. కుక్కర్ తీసుకుని ఆ బియ్యాన్ని అందులో వేయండి. నీరు పోయండి. 3 విజిల్స్ ఒచ్చాక కుక్కర్ ఆపండి. అన్నాన్ని ఒక పక్కన పెట్టుకోండి. వంకాయలు తీసుకుని సన్నగా ముక్కలు తరగండి. అన్ని ముక్కలను ఒక బౌల్ నీళ్లలో వేయండి. ఒక పెనం తీసుకోండి. నూనె వేయండి. మినప్పప్పు,జీలకర్ర, సెనగపప్పు, నువ్వులు, మెంతులు, లవంగాలు, ధనియాలను వేయండి. అన్నిటినీ కలపండి. ఎండుమిర్చి, తురిమిన కొబ్బరి వేసి మళ్ళీ కలపండి. కొబ్బరి, ఇతర దినుసుల వాసన తెలిసేదాకా పొడిగా అన్నిటినీ వేయించండి. 34 నిమిషాలపాటు చల్లబడనివ్వండి. అన్ని దినుసులను మిక్సీలో వేయండి. పొడి అయ్యే వరకూ మిక్సీ పట్టండి. పెనం తీసుకోండి. నూనె, ఆవాలు, మినపప్పు, సెనగపప్పు, కరివేపాకు, పసుపు, వంకాయలు వేసి నిమిషంపాటు కలపండి. చింతపండు రసం,బెల్లం వేసి బాగా కలపండి. ఉప్పు వేయండి. అన్నిటినీ కలిపి 23 నిమిషాలు ఉడకనివ్వండి. దినుసుల మిశ్రమాన్ని వేసి బాగా అన్నిటినీ కలపండి. మూతపెట్టి 23 నిమిషాలను ఉడకనివ్వండి. మూత తీసి వంకాయలను కలపండి. అన్నం వేసి బాగా కలపండి కొత్తిమీరతో అలంకరించి బౌల్‌లోకి తీసుకోండి. మీకు నచ్చిన పచ్చడి లేదా పెరుగుతో వడ్డించండి.

నువ్వుల గుత్తి వంకాయ

కావలసిన పదార్థాలు:

చిన్న వంకాయలు: 1/2కేజి, పల్లీలు: 50గ్రాములు, నువ్వులు: 50గ్రాములు, ధనియాలు: 2టీ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్టు: 2టీ స్పూన్లు, కారం: 11/2టీ స్పూన్, ఉప్పు: రుచికి తగినంత ఉల్లిపాయలు: 2 కొబ్బరి తురుము: 2టీ స్పూన్లు, చింతపండు: 50గ్రాములు పసుపు: 1/4టీ స్పూన్. గ్రేవీ కోసం: కొబ్బరి తురుము, పల్లిల పొడి, అల్లం వెల్లులి పేస్టు, చింతపండు, కారం, పసుపు, ఉప్పు, ఉల్లిపాయలు, కలిపి మిక్సిలో వేసి మెత్తటి పేస్ట్ లా తయారు చేసుకోవాలి. పోపు కోసం: ఎండు మిర్చి: 5 ఆవాలు: ఒక టీ స్పూన్ మినపప్పు : ఒక టీ స్పూన్ పచ్చి సెనగ పప్పు : ఒక టీ స్పూన్ నూనె: కావలసినంత.

తయారు చేయు విధానం

1. తొడిమలు తీయకుండా వంకాయలను నాలుగు బాగాలుగా గాట్లు పెట్టి నీళ్ళలో వెయ్యాలి . పల్లీలు, నువ్వులను విడి విడిగా వేయించి పొడి చేసి పెట్టుకోవాలి. 2. గాటు పెట్టిన వంకాయలను పల్లి , నువ్వుల పొడితో నింపాలి.

3. స్టౌ పై పాన్ పెట్టి, పోపు దినుసులు, ఉల్లిపాయలు వేసి కాసేపు వేయించిన తరువాత స్టఫ్ చేసిన వంకాయలు అందులో వేయాలి. అయిదు నిమిషాలు బాగా వేగిన తరువాత గ్రేవి కోసం తయారు చేసుకొన్న మసాల పేస్ట్ ను, కొద్దిగా నీరు పోసి ఉడికించాలి బాగా వుడికినట్టు అనిపించాక చింతపండు రసం పోసి మరికొద్దిసేపు ఉడకనివ్వాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. చపాతి తో గాని, రైస్ తో గాని సర్వే చేసుకుంటే బాగుంటుంది.



కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)



హైదరాబాద్	430	విజయవాడ	399
ముంబయి	453	ఢిల్లీ	427
చెన్నై	445	బెంగళూరు	435

బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.



హైదరాబాద్	95	ఢిల్లీ	120
కరీంనగర్	100	ముంబయి	115
వరంగల్	105	చెన్నై	115

సెన్సెక్స్ +34.07 ▲
36,616



నిఫ్టీ + 22.10 ▲
10,934



రూపాయి
₹71.56
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
33,500
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో



ఎట్టకేలకు పుంజుకున్న.. పీఎన్‌బీ

- మూడో త్రైమాసికంలో రూ. 246.51 కోట్ల లాభం

ఢిల్లీ: వేల కోట్ల రూపాయల కుంభకోణంలో చిక్కుకున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) నష్టాల నుంచి బయటపడింది. నీరవ్ మోదీ రూ.13 వేల కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత పీఎన్‌బీకి తొలిసారి లాభాలు వచ్చాయి. మూడో త్రైమాసికంలో పీఎన్‌బీ స్వల్ప లాభాలతో గట్టెక్కింది. మంగళవారం ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో పీఎన్‌బీ 7.12శాతం లాభాలను ఆర్జించింది. డిసెంబరు 31, 2018తో ముగిసిన త్రైమాసికంలో పీఎన్‌బీ రూ.246.51కోట్ల నికర లాభాన్ని నమోదు చేసుకుంది. అంతకుముందు ఏడాది ఇదే సమయంలో పీఎన్‌బీ రూ.230.11కోట్ల లాభాలను ఆర్జించింది. అయితే.. బ్యాంకు మొత్తం ఆదాయం మాత్రం 2.64శాతం తగ్గి రూ.14,854.24 కోట్లు చేరింది. బ్యాంకు ఆదాయం రూ.15,257.5కోట్లుగా ఉంది. స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) మాత్రం పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 12.11శాతం ఉండగా.. మూడో త్రైమాసికంలో అది 16.33శాతానికి చేరింది. మొండిబకాయిల కోసం కేటాయించిన ప్రొవిజన్లు రూ.2,996.42కోట్లు ఉండగా.. అవి ఇప్పుడు రూ.2,565.77 కోట్లకు తగ్గాయి.

లాభాల్లో పీఎన్‌బీ షేర్లు..

మూడో త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో పీఎన్‌బీ షేర్లు లాభాల్లో పయనిస్తున్నాయి. ఒకానొక సమయంలో 3శాతం లాభాల్లో ట్రేడయ్యాయి.

ఎయిర్ ఇండియా నుంచి
పెట్టుబడుల ఉపసంహరణ


- ప్రక్రియను ప్రారంభించిన కేంద్రం
- 24 కంపెనీల్లో వాటాల అమ్మకం



ఢిల్లీ: ప్రభుత్వరంగ కంపెనీల్లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను కేంద్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచే చేపట్టనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను కూడా ప్రారంభించినట్టు ఓ సీనియర్ అధికారి మీడియాకు తెలిపారు. ఎయిర్ ఇండియా, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, భారత్ ఎర్త్ మూవర్స్ (బీఈఎంఎల్) సహా రెండు డజన్ల కంపెనీల్లో వాటాలను విక్రయించేందుకు కేంద్ర కేబినెట్ ఇప్పటికే ఆమోదం కూడా తెలిపింది. ఇందులో తొమ్మిది కంపెనీల్లో వాటా విక్రయానికి ముందే వీటికి సంబంధించిన భూములు, ఇతర ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారు. వీటిల్లో స్కూటర్స్ ఇండియా, ఎయిర్ ఇండియా, భారత్ పంప్స్ అండ్ కంప్రెషర్స్, ప్రాజెక్ట్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా, హిందుస్తాన్ ప్రీఫ్యాబ్, హిందుస్తాన్ న్యూస్‌ప్రింట్, బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ, హిందుస్తాన్ ఫ్లోరో కార్బన్స్ ఉన్నాయి. ఆస్తుల అమ్మకాలకు సంబంధించిన కార్యాచరణను పెట్టుబడులు, ప్రజా ఆస్తుల విభాగం (దీపమ్) ఇప్పటికే రూపొందించింది. "ఆస్తుల నగదీకరణ కార్యాచరణ అన్నది... ఆస్తులను నిర్వచించడం, భిన్న మార్గాల్లో ఏ ప్రక్రియను అనుసరించేది తెలియజేస్తుంది" అని దీపమ్ సెక్రటరీ అతనూ చక్రవర్తి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి పీఎస్‌యూలో వాటాల విక్రయం, పెట్టుబ డుల ఉపసంహరణల ద్వారా రూ.80,000 కోట్ల సమీకరణ లక్ష్యం పెట్టుకోగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.90,000 కోట్లుగా ఇటీవలి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పేర్కొన్న విషయం గమనార్హం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆస్తుల అమ్మకం కూడా ఓ భాగం.

లాభాల్లో ఆటోమొబైల్స్ రంగం

- స్వల్ప లాభాలతో ముగిసిన దలాల్ స్ట్రీట్



ముంబై: మంగళవారం స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 34 పాయింట్ల లాభంతో 36,617 వద్ద, నిఫ్టీ 22 పాయింట్ల లాభంతో 10,934 వద్ద ముగిశాయి. ఆటోమొబైల్స్ సూచీ అత్యధికంగా లాభపడింది. హీరో మోటో కార్ప్, బజాజ్ ఆటో, మారుతీ సుజుకీ వంటి సంస్థల షేర్లు దూసుకెళ్లాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో ఆ షేరు లాభపడింది. జుబ్లియంట్ ఫుడ్ వర్క్ షేరు 6.33శాతం నష్టపోయింది. జీఎస్‌టీ బదలాయింపుల్లో ఈ కంపెనీ అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో ఈ షేరు కుంగింది. అమ్మకాలు జరిపాక వసూలైన దాదాపు రూ.41.42 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా అక్రమంగా డిపాజిట్ చేసినట్లు తేలింది. మరో పక్క ఆసియా స్టాక్‌మార్కెట్‌లు లాభాల్లో ముగిశాయి.

జియో నుంచి 5జి ఫోన్..?

ముంబై: అతి తక్కువ ధరలకే టెలికాం సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి సంచలనం సృష్టించింది రిలయన్స్ జియో. అంతేకాదు, తక్కువ కాలంలోనే కోట్ల మంది వినియోగదారులను సొంతం చేసుకుంది. వేగవంతమైన 4జీ సేవలను అందిస్తున్న జియో త్వరలోనే 5జీ అందుబాటులోకి తీసుకురావడమే కాదు, 5జీతో పనిచేసే మొబైల్‌ను విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.5జీ సేవలను వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తీసుకురావాలని జియో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్పెక్ట్రాం వేలం పూర్తయిన ఆరు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసేలా పనులు సిద్ధం చేస్తున్నట్లు ఓ ఆంగ్ల ప్రతిక తన కథనంలో పేర్కొంది. ఈ నేపథ్యంలో సొంత 5జీ హ్యాండ్‌సెట్లను కూడా సిద్ధం చేస్తోంది. అదే సమయంలో 5జీ ఆధారంగా పనిచేసే ఫీచర్‌ఫోన్‌తో తీసుకురావాలని జియో యోచిస్తోందట.

భారత్‌లో లాభాలు రాకపోతే.. వైదొలగండి

- వాల్ మార్ట్‌కు ఫైనాన్షియల్ సర్వీస్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ సూచన

ఢిల్లీ: భారత్‌లో లాభాలు రాకపోతే వాల్ మార్ట్ సంస్థ వెంటనే వైదొలగాలని వాల్ మార్ట్‌కు ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీస్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ సూచించింది. కొత్తగా అమల్లోకి వచ్చిన ఈ–కామర్స్ నిబంధనలు వ్యాపారాన్ని కష్టంగా మార్చివేయడం, ఫ్లిప్‌కార్ట్ లాభాల్లో అనిశ్చిత నేపథ్యంలో ఇలా పేర్కొంది. 'అసెసింగ్ ఫ్లిప్‌కార్ట్ రిస్క్ టు డబ్ల్యూఎంటీ ఈపీఎస్' అనే నివేదికలో ఈ విషయాన్ని పేర్కొంది. చైనాలో వ్యాపారం లాభదాయకం కాదని తేలిన వెంటనే అమెజాన్ 2017లో మార్కెట్ నుంచి వైదొలగిన విషయాన్ని ఉటంకించింది. 2017 మేలో వాల్‌మార్ట్ కంపెనీ దాదాపు 16 బిలియన్ డాలర్లను వెచ్చించి ఫ్లిప్‌కార్ట్ 77శాతం వాటా కొనుగోలు చేసింది. అప్పట్లో దీని విలువను 20 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. ఈ డీల్‌తో వాల్‌మార్ట్ భారతీయ మార్కెట్‌లో నేరుగా అమెజాన్‌తో తలపడినట్లైంది. కొత్తగా అమల్లోకి వచ్చిన నిబంధనలకు అనుగుణంగా తన వ్యూహాన్ని మార్చుకొని వాల్ మార్ట్ భారత్‌లో కొనసాగుతుందని పేర్కొంది. కొత్త నిబంధనలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లను విక్రయాలను దెబ్బతీస్తాయని అంచనా వేసింది. గతంలో ఈ రెండు సంస్థలు గతంలో భారీ ఎత్తున ఎక్స్‌క్లూజివ్ వస్తువులను విక్రయించేవి.



7 నుంచి డిజైన్ లైబ్రరీ ఎగ్జిబిషన్

విజయక్రాంతి, హైదరాబాద్: మాదాపూర్ హెచ్‌ఐసీసీలో డిజైన్ లైబ్రరీ పేరిట ఈ నెల 7 నుంచి ఎగ్జిబిషన్ జరుగనుంది. ఇందులో భాగంగా ఈ కార్యక్రమానికి సంబంధించి కర్టెన్ రైజర్‌ను నిర్వాహకుడు డొమినిక్ ఆధ్వర్యంలో హెచ్‌ఐసీసీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మోడల్స్ షాలు, ఆశిమా గౌతమ్, జెన్నీ, సిమ్రత్, నికితలు ర్యాంప్‌పై హొయలొలికిస్తూ క్యాట్‌వాక్‌తో ఆకట్టుకున్నారు. మహిళలు తమ అందానికి మరితం అందంగా కనిపించేందుకు ఎక్కువ ఇష్టపడుతుంటారని సినీనటి సిదిధ ఇడ్నానీ, మన్నత్ సింగ్‌లు అన్నారు. ఈ ప్రదర్శనలో గృహోపకరణ ఉత్పత్తులు, ఫర్నిచర్ వర్క్స్, వస్త్రాభరణాలు, జ్యువెలరీ వస్తువులు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో వివాహాది వస్త్రాభరణాలను ప్రదర్శనలో ఉంటాయని, చెన్నై, కొచ్చి, సూరత్, గుజరాత్, ముంబై, పూణే వంటి ప్రాంతాల నుంచి చేతితో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలలో కొలువుదీరనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 250 మంది డిజైనర్‌లు పాల్గొని తమ ఉత్పత్తులను అందుబాటులో తీసుకున్నట్లు వివరించారు.




స్పోర్ట్స్



ట్వీట్ ద్వారా మాజీ సైనికుడికి
సహాయం చేసిన గంభీర్

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ తన మంచి మనసును మరోసారి చాటుకున్నాడు. ఆపదలో ఉన్న సైనికులు, పోలీసులు, వారి పిల్లలకు సాయం చేసేందుకు గంభీర్ ఎప్పుడూ ముందుంటాడు. ఎప్పుడూ తనకు వీలైన సాయం చేస్తుంటాడు. అయితే ఈ మధ్యే ఓ మాజీ సైనికుడిని తన ట్వీట్ ద్వారా ఆదుకునే ప్రయత్నం చేశాడు. దిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లోని ఏ బ్లాక్ వద్ద మాజీ సైనికుడు ఫ్లకార్డును పట్టుకుని అందులో తనకు సాయం చేయాల్సిందిగా కోరాడు. తాను మాజీ సైనికుడినని 1965, 1971 భారత్, పాక్ యుద్ధంలో పాల్గొన్నానని, 1967లో జరిగిన భారత్, చైనా యుద్ధంలో కూడా నాథులా వద్ద పోరాడినట్టు ఆయన వెల్లడించాడు. ఈ మధ్యే తనకు ప్రమాదం జరిగిందని, వైద్యానికి ఆర్థికసాయం చేయాలని పీతాంబరన్ ఆ ఫ్లకార్డులో పేర్కొన్నాడు. మాజీ సైనికుడు పీతాంబరన్ రెండు చిత్రాలను గంభీర్ తన ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల సైన్యం సహాయం పొందలేకపోతున్నానని అందులో తెలిపాడు. అతని మెడలోని సైనిక గర్తింపు కార్డును చూసి ధ్రువీకరించుకున్న గంభీర్ వెంటనే ఈ విషయాన్ని రక్షణ శాఖకు ట్వీట్ చేశాడు. గంభీర్ ట్వీట్‌కు వెంటనే స్పందించిన రక్షణశాఖ అధికార ప్రతినిధి త్వరగా సదరు సైనికుడికి కావాల్సిన సాయం చేస్తామని వెల్లడించారు. దీంతో గంభీర్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

నేటినుంచి గోల్కొండ మాస్టర్స్ టోర్నీ ప్రారంభం



విజయక్రాంతి, హైదరాబాద్: హైదరాబాద్ గోల్ఫ్ అసోషియేషన్, గోల్ఫ్ ప్రొఫెషనల్ అఫీషియల్ శాంక్షనింగ్, ప్రొఫెషనల్ గోల్ఫ్ ఆఫ్ ఇండియా (పీజీటీఐ), తెలంగాణ టూరిజం మద్దతుతో గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ ఐదో ఎడిషన్‌ను నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని గోల్ఫ్ క్లబ్‌లో నేటి నుంచి నాలుగు రోజుల పాటు ఇది జరుగనుంది. ఈ మెగా టోర్నీలో వివిధ దేశాల నుంచి మొత్తం 124 మంది గోల్ఫర్స్ పాల్గొననున్నారు. ఇందులో భారతదేశానికి చెందిన ప్రముఖ ప్రొఫెషనల్స్‌తో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు చెందిన వారు పాల్గొననున్నారు. ఈ టోర్నీలో భారతీయ ప్రొఫెషనల్స్‌లో ఏషియన్ టూర్ రెగ్యులర్స్ కాలిస్ జోషి, అజితేశ్ సింగ్ సాంధు, చిక్కరంగప్ప, అమస్ రాజ్, చిరాగ్ కుమార్, అభిజిత్ సింగ్ చందాలతో పాటు అగ్రశ్రేణజ ఆటగాళ్లు రషీద్ ఖాన్, ఉదయన్ మానె, హరీంద్ర గుప్తా, శ్రీలంకకు చెందిన అనురా రోహణ, ఎ. తంగరాజా, మిథున్ పెరెరా, కె. ప్రభాకరన్, ఆస్ట్రేలియాకు చెందిన కునాల్ బాసిన్, బంగ్లాదేశ్‌కు చెందిన మహమ్మద్ జమాల్ హుసేన్ మొల్లాలు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ సెక్రటరీ బుర్రా వెంకటేషం, హెచ్‌జీఏ ప్రెసిడెంట్ విక్రమదేవ్ రావ్, హెచ్‌జీఏ కెప్టెన్ దయాకర్ రెడ్డి, పీజీటీఐ సీఈవో ఉత్తమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి క్రికెట్‌లో
ఆధిపత్యం చెలాయించేనా?



- నేడు కివీస్‌తో తొలి టీ20 మ్యాచ్
- కుర్రాళ్లతో సమతూకంగా ఉన్న భారత్
- టీ20 సిరీస్‌పై కన్నేసిన విలియమ్సన్ సేన
- జట్టులోకొచ్చిన రిషబ్ పంత్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను 4–1తేడాతో కైవసం చేసుకుని మంచి ఊపు మీదున్న టీంఇండియా . ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌కు రెడీ అయ్యింది. నేడు వెల్లింగ్టన్ లో బ్లాక్‌కాప్స్‌తో తొలి టీ20 మ్యాచ్‌కు ఆడనుంది. ఈ మ్యాచ్‌లో టీంఇండియా రెగ్యులర్ కెప్టెన్ కోహ్లీకి విశ్రాంతి ఇచ్చిన విషయం విధితమే .దీంతో టీ20 సిరీస్‌కు కూడా రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. కుర్రాళ్లతో భారత జట్టు బలంగా కనిపిస్తోంది. లెఫ్టఆర్మ్ ఆటగాడు రిషబ్ ఫంత్ కూడా జట్టులో చేరడంతో జట్టు మరింత దృఢంగా కనిపిస్తోంది. వన్డేలో ఓపెనర్‌గా విఫలమైన శిఖర్ ధావన్ టీ20 సిరీస్‌లో రాణించి ప్రపంచకప్‌కు జట్టులో స్థానం సాదించాలని కసితో ఉన్నాడు. ఇక కెప్టెన్ రోహిత్ శర్మకానీ చెలరేగితే కివీస్‌కు కష్టాలు తప్పవు. దినేష్ కార్తిక్‌కు జట్టులో స్థానం ఉంటుందో ఉండదో అనే సందేహం ఉంది. ఇక సీనియర్ ఆటగాడు ధోనీ రాణింపుపైనా కూడా ఆసక్తిగా ఉన్నారు అభిమానులు, ఇక జట్టులోకొచ్చిన పాండ్య బ్రదర్స్ ఏమేరకు రాణిస్తారో చూడాలి, బౌలింగ్‌లో సీమర్ భువనేశ్వర్ కుమార్‌తో పాటు కొత్త బంతిని మహ్మద్ సిరాజ్ కానీ, సిద్దార్థ్ కౌల్‌గానీ పంచుకునే అవకాశం ఉంది. వెల్లింగ్టన్ పిచ్ స్వింగ్‌కు అనుకూలించే అవకాశం ఉన్న నేపధ్యంలో భువీ పాత్ర చాలా కీలకం ఉండనుంది. ఇక స్పిన్‌లో కుల్దీప్ యాదవ్, ఛాహల్‌లు అద్భుతంగా రాణిస్తున్నారు. కాబట్టి వీరిద్దరిపై జట్టు పూర్తి విశ్వాసం పెట్టుకుంది.

టీ20 సిరీస్‌పైనే కన్నేసిన బ్లాక్‌కాప్స్

స్వదేశంలో సొంత మైదానాలలో వన్డే సిరీస్‌ను కోల్పోయి డీలా పడిన న్యూజీలాండ్ జట్టు, టీ20 సిరీస్‌ను ఎలాగైనా కైవసం చేసుకుని పరువు దక్కించుకోవాలని చూస్తోంది. రెగ్యులర్ ఒపెనర్ మార్టిన్ గుప్టిల్ సిరీస్‌కు దూరం కావడంతో జట్టు భారం అంతా కెప్టెన్ విలియమ్సన్, రాస్ టేలర్, డగ్ బ్రేస్‌వెల్, గ్రాండ్ హోమ్‌లపై పడింది. వీరందరికీ టీ20ల్లో అపార అనుభవం ఉంది. వీరిలో ఇద్దరు రాణించినా భారత్‌పై పట్టుసాధించొచ్చని ఆ జట్టు భావిస్తోంది . ఇక బౌలింగ్‌లో కూడా కివీస్ జట్టు సమతూకంగా కనిపిస్తోంది. వన్డేలతో పోల్చుకుంటే టీ20ల్లో వీరి బౌలింగ్ గణాంకాలు అమోగంగా ఉన్నాయి..ఐష్ సోది, టిమ్ సాథీలు చెలరేగితే భారత్‌కు కష్టాలు తప్పవు, బ్యాటింగ్‌లో ఎక్కువుగా కివీస్ జట్టు కెప్టెన్ విలియమ్సన్‌పైనే ఎక్కువుగా ఆధారపడుతుండటంతో అతనిపై ఎక్కువుగా ఒత్తిడి ఉంది. బౌన్సీ పిచ్‌లో స్వింగ్ ఎక్కువుగా అయ్యే అవకాశం ఉంది కాబట్టి భారత్‌ను ఇరుకున పెట్టొచ్చని న్యూజిలాండ్ జట్టు భావిస్తోంది.





రిజర్వ్ ఆటగాళ్లను పరీక్షించనున్నాం



టీమిండియా లాంటి అగ్రశ్రేణి జట్టుపై తమ రిజర్వు ఆటగాళ్లను పరీక్షించేందుకు ఆత్రుతగా ఉన్నట్టు న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్ అన్నాడు. గాయంతో మార్టిన్ గప్టిల్ సిరీస్‌కు దూరమయ్యాడు. మా వద్ద కొత్త కుర్రాళ్లు ఉన్నారు. సిరీస్‌లో కొందరు అరంగేట్రం చేయడం ఆసక్తిగా ఉంది. అద్భుతమైన భారత జట్టుపై ఎక్కువ మంది కుర్రాళ్లకు అవకాశం రావడం సానుకూల అంశం. పిచ్‌ను పరిశీలించిన తర్వాత జట్టు సమతూకం గురించి ఆలోచిస్తాం. మా వద్ద చాలామంది ఆల్‌రౌండర్‌లు ఉన్నారు. కొలిన్ మన్రో టాప్–3లో ఉంటాడు. పవర్ హిట్టర్ల బ్యాటింగ్ ఆర్డర్ మారొచ్చు. టిమ్ సౌథీ చాలా క్రికెట్ ఆడాడు. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని అతడికి విశ్రాంతి ఇవ్వాలి. టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్లకు వెంటవెంటనే అలవాటు పడటం కష్టం. కొత్త జట్టుగా ఆడుతుండటంతో కాస్త ఆత్రుతగానే ఉంది' అని విలియమ్సన్ అన్నాడు.

–విలియమ్సన్



ఇప్పుడు కుల్దీప్ యాదవే..
మా ప్రధాన స్పిన్నర్

- టీమిండియా కోచ్ రవిశాస్త్రి

వెల్లింగ్టన్: ప్రస్తుత భారత క్రికెట్ జట్టులో నంబర్ వన్ స్పిన్నర్ ఎవరైనా ఉన్నారంటే అది కుల్దీప్ యాదవేనని కోచ్ రవిశాస్త్రి స్పష్టం చేశాడు. ఇక్కడ రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాల కంటే కూడా కుల్దీప్‌కే తొలి ప్రాధాన్యత ఉంటుందన్నాడు. 'సిడ్నీ టెస్టులో ఐదు వికెట్లతో కుల్దీప్ రాణించడం అతనిలోని ప్రతిభను మరింత వెలుగులోకి తీసుకొచ్చింది. ఆ ప్రదర్శనతో నేను చాలా ఇంప్రెస్ అయ్యా. విదేశీ పిచ్‌లపై మణికట్టు స్పిన్‌తో ఆకట్టుకోవడంలో కుల్దీప్ సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. కచ్చితంగా టెస్టుల్లో మా ఓవర్సీస్ ప్రధాన స్పిన్నర్ అతనే. ఒకవేళ మ్యాచ్‌కు ఒక స్పిన్నర్‌తో వెళ్లాలనే యోచన చేస్తే మాత్రం కుల్దీప్‌కే తుది జట్టులోకి తీసుకుంటాం' అని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.

వన్డే ప్రపంచకప్‌లో
రాయుడు ఆడతాడు

టీమిండియా మాజీ సారథి సౌరభ్ గంగూలీ

కోల్‌కత్తా: ఇంగ్లాండ్ వేదికగా మే నెలలో ప్రారంభంకానున్న వన్డే ప్రపంచకప్‌లో అంబటి రాయుడు ఆడటం దాదాపు ఖాయమైందని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ జోస్యం చెప్పాడు. న్యూజిలాండ్‌తో గత ఆదివారం ముగిసిన ఆఖరి వన్డేలో ఆరంభంలోనే భారత్ జట్టు 18/4తో నిలవగా అంబటి రాయుడు (90: 113 బంతుల్లో 8x4, 4x6) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో జట్టుకి మెరుగైన స్కోరును అందించాడు. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ జట్టు 252 పరుగులకి ఆలౌటవగా ఛేదనలో న్యూజిలాండ్ 217కే కుప్పకూలిపోయింది. మ్యాచ్‌లో గెలిపించే ఇన్నింగ్స్ ఆడిన రాయుడికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. రాయుడి రాకతో మిడిలార్డర్‌లో నిలకడ పెరిగిందని చెప్పుకొచ్చిన గంగూలీ అతను ఇలానే పరుగులు సాధించాలని కాంక్షించాడు. రాయుడు చాలా బాగా బ్యాటింగ్ చేశాడని కితాబునిచ్చాడు. జట్టు ఒత్తిడిలో పడిన దశలో అతను చక్కటి ఇన్నింగ్స్ ఆడాడని, నా అంచనా ప్రకారం రాయుడు తప్పకుండా ప్రపంచకప్‌కు ఎంపిక చేసిన జట్టుతో కలిసి ఇంగ్లాండ్‌కు వెళ్తాడని ఆయన విశ్వాసం వ్యక్తం చేశాడు. టీమిండియా ఇప్పుడు నిలకడగా ఆడుతోందని, ముఖ్యంగా 14,15 మంది క్రికెటర్లు జట్టులో బాగా స్థిరపడ్డారని ఆయన అన్నారు. ప్రపంచకప్ వరకూ వారు గాయపడకుండా ఫిట్‌గా ఉంటే అందరూ ఆ మెగా టోర్నీలో ఆడే అవకాశం ఉంది అని గంగూలీవెల్లడించాడు. న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌ను 4–1తో చేజిక్కించుకున్న భారత్ వెల్లింగ్టన్ వేదికగా బుధవారం తొలి టీ20లో తలపడనుంది. ఇదిలా ఉండగా టీ20 జట్టులో రాయుడికి చోటు దక్కలేదు..!

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043.